UNIVERSAL
LIBRARY

OU_204635

UNIVERSAL
LIBRARY

శ్రీరస్తు.

హరవిలాసము

శ్రీనాథమహాకవిప్రణీతము.

చెన్నపురి.

వావిళ్ల రామస్వామిశాస్త్రులుఅండ్‌సన్సు వారిచే

ప్రకటితము.

1916

All Rights Reserved.

PRINTED BY

V RAMASWAMY SASTRULU & SONS,

AT THE AUDI SARASWATY NILAYA PRESS,

69, MALAYAPERUMAL STREET, MADRAS —1916

పీఠిక.

శ్లో. 'ఇద మన్ధంతమః కృత్స్నం జాయేత భువనత్రయమ్,
యది శబ్దాహ్వయం జ్యోతి రాసంసారం న దీప్యతే.'

అజ్ఞానగాఢాంధతమఃపటలంబుఁ బటాపంచ సేసి ముల్లోకంబుల విశుద్ధదివ్యజ్ఞాన తేజఃపుంజంబు వెలయించి సకలపదార్థస్వరూపంబు నిరూపింప నసాధారణం బగుసాధనంబు శబ్దజ్యోతి

ఇయ్యది నిత్య మై దోషరహిత మై పరమానందరసైకాస్పద మై పరబ్రహ్మాత్మకం బనఁదగి యున్నది.

ఋగాదిచతుర్వేదంబులును, శిక్షాదిషడంగంబులును, మన్వాద్యష్టాదశస్మృతులును, శాతాతపాద్యష్టాదశాగమములును, విష్ణ్వాద్యష్టాదశపురాణములును, వాయవ్యాద్యష్టాదశోపపురాణములును, భాట్టాదిషడ్దర్శనంబులును, భారతాదీతిహాసంబులును, దక్కంగలసకలశాస్త్రంబులు నీశబ్దబ్రహ్మముదివ్యావతారంబులు ఈ శబ్దబ్రహ్మము నుపాసించియే మనపూర్వాచార్యు లగువ్యాసపరాశరాదిమహర్షిసత్తములు నిత్యానందరసైకాశ్రయం బగుమోక్షమార్గము నెఱింగి కృతకృత్యులైరి.

ఇట్టి పరమోపకారకం బగుశబ్దం బిహపరసుఖానందకందం బని నొక్కి వక్కాణించుట సాహసంబు గాదు. కానిచో నివృత్తతర్షులై యరణ్యంబుల వాతాంబుపర్ణాశను లగుమహర్షులుగూడ శ్రీరామాయణాదిదివ్యప్రబంధంబుల రచించి రాత్రియుం బవలు నాశబ్దసుధాప్రవాహమధ్యంబున మునుఁగుచుం దేలుచు నేల యుందురు? దివ్యప్రబంధకవితామృతరసానుభవంబువలనఁ దాము నిత్యానందంబు నొందుటయె కాక భావివిబుధులు పఠితలును శ్రోతలును విషయవైలక్షణ్యము నెఱింగి యుత్కృష్టపదవి నొందుమార్గము గనుగొందురు గాతమనియె మహర్షుల ముఖ్యోద్దేశము

అట్టిమహానుభావు లగుఋషిపుంగవులగ్రంథములు కేవలము భావగర్భములును, బరోక్షమోక్షానందమును బొందించునవియు నగుటచేఁ బ్రతిమనుజునకుఁ దొలుదొలుత సామాన్యముగా వానియందుఁ బ్రవృత్తి గలుగుటదుర్లభము. కాఁబట్టియే ప్రాచీను లగుమహర్షులసంప్ర

దాయము నెఱింగినవారు గావున నర్వాచీను లగుకాళిదాసాదిమహాకవులు సయితము రామాయణాదికావ్యరత్నంబుల వెలుంగుదివ్యకవితారసంబుఁ గ్రోలిక్రోలి మహానందంబు నొందుచుఁ దనివిసనక 'యందఱు నిట్టికావ్యానందంబు ననుభవింతురు గాత' మని దయాపరవశులై సులభముగ నామహర్షికృతిరత్నంబుల రసానుభవంబుఁ జేయఁదగినయోగ్యత నలవఱుచనవియు నించుమించుగఁ బ్రాచీనర్షికృతుల ననుకరించురఘువంశశాకుంతలకాదంబర్యాదిప్రబంధంబుల లోకోపకారకంబులుగ రచించి కవితారసమాధుర్యం బేకాంతంబున ననుభవించి నిత్యతృప్తహృదయులై కీర్తిశేషు లైరి.

సంస్కృతభాషావిలాస మిట్లుండ సంస్కృతజన్యము లగుకర్ణాటద్రావిడాదివైకృతదేశభాషలలోపల 'దేశభాషలందుఁ దెలుఁగు లెస్స' యను పండితవచనానుసరణిగ నుత్తమభాష నాఁబడునాంధ్రభాషయందుఁగూడ ననేకులు నన్నయభట్టతిక్కనాదిమహాకవిసార్వభౌములు కావ్యరత్నంబుల లోకంబున వెలయించి యభిరూపశిఖామణులహృదయంబుల నలరించి కీర్తిశేషులై నెలకొని యున్నారు కాఁబట్టి యిట్టియాంధ్రభాషాకవులదివ్యచారిత్రసుధారసమును గ్రోలి యానందానుభవము సేయుట యవశ్యకర్తవ్య మయినందునఁ బ్రకృత మీహారవిలాసప్రబంధనిర్మాత యగుమనశ్రీనాథునిచారిత్రామృత మించుక చవి చూతము

శ్రీనాథుఁడు

అనవద్యహృద్యకావ్యకల్పనాధురీణుం డగుమహాకవిసార్వభౌముఁడు. ఈ మహాకవి జన్మస్థానమునుగుఱించి

కాశీఖండములో—

సీ. "చిన్నారిపొన్నారిచిఱుతకూఁకటినాఁడు, రచియించితి మరుత్తరాట్చరిత్ర
నూనూఁగుమీసాలనూత్నయౌవనమున, శాలివాహనసప్తశతి నొడివితి
సంతరించితి నిండుజవ్వనంబునయందు, హర్షనైషధకావ్య మాంధ్రభాషఁ
బ్రౌఢనిర్భరవయఃపరిపాకమునఁ గొని, యాడితి భీమనాయకునిమహిమఁ
గీ. బ్రాయ మింతకు మిగులఁ గైవ్రాలకుండఁ, గాశికాఖండ మనుమహాగ్రంథ మేను
దెనుఁగుఁ జేసెదఁ గర్ణాటదేశకటక, పద్మవనహేళి శ్రీనాథభట్టసుకవి."

అనుపద్యమునందు 'కర్ణాటకటక పద్మవనహేళి' (కర్ణాటదేశపట్టణము లనుకమలములకు సూర్యుఁడు) అను విశేషణమును శ్రీనాథుఁడు దనకుఁ గూర్చుకొనియున్నందునను—

భీమేశ్వర ఖండములో—

గీ "ప్రౌఢి పరికింప సంస్కృతభాష యండ్రు, పలుకునుడికారమున నాంధ్రభాషయండ్రు
ఎవ్వరేమన్న నండ్రు నాకేమి కొఱఁత, నాకవిత్వంబు నిజము కర్ణాటభాష."

అను పద్యములోఁ 'నాకవిత్వంబు నిజము కర్ణాటభాష' యని దనకుఁ గర్ణాటభాషయందుఁ గల ప్రేమను సూచించియున్నందునను—

ఆభీమఖండములోనే—

మ "కనకక్ష్మాధరధీర వారిధితటీకాల్పట్టణాధీశ్వరున్
ఘనునిం బద్మపురాణసంగ్రహకళాకావ్యప్రబంధాధిపున్
వినమజ్జ్యాంతరసార్వభౌముఁ గవితావిద్యాధరుం గొల్తు నా
యనఁగుం బాతఁ బ్రదాత శ్రీకమలనాభామాత్యచూడామణిన్."

అనుపద్యమునందు శ్రీనాథునిపితామహుఁడును బద్మపురాణగ్రంథ నిర్మాణాలంకరిష్ణుఁడును కవితావిద్యాధురంధరుండును నగుకమలనాభామాత్యగ్రామణి పశ్చిమసముద్రతీరమునఁ గర్ణాటదేశములోఁ జేరిన కాల్పట్టమునకుఁ బ్రభువుగా నున్నట్లు చెప్పియున్నందునను—

శ్రీనాథుని వీధినాటకములో—

శా "కుల్లాయుంచితిఁ గోకసుట్టితి మహాకూర్పాసముం దొడ్గితిన్
వెల్లుల్లిన్ దిలపిష్టమున్ బిసికితిన్ విశ్వస్తవడ్డింపఁగాఁ
జల్లాయంబలిఁ ద్రావితిన్ రుచులు దోసంబంచుఁ బోనాడితిన్
దల్లీ! కన్నడరాజ్యలక్ష్మి! దయలేదా నేను శ్రీనాథుఁడన్."

అను పద్యమునఁ "దల్లీ" యని కర్ణాటదేశమును సంబోధించి నందు నను—

ఈతనికవిత్వమునం బ్రాయికముగాఁ గన్నడపదములు గనఁబడుచున్నందునను—

శ్రీనాథునిజన్మస్థానము కర్ణాటదేశమనుట సమంజస మనియు నీతఁడు కర్ణాటదేశమున జన్మించినను శైశవముననే యీతనితలిదండ్రు లుద్యోగవశముననో మఱియు నేకారణముననో కొండవీటిసీమకు వచ్చి

యుందురనియు నింటిలోఁ దలిదండ్రులతో మిశ్రకర్ణాటము మాట్లాడు చున్నను బాల్యమునుండి తెలుఁగుదేశములోఁ దెలుఁగువారితోఁ గలసి మెలసి యున్నందునఁ దెలుఁగువానివలెఁ దోఁచుచున్నాఁడనియు బల్నాటి వీరచరిత్రపీఠికాకారుల వాదము

ఈ వాదమునకుఁ బ్రతికోటి ననుసరించి యాంధ్రులచరిత్ర మూఁడవభాగములో— 'కర్ణాటకటకపద్మవనహేళి' అను విశేషణము కర్ణాట దేశాధీశుని (దేవరాయల) నిండోలగంబునఁ బాండిత్యశౌండీర్యంబున నుద్దండుఁ డగుడిండిమభట్టారకు నోడించి ప్రభుపండితసమ్మానపూర్వకం బుగఁ గవిసార్వభౌమబిరుదమున నలరారుటయె కాక యక్కవిసూర్యుఁడు కర్ణాటరాజధాని (యందలి విబుధరాజి) యనుకమలవనమునకు సూర్యుఁడై యుండెనను నభిప్రాయమునఁ దనకుఁ గూర్చుకొనియెఁ గాని కర్ణాట దేశాభిమానమునం గాదనియు,

'నా కవిత్వంబు నిజము కర్ణాటభాష' అనుపద్యము రాజమహేంద్రవరాధీశుమంత్రి బెండపూఁడియన్నయామాత్యునకుఁ గృతి యిచ్చిన భీమఖండములోనిది గాన కొమటివేమభూపాలుమరణానంతరము కొండవీటిరాజ్యము కర్ణాటాధీనము గాఁగా శ్రీనాథుఁ డన్నామాత్యునిబాంధవ్యమును బట్టి రాజమహేంద్రవరమున కేతెంచి తద్రాజాస్థానకవీశ్వరుఁడుగ నున్నకాలమగుటచేఁ గాకతీయరాజ్య మంతరించినపిదప నాంధ్రదేశమున దక్షిణభాగము (పాకనాటిసీమవఱకుఁ గలదేశము) కర్ణాట రాజ్యమనఁ బరఁగుచున్నందున నచ్చటివాఁడగు శ్రీనాథుని గుఱించి రాజమహేంద్రవరపుఁబండితులు గొందఱతనికవిత్వము సంస్కృత మనియుఁ గొందఱు కన్నడమనియు వంకలుపెట్ట 'నెవ్వ రేమన్న నండ్రు నాకేమి కొఱఁత, నా కవిత్వంబు నిజము కర్ణాటభాష' యని యుత్తరము చెప్పియుండు ననియు,

'తల్లీ ! కన్నడరాజ్యలక్ష్మి !' యనుకర్ణాటదేశమాతృసంబోధనము తనకాశ్రయులగు కొండవీటిరెడ్లు, రాజమహేంద్రవరపురెడ్లు, తెలుఁగురాయఁడు, మైలారిరెడ్డి మున్నగువారు స్వర్గస్థు లయినపిదప వార్ధక్యములోఁ గన్నడరాజ్యమున కేగి నపు డాకాలస్థితిని బట్టి వారు తన్నాదరింపకుండ 'తల్లీ ! దయలేదా ? నేను డిండిమభట్టారకునోడించిన శ్రీనాథుఁడ' నని తన్నుఁ దెలుపుకొని యుండవచ్చుననియు,

'కాల్పట్టణాధీశ్వరుఁ' అనుచో నాకాల్పట్టణముకర్ణాటరాజ్యము లోని దైనట్లు నిదర్శనములు లేనందున నాయుక్తి విశ్వాసపాత్రముగా దనియు నిట్లు పైకారణముల ఖండించి శ్రీనాథుఁడు పాకనాఁడు జన్మస్థానము గాఁ గలయాంధ్రుఁడని చెప్పఁబడియున్నది.

ఈయుభయవాదహేతువులందును బలవత్తర మగువినిగమన గనఁబడక పోయినను మఱికొన్నికారణములవలనను జనశ్రుతివలనను నాంధ్రచరిత్రకారులయభిప్రాయమె సమంజస మని తోఁచుచున్నది.

ఇద్దానికుపబలముగా శ్రీనాథుని బంధువు లందఱు నాంధ్రదేశము లోనియాంధ్రులుగనే యున్నారుకాని కర్ణాటకుఁ డొక్కరుఁడైన నున్నట్లు తెలియఁబడదు

నాచికేతూపాఖ్యానమును రచించి యుదయగిరిదుర్గాధీశుఁ డగు చిట్టిగంగామాత్యునకుఁ గృతి యిచ్చినదగ్గుపల్లి దుగ్గయామాత్యుఁడు శ్రీనాథునిభార్యకుఁ దోఁబుట్టువు శ్రీనాథునకు శిష్యుఁడు ఈ గ్రంథమును ఓరియంటల్ లైబ్రరిలో నేఁ జదివియున్నాఁడను. ప్రౌఢముగా రసవంతము గానే యున్నది.

రాజమహేంద్రవరాధిపతి యగువీరభద్రభూపాలునిమంత్రి బెండపూడి యన్నామాత్యుఁడు—

"వినిపించినాఁడవు వేమభూపాలున, కఖిలపురాణ విద్యాగమములు

... ...

గీ పాకనాటింటివాఁడవు బాంధవుఁడవు, కమలనాభునిమనుమఁడవమలమతివి
నాకుఁగృపసేయు మొకప్రబంధంబునీవు, కలితగుణధన్య శ్రీనాథకవివరేణ్య."

అని పలికె నని భీమఖండమున శ్రీనాథుఁడె వచించియున్నాఁడు ఇందు 'కమలనాభుని మనుమఁడ'వనియుఁ బేర్కొనినందున శ్రీనాథుఁడే కాక యితనితాత యగుకమలనాభుఁడు గూడ నన్నయమంత్రికిఁ జుట్టమని తేటపడుచున్నది.

మఱియు నాంధ్రభాగవతము రచించి శ్రీరామున కర్పణముసేసిన భాగవతోత్తముఁడగుబమ్మెరపోతరాజునకును శ్రీనాథునకును సంబంధించిన శిష్టపరంపరాగతము లగు గాథలను బట్టి చూడఁ గొన్ని గాథలు సత్యాసత్యములుగ నున్నను వేంకటగిరివంశావళివలన సర్వజ్ఞసింగమనాయనికాల

ములో నీకవులు సమకాలికులుగ నున్నట్లు తెలియుచున్నందునఁ గింవదంతి కనుకూలముగ నుభయులు బావమఱఁదులు నై యుండ వచ్చును గదా!

ఇఁకఁ గవిత్వములోఁ గన్నడపదములు ప్రాయికములుగాఁ గనఁ బడుచున్న వనుటకుఁ దిక్కన సోమన మున్నగువారికవిత్వమునఁగూడ గలవు కావున వారిం గర్ణాటులని యనఁ దగదు గదా' ఒకవేళ శ్రీనాథుఁడు కర్ణాటదేశీయుఁడై యా దేశభాషలందుఁ బ్రేమగలిగినవాఁడైన నెన్నియో కర్ణాటగ్రంథముల రచింప కుండునా! ఏదీ యొక పద్యమయినం గానరాదే?

ఇంతియకాక యీతనితాత కమలనాథుఁడు పద్మపురాణము దెనిగించె ననుటవలన నీతనివంశ మాంధ్రవంశమనియు నితనిదేశ భాషలాంధ్రదేశ భాషలనియును దృఢపడుచున్నవి తద్జ్ఞులు ప్రమాణము. శ్రీనాథుఁడాంధ్రకర్ణాటులలో నెవ్వం డైననుగవితామాధురికి లోపము గల్గదు గదా!

శ్రీనాథుఁడు పాకనాటి నియోగి బ్రాహ్మణుఁడు, భారద్వాజసగోత్రుఁడు, ఆపస్తంబసూత్రుఁడు, కమలనాభునిపౌత్త్రుఁడు, మారయకు భీమమకుఁ బుత్త్రుఁడు. ఈ విషయము హరవిలాసము పీఠికలోని 'కమలనాభుని పౌత్త్రు' అను 8 వ పద్యమువలన స్పష్టము

ఇక్కవిసార్వభౌమునివలననే కొండవీటిరెడ్లు, రాజమహేంద్రవరపురెడ్లు వన్నెకెక్కిరి ఈ కవీంద్రుఁడు జీవించి యుండుకాలముం గుఱించి విచారణీయాంశము లనేకము లున్నను విస్తరభీతి సంగ్రహముగ వివరించెద

శ్రీనాథుఁడు క్రీ శ 1397 సం. మొ 1422 సం. వఱకు రాజ్యము చేసిన ఫిరోజిషా కాలముననుు, 1382 సం మొ 1399 సం వఱకు రాజ్యమొనర్చిన కుమారిగిరి వసంతభూపాలుకాలముననుు, 1379 సం మొ 1401 సం వఱకు కర్ణాటసింహాసనాధిష్ఠితుఁడైన హరిహరరాయలకాలముననుు, 1422 సం మొ 1435 సం వఱకు కల్బరిగరాజ్యమును బాలించిన యహమ్మదుషా కాలముననుు, అల్లాడభూపతిపుత్త్రులును, 1426 సం. మొ 1450 సం వఱకు రాజ్యముఁ బాలించిన వేమారెడ్డి - వీరభద్రారెడ్లకాలమున నున్న ట్లీకవిగ్రంథములవలనఁ దెలియుచున్నది. ఈవీరభద్రారెడ్డియు వేమారెడ్డియు మరణించిన పిదపఁ గొంతకాలమునకు కృష్ణాతీరములోని బొడ్డుపల్లె యనునొకగ్రామమును గుత్తచేసి నదీ

ప్రవాహమునఁ బైరుగొట్టుకొని పోఁగా రాజునకు గుత్తధనముఁ జెల్లింపలేక వారిచేఁ బలుబాధల నొంది యవసానకాలమున మిక్కిలి బీదతన మనుభవించెనని మెకన్జీదొర యుదహరించిన స్థానికచరిత్రలోని శ్రీనాథకృతము లగు నీరెండు పద్యములవలనఁ దెల్లమగుచున్నది

"సీ. కవిరాజుకంఠంబుఁ గౌఁగిలించెను గదా, పురవీథి నెదురెండ పొగడదండ
సార్వభౌమునిభుజాస్తంభ మెక్కెను గదా, నగరివాకిటనుండు నల్లగుండు
ఆంధ్రనైషధకర్త యంఘ్రియుగ్మంబునఁ, దగిలి యుండెను గదా నిగళయుగము
వీరభద్రారెడ్డివిద్వాంసుముంజేతి, వియ్యమందెను గదా వెదురుగొడియ
గీ. కృష్ణవేణమ్మ గొనిపోయె నింతఫలము, బిలబిలాక్షులు దినిపోయెఁ దిలలు పెసలు
బొడ్డుపల్లెను గొడ్డేలి మోసపోతి, నెట్లు చెల్లింతు టంకంబు లేడునూర్లు
సీ. కాశికావిశ్వేశుఁ గలిసె వీరారెడ్డి, రత్నాంబరంబు లేరాయఁ డిచ్చుఁ
గైలాసగిరిఁ బండె మైలారువిభుఁ డేగి, దినవెచ్చ మేరాజు తీర్పఁగలఁడు
రంభఁ గూడెఁ దెనుంగురాయరాహుత్తుండు, కస్తురి కేరాజుఁ బ్రస్తుతింతు
స్వర్గస్థుఁ డయ్యె విస్సనమంత్రి మఱిహేమ, పాత్రాన్న మెవ్వనిపంక్తిఁ గలదు
గీ. భాస్కరుఁడు మున్నె దేవునిపాలి కరిగె, కలియుగంబున నిఁకనుండఁ గష్టమనుచు
దివిజకవివరుగుండియల్ దిగ్గు రనఁగ, నరుగుచున్నాఁడు శ్రీనాథుఁ డమరపురికి."

పై కారణములఁబట్టి శ్రీనాథుఁడు క్రీ. శ. 1384 సం. ప్రాంతమున జన్మించి 1455 సం ప్రాంతమువఱకు 70 సంవత్సరములు జీవించి యుండవచ్చునని యూహింపవలసియున్నది

మహారాజాస్థానములఁ గవిసార్వభౌముఁడై మహాభోగముల ననుభవించినవాఁడయ్యును నవసానదశయందుఁ బలుకష్టములపాలగుట యౌవనదశలో శృంగారనాయకుఁ డయి స్త్రీలోలుఁడై విశృంఖలప్రవృత్తిచే ధనమెల్ల వెచ్చపెట్టి దేహమును సైతము జెఱచుకొన్నపాపపుఫలము గాని యన్యముగాదని కొందఱందురు.

శ్రీనాథుఁడు లోకుణికోత్తముఁ డగుమహాకవి. ఈకవిబ్రహ్మకావ్యప్రపంచకల్పనాచాతుర్య మవాఙ్మానసగోచరము వర్ణనాసందర్భముల నర్థగంభీరము లగుమృదుపదములఁ బొందుపఱచి రసమును విడనాడక మనోహరంబుగఁ గవనమల్లుననల్పకౌశల మీతని కలవడినట్లు మఱియొక్కకవి కలవడలేదు 'కాశీఖండ మయఃపిండం నైషధం విద్వదౌషధమ్'. అని కొనియాడఁబడు నీ రెండుగ్రంథములభాషాంతరీకరణమువలననే యీ కవిపాండిత్య మనర్గళ మని తెల్లముగాఁ గలదు ఈతనికవిత్వము

మొత్తముమీఁద సంస్కృతపదభూయిష్ఠమై మనోహరమై యుండును. లోకములో నాంధ్రభాషాసాహితిఁ బడయఁగోరు విద్యార్థులు శ్రీనాథుని గ్రంథములఁ జక్కఁగఁజదివిన మఱియొక గ్రంథముఁ జదువవలసిన పనియుం డదనియే నానమ్మకము.

ఇతఁడు మహాకవియై యుండియుఁ బారలౌకికచింతమై భగవంతున కొక కృతియైన నీక తనగ్రంథములన్నియు నర్థలోభమున మనుజుల కిచ్చుట చూడ నెంతయు చిత్రముగ నున్నది.

ఈయన పండితారాధ్యచరిత్ర, మరుత్తరాట్చరిత్ర, శాలివాహన సప్తశతి, శృంగారనైషధము, భీమఖండము, కాశీఖండము, హరవిలాసము, నందనందనశతకము—అను గ్రంథముల రచించి జగద్విఖ్యాతిఁ బడసెను పల్నాటివీరచరిత్రమునుగూడ రచించినట్లు చెప్పఁబడియున్నది కాని ప్రాసములేనియట్టి తక్కిరిబిక్కిరి ద్విపదకవిత్వ మల్లియుండునా? యని సంశయము. ఉండిన నుండుఁగాక వీథినాటకముగూడ నీకత్యలోనిదే

ఈగ్రంథములలోఁ బండితారాధ్యచరిత్రము వేమారెడ్డిసేనానాయకుఁడగు మామిడి ప్రెగడయ్యకును, నైషధము నాతనితమ్ముఁడగు సింగనమంత్రికిని, భీమేశ్వరఖండమును వీరభద్రారెడ్డి మంత్రియగు బెండపూడి యన్నయ్యకును, కాశీఖండమును వీరభద్రారెడ్డికి నంకితము చేసెను ఈ గ్రంథములపౌర్వాపర్యమును విచారింప కాశీఖండములోని

'చిన్నారి పొన్నారి చిఱుతకూఁకటినాఁడు, రచియించితిమరుత్తరాట్చరిత్ర'

అనుపద్యమువలనను, శృంగారనైషధములోని—

"క జగమునుతింపఁగఁ జెప్పితి, ప్రెగడయ్యను నయనుంగుఁ బెద్దనసుఁ గృతుల్
నిగమార్థసారసంగ్రహ, మగునాయారాధ్యచరిత మాదిగఁ బెక్కుల్"

అను పద్యమువలనను జిన్ననాఁటినుండి మహాకవియై 18 సం వయస్సున మరుత్తరాట్చరిత్రయు, 20 సం శాలివాహనసప్తశతియు, 25 సం. పండితారాధ్యచరిత్రయు, 30-35 సం శృంగారనైషధమును 40 సం. భీమఖండమును, 45 సం కాశికాఖండమును, రచించియుండు నని తోఁచుచున్నది

హ ర వి లా స ము.

ఇది 7 ఆశ్వాసముల ప్రబంధము. పైగ్రంథములలో నెయ్యెడ నిది జేర్కొనఁబడనందునఁ గాశికాఖండమునకుఁ బిదప రచించె నన వలసి

యున్నది అన్ని గ్రంథముల కన్న స్వాభావిక మగుకవితాశైలియు నీవిష యమునే బలపఱుచుచున్నది ఇయ్యది క్రీ.శ 1370 సం. మొ 1391 సం వఱకుఁ గొండవీటిసీమఁ బాలించిన వేమారెడ్డికాలములోఁ బాలుఁడై వేమారెడ్డిపుత్రుఁ డనపోతరెడ్డి సేనాధిపతియై యుద్ధములో మడియు టచే నాతనియనంతరమున నే రాజ్యమునకు వచ్చిన కొమరగిరి భూపాలుని సుగంధద్రవ్య భాండాగారాధ్యక్షుఁడైన యవచి తిప్పశెట్టి కంకితమీఁ బడినది హరవిలాసములో నీతఁడు 'మంటి బహువత్సరంబులు' అని చెప్పు కొనుటచే గృతినందునాఁటికి 65 సం వయసువాఁడై యుండును. ఇతనికి బాల్యసఖుఁడగు శ్రీనాథుఁడును 50 సం. వయసువాఁడై యుండును.

తిప్పసెట్టి వైశ్యుఁడు (బేరిసెట్టి), తండ్రి దేవయసెట్టి, తల్లి మాచమ్మ, జామిసెట్టి - తిరుమలనాథసెట్టియుఁ దమ్ములు, భార్య అన్నమ్మ, మాచన-విశ్వనాథుఁడు-చినమల్లన-కుమారులు, ఇతనికిఁ ద్రిపురారియను సంస్కృత నామము గలదు ఈతని వంశ చరిత్రమంతయు హరవిలాస పీఠిక వలనం దేటపడుచున్నది

ఈ కావ్యమునందు 1-2 ఆశ్వాసముల సిరియాళచరిత్రమును, 3-4 ఆ గౌరీకల్యాణమును, 5-వ ఆ పార్వతీపరమేశ్వరులదారుకావన విహారంబును, 6-వ ఆ హాలాహలభక్షణంబును 7-వ ఆ కిరాతార్జు నీయమును వర్ణింపఁబడినవి 8-వ యాశ్వాసముతుదిఁ గొన్నిపద్యము లశ్లీలములుగ నుండుటచే విడువంబడినవి పూర్వకవిసంప్రదాయాను సారముగ నితరగ్రంథముల నుభయభాషాకవిస్తుతి చేయఁబడియున్నను నిందుఁ గవిస్తుతి గాని కుకవినింద గాని చేయఁబడమికిఁ గారణము దెలి యదు ఇయ్యది నైషధాదులవలె సంస్కృతపదప్రచురము గాక సమ సంస్కృతాంధ్రపదవిలసితమై రసభావాలంకృతంబై యలరారుచున్నది. నైషధకాశీఖండములవలె సంపూర్ణ సంస్కృతగ్రంథభాషాంతరీకరణము గాదు కాని యిందలిగౌరీకల్యాణము కాళిదాస కుమారసంభవమున కాంధ్రీకరణము గానే యున్నది స్థాలీపులాకన్యాయంబుగ నుదాహ రించెద.

"శ్లో. కా మేకపత్నీవ్రతదుఃఖశీలాం లోలం మనశ్చారుతయా ప్రవిష్టామ్,
నితంబినీ మిచ్ఛసి ముక్తలజ్జాం కంఠేస్వయంగ్రాహనిషక్తబాహుం కుమా. సర్గ-3 శ్లో-8.

గీ. ఏకభర్తృవ్రతస్థయై యేలతాంగి, నీకుఁ జేయాడ ధర్మంబు నిలుపరించె
నది వినిర్ముక్తలజ్జయై యమరరాజుఁ, జేయుఁ గాఁత స్వయంగ్రహాశ్లేషణంబు
హర. ఆ-3. ప-45.

శ్లో. కయాఽసి కామిన్ సురతాపరాధాత్పాదానతః కోపనయాఽవధూతః,
తస్యాః కరిష్యామి దృఢానుతాపం ప్రవాళశయ్యాశరణం శరీరం కు సర్గ-3. శ్లో-౮.

గీ. ప్రణయకోపప్రశాంతికై పాదపతితు, నిన్ను నెవ్వఁ బోఁడి మన్నింపదయ్యె
నాలతాంగిఁ బ్రవాళశయ్యాశరణ్య, దేహఁ గావింతు విడువు సందేహ మింద్ర.
హర. ఆ-3. ప-46.

శ్లో. స్థితాః క్షణం పక్ష్మసు తాడితాధరాః పయోధరోత్సేధనిపాతచూర్ణితాః,
వలీషు తస్యాః స్ఖలితాః ప్రపేదిరే చిరేణ నాభిం ప్రథమోదబిందవః.
కుమార. సర్గ-౫ శ్లో-౨౪.

వ వర్షాకాలంబునఁ బక్ష్మపాళీక్షణస్థితంబులును దాడితాధరంబులును బయోధరోత్సేధ నిపాతచూర్ణితంబులును ద్రివళీవలయస్ఖలితంబులును నాభిగహ్వరప్రవిష్టంబులు నగు జలధరజలబిందుధారలం దోఁగియు. హర ఆ-4 ప 14.

శ్లో. దివం యది ప్రార్థయసే వృథా శ్రమః పితుః ప్రదేశాస్తవ దేవభూమయః,
అథోపయంతార మలం సమాధి నా నరత్నమన్విష్యతి మృగ్యతే హితత్.
కుమార. సర్గ-5. శ్లో ౪౫.

వ. దేవలోకనివాసంబున కాసపడి దేని నది వృథాశ్రమంబు. నీ పుట్టినిల్లు దేవభూమియ కదా! తగినవరునిం గామించి సమాధి వహించితి వేని నదియు నీకుం దగదు. రత్నం బొరునిచే నన్వేషింపంబడుఁగాని యొరు నన్వేషించునే" హర. ఆ-4 ప-24.

ఇట్లే దారుకావనవిహారము, హాలాహలభక్షణము, కిరాతార్జునీయము ప్రాయికముగా భారవికృతినుండియుఁ దక్కిన కథలు పురాణములనుండియు గ్రహింపఁబడినవి అచ్చటచ్చట నౌచితికిఁ దగినట్లు 'చంకదుడ్డును శరణార్థి' (ఆ 6 ప 17) మున్నగులోకోక్తుల నిమిడ్చి యున్నాఁడు చాగు, ఉక్కివడి, గగ్గోడువడు, చాయగోసులు, కుంచవర్ధనములు, తోరహత్తము, గజ్జులాఁడు మున్నగు క్రొత్త పదములఁ బెక్కింటిఁ బ్రయోగించి యున్నాఁడు. ('వాగ్వివాదము ఆ 7 ప 60) అంతర్వాణీ సంస్తూయమాన' (పీఠిక. ప 34) యను ప్రామాదికప్రయోగములు గనబడుచున్నవి 6-వ యాశ్వాసము 5-6 పద్యము లేకార్థబోధకములై పునరుక్తములుగ నున్నవి.

ఇ ట్లెద్దోషము లున్నను నల్పజ్ఞు లగు లేఖకు లవి యై యుండును గాని సకలశాస్త్రపారంగతుఁడును మహాకవిసార్వభౌముఁ డగుశ్రీనాథుని వై యుండవు. ఇట్టి జగత్ప్రసిద్ధంబగు ప్రౌఢపండితకవికవితామతల్లిఁ గుఱించి శాఖాచంక్రమణ మనవసరంబ కాఁ దలంచి యింతటితో విరమించుచున్నాఁడను.

శ్రీమాన్, ఉత్పల. వేంకటనరసింహాచార్యః.

శ్రీరస్తు.

హరవిలాసము.

పీఠిక.

శ్రీమహిళాపయోధరహరిన్మణిహారము హస్తిభూధర
స్వామి పయోజసంభవుని జన్నముఁగాచిన వేల్పు దేవతా
గ్రామణి కంచి శ్రీవరదరాజు మనోహరపుణ్యకోటిపీ
ఠీమణిమండితుం డవచి దేవయతిప్పఁ గృతార్థుఁ జేయుతన్. 1

ఉ. మావిడిమోకక్రింద నిగమత్రితయార్థసమృద్ధి పార్వతీ
దేవికుచంబులం బదనుదీర్పనికస్తురిముద్ర గా జగ
జ్జీవనకారణం బయినశ్రీనిధి కంచిపురీశ్వరుండు మా
దేవయసెట్టినందనుని దిప్పఁ గృతార్థుని జేయుఁ గావుతన్. 2

సీ ఏదేవితులుముపై నేఁడు కాలముదాఁకఁ, గసుగందకుండుఁ జెంగలువదండ
యేదేవి సేవింతు రేకామ్రనాథుండుఁ, గరిగిరీశ్వరుఁడు గింకరులుపోలె
నేదేవిమణిదివ్యపాదుకాయుగళంబుఁ, బాతాళపతి మోయుఁ బడగలందు
నేదేవిఁ గొల్చి మత్స్యేంద్రనాథాదులు, యోగసంసిద్ధికి నొడయు లైరి
గీ. యమ్మహాదేవి కామాక్షి యఖిలవంద్య, దేవతాదిమశక్తి సందీప్తమూర్తి
యవచిదేవయత్రిపురారి కర్థి నొసఁగు, భాగ్యసౌభాగ్యవైభవప్రాభవములు. 3

క. వాణికిఁ జరణానతగీ, ర్వాణికి నేణాంకశకలరత్నశలాకా
వేణికి పుస్తకవీణా, పాణికి సద్భక్తితో నుపాస్తి యొనర్తున్. 4

సీ. కలితకుండాదండగండూషితోన్ముక్త, సప్తసాగరమహాజలధరములు
వప్రక్రియాకేళివశవతీర్ణసువర్ణ, మేదినీధరరత్నమేఖలములు
పక్వజంబూఫలప్రకటసంభావనా, చుంబితభూభృత్కదంబకములు
వికటకండూలగండకదేహమండలీ, ఘట్టితబ్రహ్మాండకర్పరములు

గీ శాంభవీశంభులోచనోత్సవకరములు, వాసవాద్యమృతాశనవందితములు
విఘ్నరాజమదోల్లాసవిభ్రమములు, మించి విఘ్నోపశాంతిఁ గావించుఁ గాత. 5

సీ. వేదండవదనశుండాదండగండూష, కాండసిక్తాప్సరోమండలములు
కంఠావలంబితకనకసౌగంధిక, మాలికాలగ్నషాణ్మాతురములు
నందీశ్వరక్షిప్తనారంగఫలపాక, తరళవిద్యాధరీస్తనభరములు
గరుడలీలావతీకస్తూరికాపంక, పిహితనిశ్శేషాంగభృంగిరిటులు
గీ. వీరభద్రవతీర్ణకర్పూరచూర్ణ, ధవళితాకాశచరవనితాముఖములు
శాంభవీశంభుమధుకేళిసంభ్రమములు, పొదలి వాసించుఁ గాత నాహృదయవీథి. 6

వ. అని ప్రార్థించి త్రిపురాంతకదేవదివ్యశ్రీ పాదపద్మారాధకుండును బరమసాధకుండును గమలభవోరుసంభవవిమలవంశావతారుండును ధర్మద్రావిడబిరుదాధారుండును సుజనవిధేయుండును గర్పూరవసంతరాయుండును గీర్తివనితావల్లభుండును బ్రతిదినసమారాధితపరమేశ్వరుండును మాణిక్యసింహాసనాధీశ్వరుండును నంగీకృతభూసురాశీర్వాదుండును దానధర్మపరాయణుండును నిమ్మడిగరుడనారాయణుండును నిజకీర్తిశాసనస్తంభాయమానదిగంతదంతావళదంతుండును నభయద్రావిడుండును గిష్కింధాచలక్రీడావినోదుండును వశీకృతనిఖిలభూభుజుండును సతతత్యాగధ్వజుండును వినిర్మలకులశీలుండును బాండ్యరాయకందుకక్రీడావిలోలుండును గవిజనస్తోత్రపాత్రుండును గౌండిన్యగోత్రపవిత్రుండును జతుష్షష్టివిద్యాజన్మభూమియు నయోధ్యానగరస్వామియో యనఁ బరఁగి జంబూద్వీపభూభువనమండలీముకుటమండనాయమానంబగు కొండవీడుపురంబు రాజధాని గాఁ గీర్తిలతాధిష్ఠితాష్టాదశద్వీపాంతరాళుండు నగు కొమరగిరివసంతనృపాలువలన నాందోళికాఛత్రచామరతురంగాది రాజ్యచిహ్నములు వడసి యమ్మహారాజునకుం బ్రతిసంవత్సరోత్సవంబునకుం దగినకస్తూరీకుంకుమఘనసారసంకుమదహిమాంబు కాలాగురుగంధసారప్రభృతి సుగంధద్రవ్యంబు లోడఁగూర్చియుఁ జీని సింహళ తవాయి హురుమంజి జలనోగిప్రభృతినానాద్వీపనగరాకరంబులగు ధనకనకవస్తువాహనమాణిక్యగాణిక్యంబులు తెప్పించియుఁ గవినైగమికవాదివాంశికవైతాళికాదు లగునర్థిజనంబులకు నర్థంబులు గుప్పించియు ధీరుండును నుదారుండును గంభీరుండును సదాచారుండును నన విఖ్యాతి గాంచిన యవచిదేవయతిప్పప్రభుం డొక్కనాఁ డాస్థానమంటపంబున సుఖోపవిష్టుం డై. 7

సీ. కమలనాభునిపౌత్రుఁ గవితామహారాజ్య, భద్రాసనారూఢుఁ బరమపుణ్యుఁ
బాత్రు నాపస్తంబసూత్రు భారద్వాజ, గోత్రు సజ్జనమిత్రుఁ గులపవిత్రు
భీమాంబికామారనామాత్యనందను, నఖిలపురాణవిద్యాప్రవీణు
నధ్వర్యు వేదశాఖాతిథినిష్ణాతు, నంధ్రభాషానైషధాబ్జభవుని

గీ. నుభయభాషాకవిత్వప్రయోగకుశలు, బాలసఖు గారవించి తాత్పర్య మొప్ప
నవచిదేవయత్రిపురారి యక్షరాజు, హితమితోక్తులు వెలయఁగ నిట్టు లనియె. 8

క. కంటిని విశుద్ధసంతతి, వింటిఁ బురాణములు పెక్కు విశ్వము వొగడఁగ
మంటి బహువత్సరంబులుఁ, గొంటి యశోధనము సుకవికోటి నుతింపన్. 9

సీ. కట్టించె నొకతాత కంచిహర్మ్యంబులు, హరిణాంకమౌళి కేకామ్రపతికి
బాలార్కమనియెడిపద్మరాగముఁ దాచె, నొకతాత కంచినాయకునినాభి
నొకతాత గట్టించె యోజనత్రయదీర్ఘ, తరతటాకాంభోధి తిరువళూరఁ
గావేరి గట్టించెఁ గార్పాసరాసుల, నుబ్బి చోడఁడు మెచ్చ నొక్కతాత

గీ. ప్రతిదినమ్ముఁ గపురపుఁదీపములు వేయుఁ, వ్రతముగా నొక్కతాతయీశ్వరునకొసఁగె
నిఖిలలోకప్రసిద్ధవాణిజ్యవంశ, ధరులు మాతాత లుభయగోత్రములవారు. 10

గీ. శైవవైష్ణవసమయదీక్షావిశేష, ధన్యమానసు లుభయగోత్రములవారు
నాయభీష్టం బొకఁడు పిన్ననాఁటనుండి, పరమమాహేశ్వరాచారభక్తిపరము. 11

గీ. ఆగమజ్ఞాననిధివి తత్త్వార్థఖనివి, బహుపురాణజ్ఞుఁడవు శుభభవ్యమతివి
బాలసఖుఁడవు శైవప్రబంధ మొకటి, యవధరింపుము నాపేర నంకితముగ. 12

వ. అనిన నేనును శుభముహూర్తమున నిజాంతరంగమంగళాయతనకుమారాచలత్రిపురాం
తకుం డవచిదేవయ త్రిపురారికృతిస్వామి గా హారవిలాసం బను ప్రబంధంబు సెప్పం
దొడంగి యమ్మహాప్రబంధముఖతిలకాయమానం బగుతదీయవంశం బభివర్ణించెద. 13

సీ. **ముయ్యేడు**వాసరంబు లకాలవర్షంబు, జడిపట్టి కురియఁ బర్జన్యుఁ బనిచి
శివుఁడు తా నొకవృద్ధశివయోగి యై గ్రుడ్డి,య వైవ్వణతపజలజాక్షితోడఁ
గడువేడ్కఁ జనుదెంచి కొడుకుమాంసముతోడి, భోజనంబునకు విభూతి యొసఁగి
పుత్త్రుఁ బాకముఁ జేసి బోనముపెట్టినఁ, గుడువంగ నొల్లక పెడముపెట్టి

గీ. వీరమాహేశ్వరాచారవీథియందు, నిజముగా నిల్పె నెవ్వాని నియతిపరుఁడు
వాఁడు పాత్రుండు గాఁడె కైవారమునకు,దురితదూరుండు శ్రీచిరుతొండనంబి. 14

సీ. అర్ధరాత్రంబున నల్లాడనాథుండు, దానె యెవ్వనికిఁ గైదండ యిచ్చెఁ
బదకంపుఁబచ్చన బైవేయవచ్చిన, దనుజారి నిల్పె నెవ్వనినిజంబు
అలిగి పోయిన వేంకటాచలంబున కేగి, కొనివచ్చె నెవ్వాని కుధరధరుఁడు
వైకుంఠనాథుఁ డెవ్వనిసేవకును మెచ్చి, యాత్మసత్కారకళ్యాణ మొసఁగె

గీ. నతఁడు భాగవతోత్తముం డతఁడు శుద్ధుఁ, డతఁడు వైరాగ్యసంపన్నుఁ డతఁడు ఘనుఁడు
పరమవైష్ణవసభ నుతింపఁగఁ దగఁడె, కాంచినగరికుటుంబి శ్రీకంచినంబి. 15

వ. అందు. 16

గీ. సింహవిక్రమపట్టణశ్రేష్ఠుఁడైన, సెట్టి జగజెట్టి పావాణిసెట్టివిభుఁడు
ఘనుఁడు నగరీశచంద్రశేఖరపదాబ్జ, వందనానందితాత్ముండు వంశకరుఁడు. 17

క. శ్రీపర్వతసోపాన, స్థాపకుఁ డగురెడ్డివేమజగతీపతికిన్
బ్రాపైనయవచిదేవయ, యాపావాణికి జనించె నభ్యుదయముతోన్. 18

ఉ. విశ్వజగత్ప్రసిద్ధుని వివేకనిరంజనరామనాథయో
గీశ్వరపాదసేవకు నహీనదయాగుణశాలి వీరమా
హేశ్వరచక్రవర్తిఁ దరుణేందుకళాధరభక్తిభావనా
శాశ్వతచిత్తు మాయవచిసెట్టిను దేవయ నెన్న శక్యమే. 19

ఉ. ఆతతభక్తిసంపద నహర్నిశముణ్ ఘృతఖండశర్కరా
పాతములో నపూపములు పాయసముణ్ గదళీఫలంబులుణ్
నీతము గాఁగ నన్నములు పెట్టును శంకరభక్తకోటి కా
సేతుహిమాచలం బవచిసెట్టికి నెవ్వరు సాటి యిమ్మహిన్. 20

వ. ఆయవచిదేవయకు మాచాంబయందుఁ ద్రిపురారియు తిరుమలనాథుండు జామిసెట్టి
యు ననుమువ్వురుతనయులు పుట్టి రందు. 21

ఉ. ఖుసి మీఱణ్ సురధాణ నిండుకొలువై కూర్చున్నచో నీకరా
భ్యసనంబు న్నుతియింతురా యనవచితిప్పా చంద్రసారంగనా
భిసముత్పాదితతాళవృంతపవనప్రేంఖోలనప్రక్రియా
ఐసరోదంచితసారసౌరభరసవ్యాలోలరోలంబముల్. 22

చ. హరిహరరాయ ఫేరొజసహా సురధాణగజాధిపాదిభూ
వరులు నిజప్రభావ మభివర్ణన సేయఁ గుమారగిర్యధీ
శ్వరునివసంతవైభవము సర్వము నొక్కఁడ నిర్వహించు మా
తిరుమలనాథసెట్టికిని ధీగుణభట్టికి నెవ్వ రీ డగున్. 23

శా. చాముణ్ వైశ్యకులాబ్ధిసోము విలసత్సౌందర్యలీలాకళా
ధాముణ్ దానకళాభిరాము కుముదగకల్హారవాటీసుధా
ధాముణ్ కోమలయామినీశధవళోత్తంసప్రశంసారుచి
శ్రీమన్మానసుశైవయోగివిహితక్షేము న్నుతింపం దగున్. 24

సీ. పంజాబుకర్పూరపాదపంబులు దెచ్చి, జలనోగి బంగారుమొలక దెచ్చి
సింహళంబున గంధసింధురంబులు దెచ్చి, హురుమంజిబలుతేజిహరులు దెచ్చి
గోవసంశుద్ధసంకుమదద్రవము దెచ్చి, యాపఁగ నాణిముత్యాలు దెచ్చి
చోటంగిఁ గస్తూరికాటంకములు దెచ్చి, చీనిచీనాంబరశ్రేణి దెచ్చి

గీ. జగదగోపాలరాయవేశ్యాభుజంగ, పల్లవాదిత్యభూదానపరశురామ
కొమరగిరిరాజదేవేంద్రు కూర్మిహితుఁడు, జాణ జగజెట్టి దేవయచామిసెట్టి. 25

గీ. తమ్ము లిద్దఱుఁ దనయాజ్ఞ దల ధరించి, యన్నిదీవులఁ దెచ్చులాభార్థకోటి
యర్థులకు నిచ్చి కీర్తిచేకొని మాఁడు, నవచిత్రిపురాంతకుండు వంశాబ్ధివిధుఁడు. 26

మ. తరుణాచీనితవాయిగోవరమణాస్థానంబులం జందనా
గరుకర్పూరహిమాంబుకుంకుమరజఃకస్తూరికాద్రవ్యముల్
శరధిం గప్పలిజోగులన్ విరివిగా సామాన్లఁ దెప్పించు నే
ర్పరి యావైశ్యకులోత్తముం డవచితిప్పం డల్పుఁడే యిమ్మహిన్. 27

గీ. పండువాఢిల్లిరాఢాదిపట్టణముల, యధిపతులు మాళిఁ దాల్చురత్నాంకురంబు
లవచిత్రిపురాంతకానీతయానపాత్ర, సింహళద్వీపమండలక్షేత్రజములు. 28

ఉ. పిన్నటనాఁడు సత్కరుణఁ బిల్లలమఱ్ఱిమహాప్రధాని పె
ద్దన్నగురూత్తముండు తగనక్షరశిక్షయు దైవమార్గసం
పన్నతయున్ వివేకపరిపాటియునుం గృప సేసె నర్థి నే
యన్నకు నట్టిసెట్టి త్రిపురాంతకునిం దగుఁ బ్రస్తుతింపఁగన్. 29

ఉ. ధీచతురు ల్సహోదరులు తిర్మలసెట్టియు జామిసెట్టియు
న్నాచన విశ్వనాథచినమల్లకుమారులు వీర లాత్మజుల్
శ్రీచెలువంబుఁ గైకొనినచేడియ యన్నమదేవి భార్యగా
గోచరమే నుతింప నయకోవిదునిం ద్రిపురాంతకాధిపున్ 30

షష్ఠ్యంతములు.

క. ఆపుణ్యశ్లోకునకు ను, మాపతిపాదారవిందమధుకరమునకున్
ద్వీపాంతరమండలికా, భూపాలకమాననీయపురుషార్థునకున్ 31

క. సంధాభార్గవునకుఁ గి, ష్కింధాచలపతికి దానకేళీభరధౌ
రంధర్యనియతమతికి యు, గంధరచాణక్యనీతిగతినిపుణునకున్. 32

క. మాచాంబానందనునకు, వాచాగోచరవివేకవైయాత్యునకున్
వాచాలవిబుధగంగా, వీచీగంభీరవాక్యవిన్యాసునకున్. 33

క. వాణిజ్యచణున కంత, ర్వాణీసంస్తూయమానభాసురమతికిన్
వాణీనఖముఖముఖరిత, వీణానిక్వాణనిభకవిత్వఫణితికిన్. 34

క. త్రిపురాంతకదేవమనో, విపులకృపావర్ధితాభివృద్ధికిఁ బాండ్యా
ధిపసఖున కవచిదేవయ, త్రిపురాంతకునకు వితీర్ణదీక్షానిధికిన్. 35

శ్రీ ర స్తు.

హ ర వి లా స ము.

ప్రథమాశ్వాసము.

వ. అభ్యుదయపరంపరాభివృద్ధి గా నాచెప్పం బూనినహరవిలాసం బనుప్రబంధంబునకుఁ బ్రథమవిలాసం బైనకృతినాయకునివాణిజ్య వంశంబునకుం గూటస్థుం డైన కిరాటకుల శ్రేష్ఠుం డగుచిఱుతొండనంబిచరిత్రంబుఁ జెప్పెద నది యెట్టి దనిన. 1

కథా ప్రా రం భ ము.

గీ. బదరికాశ్రమభూమిఁ దాత్పర్యనిష్ఠఁ, దపము సేయుచు నుండె శాంతత వహించి
క్రోధసంవర్ధమానతపోధనుండు, ఘనుఁడు దూర్వాసుఁ డనుమహామునివరుండు. 2

వ. ఒకనాఁ డమ్మునీంద్రుండు మధ్యాహ్నకాలంబునఁ గృతస్నానుం డై పితృతర్పణంబు జేసి సంధ్యావందనం బొనర్చి వైశ్వదేవబలిహరణంబులు దీర్చి దేవతార్చనం బనుష్ఠించి పర్ణశాలవాకిట హవిశ్శేషం బైనహవిష్యనీవారపాయసాన్నం బల్లనల్లన లేడిపిల్లలకు మేఁపుచుండె నయ్యవసరంబున నంబరమార్గంబునం దుంబురుం డనుప్రమథుండు దననితంబినియుం దానును విమానం బెక్కి హేమకూటంబున నుండి గోకర్ణవాసి యగుదృక్కర్ణభూషణు సేవింపం బోవువాఁ డయ్యాశ్రమంబునడుచక్కి నుండి యమ్మునీంద్రుండు హరిణవత్సంబులకుం జేయువాత్సల్యంబునకు నద్భుతంపడి యంగుళిస్ఫోటనంబు సేసె నచ్చిట్టమిడికి నాలేడిపిల్లలు బిట్టు బెదరి చెదరి చేయాక పఱచిన నిది యేమి చప్పుడొకో యని గగనమార్గంబునకుం దృష్టి పఱపి యాదూర్వాసుండు. 3

శా. హుంకారం బొనరించి తుంబురునితో నోరీ దురాచార నా
జింకల్భుక్తి గొనంగ నేమిటికిరా చేచిట్ట మ్రోయించి యా
తంకంబుఁ ఘటియించి తిట్టియపరాధం బేను సైరింతునే
యింక న్మర్త్యుఁడ వై జనింపు మహిలో నింకంగ నీగర్వమున్. 4

గీ. అని శపించినఁ దుంబురుం డతిభయమున, డిగ్గనంగ విమానంబు డిగ్గ నుఱికి
యతనిపాదాబ్జములకు సాష్టాంగ మెరఁగి, యొంతయును భక్తినమ్రుఁడై యిట్టు లనియె.

క. కరుణింపు సమాశ్రితభయ, హరణ సురాసురకిరీటహారిహీరరత్న
స్ఫురణా మధుకరపరివృత, చరణా యత్యంతదాంతిశాంత్యాభరణా. 6

గీ. హరిణవత్సంబులకు మీరు కరుణతోడఁ, బాయసాన్నంబు గుడిపింప భక్తిఁ జూచి
సర్వభూతానుకంపకు సంతసిల్లి, చిట్ట మిడిచితి నిది నాకుఁ జెట్ట యయ్యె. 7

వ. నీవచనం బమోఘంబు గావున నాకు మర్త్యత్వం బవశ్యభోగ్యంబుగాఁ బురాకృత ఫలం బనుభవింపక పోవచ్చునే నాయపరాధం బల్పంబ దీనికిం దగ శివభక్తగృహంబున జన్మించునట్లుగా ననుగ్రహించి శాపాంతంబు కృప సేయు నీకృపావిశేషంబునం గ్రమ్మరం బారిషదపదవి కలుగునందాఁక మద్భార్య నీకుంగోడలు, నీపాదచర్య సేయుచు నీయాశ్రమంబున నుండఁగలయది యనిపల్కిన దాక్షిణ్యంబు వహించి యువ్విరూపాక్షదివ్యాంశసంభవుం డగుదూర్వాసుండు. 8

ఉ. ఇద్దురవస్థ రాఁదగిఁ యింతటితప్పొనరించినాఁడ వే
ప్రొద్దు గుణంబున న్నిగులు వొందిన నేమి యనంగవచ్చు నీ
ముద్దియ నాదుకోడ లిటముందట నావగ నిమ్మినుండనీ
నిద్దుర మేలుకొన్నగతి నీవును గ్రమ్మరి రమ్ము పొమ్మికన్. 9

వ. అనియె ననంతరంబ తుంబురుండును దూర్వాసుశాపాక్షరంబులు ప్రేరేపఁ దక్షిణంబ జంబూద్వీపంబున ద్రవిడభూమండలమండనాయమానంబును బంపాతరంగిణీప్రవాహ నదీమాతృకాయమానవిశ్వంభరాభరితకలమశాలిశిరాముఖషష్ఠికపతంగహాయన ప్రముఖ బహువిధవ్రీహిభేద సంపత్సంపన్నంబును బంకజాసనహయమేధయాగస్థానంబును హస్తిగిరిశిఖరశృంగాటకాఘాటహాటకఘటనావాసవరదరాజాభిధానవైకుంఠవిహార ప్రదేశంబును గామాక్షీకౌతుకాగారంబును నేకామ్రనాథదేవదివ్యావసథంబును నైన కాంచీనగరంబున వణిగ్వంశంబున నుద్భవించి. 10

మ. చిఱుతొండం డనుపేర వైశ్యకుల మార్జిత్యంబునం బొంగఁగా
గఱకంఠుం దరుణేందుశేఖరుని షట్కాలంబుఁ బూజించు నిం
దఱుభక్తు ల్దను వేఁడిన న్బ్రియమున న్దాత్పర్యము న్భక్తియు
న్వెలుపుం గల్గి తదీప్సితార్థములు గావించు న్నిరాలస్యతన్. 11

వ. అతనిపురంధ్రి తిరువెంగనాంచి తుంబురునిభార్య యగునప్సరోంగన నిజాంశంబునఁ గాంచీనగరంబునందు వణిగ్వంశంబునఁ గౌశికగోత్రంబున నవతరించి చిఱుతొండనంబికి భార్యయై సిరియాలుం డనుకుమారునిం గనియె నాపుణ్యదంపతు లిరువురు షట్కాలలింగార్చనంబులను సంతతజంగమారాధనంబులను గాలంబు గడపుచుండిరి. 12

గీ. కంచిలో నేడువాడలు గలసియుండ్రు, ప్రకృతిబంధులు సంబంధబంధులునయి
పాఁడిపంటయు వైభవప్రాభవములు, తగవు ధర్మంబు గలిగి యుత్తమవణిజులు. 13

వ. చిఱుతొండండును బూర్వజన్మవాసనావిశేషంబునఁ దుషారగిరికన్యకాకరకమల

కణాంకితుం డగుటం జేసి వలయాంకుం డనం బ్రసిద్ధి వహించి యేకామ్రనాథు
నారాధించుచు శుద్ధవీరశైవాచారపరాయణుం డై జంగమప్రముఖులకుఁ దనమనో
వంచనంబు లేక యేవేళ నేపదార్థంబు వేఁడిన లే దన కిచ్చుట వ్రతంబు గాఁ బట్టి
పట్టిన వ్రతంబు చెల్లకుండినం దిరుబాసగా వర్తిల్లుచుండె నంత నొక్కనాఁడు. 14

చ. తమలముకెంపున న్మెఱుఁగుటాఁకినచెందిరకావికోఱలుం
దుమికిఫలంబుచందమున నున్ననియౌదలమీఁదిపచ్చిగం
దముఁ గరసంపుటంబున సదాశివలింగము నొప్పుమిండజం
గము చనుదెంచె నొక్కరుఁడు గర్వమునం జిఱుతొండనంబికిన్. 15

వ. వచ్చి యయ్యోస్యపరిమన్మథుండు మన్మథమథనసేవాహేవాకసావధానమానసుం డైన
యాజగజెట్టిసెట్టికి శివుని కారుణ్యం బని దీవించి పాదార్చనాద్యుపచారంబులు గైకొని
సుఖాసీనుం డై యిట్లనియె. 16

గీ. కంచినగరిపాటిగట్టుతూమునఁ దూమెఁ, డిక్షురసము మాకు నిపుడు తెమ్ము
హరుని నేఁడు మాకు నభిషిక్తు నొనరింప, వలయు నిత్య మైన వ్రతము గాన. 17

క. చేగానుగాఁడుచెఱకుం, దీఁగెరసంబునఁ బురారిఁ దేల్పక కుడువ
న్నాగురు వుపదేశించిన, యాగమ మిది గాన నిమ్ము నభ్యర్థింతున్. 18

వ. అని కక్షంబునం ధరియించిన యాసాఱపుంగాయకోనిభస్మం బిచ్చిన వల్లె యని
యందుకొని యావైశ్యబృందారకుండు పరమానందకందళితమందస్మితస్మేరవదనార
విందుం డై యిందుధరుండు మనమందిరంబునకు విందువచ్చినాఁడు గరగరగా వంట
కమ్ములు గావలయు నని తిరువేంగనాంచి కప్పగించి యప్పు డప్పరమభక్తునియందలి
భక్తిచిత్తంబునం జొత్తిల్ల నత్యుత్తమవ్యవహారోదాత్తం బగువిత్తంబు చెఱంగున
ముడుచుకొని పంపాతరంగిణీతీరోద్యానంబునం బుండ్రేక్షువాటంబుల ఘటయంత్రో
పాత్తవాపీసలిలధారాప్రవాహసారణీసేకసంవర్ధితంబు లైనచెఱకుంగోలలు గొని. 19

సీ. కాంచిపురముపాటిగట్టుతూమునఁ దూమెఁ, డిక్షురసమ్మున కెన్నివలయుఁ
జేగానుఁగాడంగఁ జెఱకుదండము లని, గుఱుతింపఁగా నూఱుకోల లైనఁ
జాలుఁ బొమ్మనుబుద్ధి సంభవించెను మదిఁ, జిఱుతొండనంబికి సెట్టిపతికి
నన్నికోలలు గట్టి యాడక కొసరక, ద్రవిణంబుమూట వారలకు నిచ్చి

తే. ముదురుఁదీవెల బిగువుగా మోపు గట్టి, వాఁడిపండ్లు బిగించి చేవలఁతి యెగిరి
యెత్తి మో పెత్తరాదయ్యె నెంతయేని, నెత్తవచ్చు ని నూఱుపుండ్రేక్షుఘటలు. 20

ఉ. వెగ్గల మైనమోపుఁ గడువీఁకన యెత్తఁగఁబోయి ముందట
న్మ్రొగ్గతిలంబడెం జెమట మోమునఁ గ్రమ్మగ ద్రావిడోత్తముం

డగ్గణముఖ్యతోడ నొకఁడై సరి నాచెలువు ల్భరించి తా
దిగ్గన వచ్చె శంకరుఁడు దెప్పర మైనవడిం జెమర్చుచున్. 21

గీ. చెలువుమోము వైచి శ్రీమహాదేవుండు, చాయఁ జూచినంత మాయమయ్యె
నద్భుతంబుఁ జెంది యతఁడు చేజంత్రానఁ, జెలువుఁగోలలాడి చేసె రసము. 22

గీ. పాటితూమున రసము దైవాఱఁ గొలిచి, కొమరుజంగంబునకు నిచ్చెఁ గోర్కి దీఱ
నాతఁ డలచేత నున్నచంద్రార్ధమౌళి, కారసంబున నభిషేక మాచరించె. 23

మ. ఇట వైశ్యోత్తముఁ గూడి మోముకొని పుండ్రేక్షుప్రతానంబు దె
చ్చుట నప్పాటను వెండికొండపయి నస్తోకాప్సరోభామినీ
నటనాలోకనవేళ మై చెమరిచె న్మందాకినీమౌళికిన్
ఘటియిల్లె న్గిరిరాజనందనకుఁ దత్కాలంబ యీర్ష్యోద్ధతుల్. 24

చ. అనుగవరేణ్య ప్రేంకణము లాడెడువేలుపులేమఁ జూచి యే
చెమరిచి తంచుఁ గేళిసరసీరుహ మెత్తి ప్రతాప మొప్పఁగా
హిమగిరిరాజనందన మహేశ్వరు మొత్తె మధూళికాపరా
గములు శశాంకశేఖరునికన్నులమూఁటను జింగు నట్లుగన్. 25

వ. ఇట్లు లీలారవిందంబున హిమశైలనందనచేత వేటువడి యిందుధరుండు సురసుందరీ సందర్శనంబున నైనకందర్పవికారంబు గామి తేటపడ గోవిందశతానందపురందరాదు లగుబృందారకులు వినుచుండ మందస్మితస్మేరవదనారవిందుం డై మంద్రగంభీరస్వరంబున నిట్లానతిచ్చె 26

సీ. కమలాక్షి యిది యేమిగాఁ దలంచితి విప్పు, డర్ధదేహంబు నీయదియ కాదె
హృదయంబుపొరువున హృదయ ముండుటలేదె, యేకీభవించిన యిరువురకును
నేభావ మైన నీహృదయంబునకు దాఁప, నేభంగి వచ్చు నాహృదయమునకు
నపరాధశంక యావంత యైనను లేదు, నీచిత్తమున కెక్క నిక్కువంబు
గీ. తప్పు లేకుండ నేల నెత్తమ్మిమొగడ, విసరి వక్షఃప్రదేశంబు వ్రేటుగొంటి
కేసరంబులరజముఁ బుష్పాసవంబు, నెఱసె నిదె చూడు కన్నుల నీరు గ్రమ్మె. 27

వ. నాపై చెమర్చుటకుం గారణంబు చెప్పెద నాకర్ణింపుము. 28

ఆశ్వాసాంతము.

ఉ. హాటకగోత్రధీర! సిరియాలకులోద్వహ! చంద్రమఃకలా
జూటపదారవిందపరిచుంబనమానస! ధర్మశీల! క
ర్ణాటవరాటఘూర్జరవిహార! కళింగకులింగమండలా
ఘాటవిజృంభమాణశశికాంతివినిర్మలకీర్తిపూరితా. 29

క. కొమరగిరివసంతనృపా, గమకవివరగంధసారకస్తూరీకుం
కుమకర్పూరహిమాంభ, స్సముదంచితబహుసుగంధిశాలాధ్యక్షా. 30

మాలిని. తిరుమలవిభుచామాధీశ్వరైకాగ్రజన్మా
పరమగురుసపర్యాప్రౌఢరామానుజన్మా
చిరపరిచితలంకాసింహళద్వీపభూమీ
సరసిరుహభవోరుస్తంభగోత్రాగ్రగామీ. 31

గద్యము. ఇది శ్రీమత్కమలనాభపౌత్త్ర మారయామాత్యపుత్త్ర వినయవిధేయ శ్రీనాథనామధేయప్రణీతం బైనహరవిలాసంబునందుఁ బ్రథమాశ్వాసము.

శ్రీ ర స్తు.

హ ర వి లా స ము

ద్వి తీ యా శ్వా స ము.

శ్రీ రాజరాజకీలిత
భారతరామాయణాదిభవ్యపురాణా!
యారాధితపరమేశ్వర!
ధీరగుణాభరణ! యావచిదేవయతిప్పా! 1

వ. అవధరింపు మనంతరంబ పార్వతితోఁ బరమేశ్వరుం డిట్లు చెప్పందొడంగె. 2

గీ దీవులం దెల్ల నేరెటిదీవి లెస్స, భరతఖండంబు మేల్తదంతరమునందు
ద్రవిడదేశంబు గడునొప్పుదానియందుఁ, గాంచికామండలంబందుఁ గాంచిపురము. 3

శా. ఆకాంచీనగరంబునందు శివభక్త్యాచారసామ్రాజ్యల
క్ష్మీకంఠాభరణంబు నిర్మలవణిక్శ్రేష్ఠాన్వయాంభోధికి
న్రాకాపూర్ణనిశాకరుండు చిఱుతొండశ్రేష్ఠుఁ డయ్యుత్తముం
డేకాలంబును బాయ కుండు గిరిపుత్రీశానపూజావిధుల్. 4

ఉ ఎందఱు జంగమప్రమథు లెత్తఱి నేమిపదార్థ మెంత యే
కందువ వేఁడినం దిరముగా నతఁ డందఱి కాపదార్థ మా
కందువ యేపు ప్రాణ మిడఁగా నిడియైన ఘటించి పెట్టుఁ బూ
ర్ణేందునిభాస్య వానిసరి యెవ్వఁడు లేఁడు వసుంధరాస్థలిన్. 5

గీ. కలియుగంబునఁ గళ్యాణకటకనగరి, నాకు భక్తుండు బసువరనాథుఁ డొకఁడు
కాంచినగరంబులో వణిగ్వంశవరుఁడు, నాదుభక్తుండు చిఱుతొండనంబి యొకఁడు. 6

శా. అయ్యార్యోద్భవవంశసంభవుని నేకామ్రాధినాథాంబికా
శయ్యామందిరనిర్మలాత్ముని భిక్షావృత్తి జంగం బొకం
డొయ్యం జేరఁగ వచ్చి మాశివుని నేఁ డోలార్చదం గానఁ దే
వయ్యా యిక్షురసంబు తెమ్మఁ డనుచుం బ్రార్థించి నేమించినన్. 7

శా. అట్టే కాక యని భూతి యందుకొని శైవాచారసంపన్నుఁడా
సెట్టిశ్రేష్ఠుఁడు తోఁటకుం జని రసశ్రీమాధురీలక్ష్మికి
న్బట్టైయిమ్ముల మంచినల్లచెఱకు ల్బారంబుగా విర్చి వే
కట్టై న్మోపు వనీకఠోరలతికాకాండప్రకాండంబులన్. 8

క. తూఁపెఁడురసమునకుం దగఁ, బ్రామెడుపుండ్రేక్షులతిలు వట్రువగ లతా
దామములఁ గట్టి పెట్టిన, యామోపుఁ గదల్పలేక యవశుం డయ్యెన్. 9

క. పరఁపెఁడురసంబు గలుగం, గరయంత్రం బాడ నిప్పిఘటలు వలయు న
న్నిరసాలకాండకంబు, ల్సిరియాలునితండ్రి యెత్తలే కున్నయెడన్. 10

గీ. ఏ నొకఁడఁ బోయి యొకవంక నెత్తికొంటి
నాతఁ డొకవంక నెత్తె మో పద్రితనయ
భారమున డస్సి యవ్వాణిక్పతి సెమర్చె
నేను నపుడు సెమర్చితి నేని చెప్ప 11

క. ఆచెమరించుట సుమ్మీ, యీచెమరించుట భవాని యిది యన్యముగా
నీచిత్తమునఁ దలంపకు, మీ చనవులు భక్తకోటి నేను ఘటింతున్ 12

గీ. వలతు నే భక్తకోటికి వారిజాక్షి, లలన యాభక్తకోటియు వలచు నాకు
"భక్తిమతి లింగపతి" యను ప్రాఁతమాట, నేఁడుగాఁ గల్గెనే యలినీలవేణి. 13

వ. అనినం బార్వతి యాశ్చర్యం బంది యాసర్వజ్ఞుతోడ దేవా యవ్వీరమాహేశ్వరు
నాకుం జూడవలయుఁ గంచికిం దోడ్కొని పోవే యని ప్రార్థించిన నప్పంచ వద
నుండు సమీపంబునం గాఁచి యున్నపాకశాసనుం గాంచి యిట్లని యానతిచ్చె.

సీ. పాకశాసన కంచిపట్టణంబునయందు, నాల్గుదిక్కుల యోజనములు మూఁడు
ముయ్యేడువాసరంబు లకాలవర్షంబు, గురియింపఁ బంపు మొగుళ్లగములఁ
బగళులు రేలు కుంభద్రోణములు గాఁగఁ, గలదు మాకు రహస్యకార్య మొకటి
యనినఁ దత్క్షణమాత్ర నైరావణము నెక్కి, యమరావతికి నేగి యమరవిభుఁడు
గీ. పుష్కలావర్తకాదికాంభోధరముల, సంకిలియ లూడ్చి తెప్పించి సత్వరమునఁ
బంచెఁ గాంచీపురంబునఁ బదియుఁ బదునొ, కొండుదినములు వర్షించుచుండుఁ డనుచు.

గీ. పశ్చిమంబున నింద్రచాపంబు వొడిచె, నిందునెలఁ జుట్టెఁ బరివేషమండలంబు
గగనమార్గంబునందు నాగడప లెగసె, నంబుధరమాలికలు దక్షిణంబు నడచె. 16

క. ఈఱు ముటెమి మూలగాడ్పులు, చఱచి విసరఁ జొచ్చె మదనసంహారుదెసఁ గ్రొ
మ్మెఱుఁగు లుద్భవించెఁ గప్పలు, గిఱరవరటుక్కరరవరరగ ట్టని యఱచెన్. 17

ఉ. తూనిఁగ లాడఁ జొచ్చెఁ దివిదూఁటి భ్రమింపఁగఁ జొచ్చెఁ బిచ్చుకల్
మానక యుబ్బి గబ్బిలుఁగు మాటికిమాటికిఁ గొల్చెఁ గొమ్మపై
వాన యవశ్య మింక బహువాసరముల్ జడివట్టునం చొగిన్
వానికివాని కాడిరి యవారణఁ బౌరులు గంచిలోపలన్ 18

మ. గ్రహసిద్ధాంతకళావిదు ల్సలిలనక్షత్రంబు నీహారరు
గ్సహవాసంబున నభ్రవీథిఁ బరివేషస్థాయి యై యుండుటన్
బహుబాధల్ బడఁ గల్గు నంచుఁ దమలోఁ భాషింపఁగాఁ గంచిలోఁ
గృహమేధు ల్భయ మంది రింధనతృణక్లేశంబు చింతించుచున్. 19

వ. అనంతరంబ విగళితశృంఖలాబంధంబు లై పుంఖానుపుంఖంబులం బుష్కరావర్తకాదికంధరంబులు కబంధంబులు పారణలు సేసి కారుకొని చటులతటిద్దండతాడనంబులం జేసి యోసరేసినయావిధుంబోలె గర్జిల్లుచుఁ బర్జన్యశిఖాడంబరంబున నంబరంబుఁ దోరణకట్టుచుఁ గొక్కెరలు కెరలి యిరుచక్కియల నుక్కడంబు నడువం బౌరస్త్యంబు లై ధారాకదంబంబులఁ గొరగింపఁజేయుఁ దళతలం దొరఁగుచినుకులం బుట్టుకట్టావితోడం గూడి పుడమిం బొడముకస్తురినెత్తావి చిత్తంబుల కాహ్లాదం బాపాదింప విద్యున్నటీనటనారంభసంభ్రమోచితంబు లగుపుష్పాంజలివిక్షేపంబులం బురుడించు చుండ డీలుకొనంబడువడగండ్లగములు గిరికటకశిలావిటంకంబులం గ్రేంకారంబు లంకురింప నొండొండ మెండుకొని ఖండపరశుకంఠమూలకఠోరకాలకూటమషీకలంకపంకచ్ఛాయాచ్ఛటాపటలంబుభంగి నంగీకరించుచు నిశ్శేషశిలీంధ్రబాంధవంబును నిర్భిన్నపథికమార్గంబును నిరవధికలాంగలీప్రసూనధూళిధూరదిశాముఖంబును నిరుజ్ఝితగిరినిర్ఝరప్రవాహంబును నిబిరీసకుసుమకేసరకరికరాభధారాకదంబడంబరంబును నై వర్షారంభంబు విజృంభించి కుంభద్రోణంబులుగ విశ్వంభరామండలం బేకార్ణవంబుగా ధారాపాతంబు గురియం దొడంగె వెండియు 20

చ తటిదభిఘాతవేగమున ధారలు జోరునఁ జాలు చుండఁగాఁ
బిటిలు పిటిల్లనం బ్రిదిలి ప్రేలిపడం దొడఁగెం జతుర్దిశా
తటముల నండుచుం బిడుగుతండము కాంచిపురీజనంబు హృ
త్పుటములు జల్లన న్మఘవపుత్రునిపేళ్లు పదిం జపింపఁగన్ 21

గీ ఊలవడి వొచ్చి కామాక్షి నుత్తరించె, నగరితోఁ గూడ నేకామ్రనాథు ముంచె
హస్తిగిరినాథుశ్రీపాద మప్పళించెఁ, గంచిఁ దెప్పలఁదేల్చె నకాలవృష్టి. 22

వ ఇవ్విధంబున నిరువదియొక్కవాసరంబులు వెలుపు లేక పాము వ్రేలం గట్టినభంగి నింగి యవిసి కాఱినచందంబున సముద్రంబు వెల్లివిరిసినలీలం బిలంబు తెఱచినపడువునఁ బురందరకిటకాటోపంబునుగండూపదవిహారారంభసంరంభంబును మండూకప్రకాండడిండిమధ్వానచండిమంబును గచ్ఛపోత్సేకహేవాకంబును మీనమానసోల్లాసంబును నక్రప్రక్రీడనంబును గర్కటకనటనపరిధాటీపాటవంబును ఘటియిల్లమిఱ్ఱుపల్లంబులు సరిగా నంపజాలంబుపగిదిఁ గురిసి యిరువదిరెండవదివసంబునందు. 23

ఉ. ఒయ్యన వెల్వ నూపి జడి నుబ్బరవోయెడు ప్రాణికోటికిన్
దయ్యము నెత్తికోలు తుది దాఁకఁగఁ దూరుపు తెల్లవాఱి తె
ల్వఱెయ్యెను నీరు వీథిఁ బడి యంబుధి కేగె నదీముఖంబునం
బయ్యెర వట్టె మేఘములు వచ్చుగఁ బాఱె నుదఙ్ముఖంబులై. 24

మ. ఎడవెలైనను లేక పెక్కు దినముల్ హేరాల మై వర్షముల్
జడిగాఁ బట్టి తటాలనంగ వెలిచెన్ ఝంఝాసమీరంబుతో
నుడుమార్గం బఖిలంబు నున్న నయి శాణోత్తేజనం బొంది పు
ల్కడుగంబడ్డనిశాతఖడ్గము క్రియం గన్పట్టె నప్పట్టునన్ 25

గీ. కడు మహోత్పాత మగుచు నకాలవృష్టి, కంచి ముయ్యేడునాళ్లు వర్షించిపుడు
వెలిచినప్పుడ యీవీడు విడుచువార, మనుచుఁ బట్టిరి ప్రతిన బౌద్ధాదిజనులు. 6

వ. బౌద్ధ జైన పాషండ లోకాయతిక చార్వాక కాపాలి కాహితుండిక వానప్రస్థ పాశు
పత జంగమ యోగిప్రముఖు లగు వైదేశికులెల్లఁ బట్టణంబునం గాఁపురంబున్నవా
రందఱుం దక్కఁ దక్కినవా రందఱు గుంపులు గట్టి కోలం గొట్టినతెఱంగున జలో
పద్రవంబుం దిట్టువారై మూఁడామడమేర యంతయుం బుక్కిటిబంటియైనఁ దత్పరి
దేశంబు వెడలి గండంబులం గడచితి మని గుండియలు నిగిడికొనుచుం జనిరి. 27

శా. ఆముయ్యేడుదినంబులందు శివభక్త్యాచారసంపత్తికిన్
సీమాభూమి యనం బ్రసిద్ధుఁ డగు నాచిర్తొండనంబీశ్వరుం
డేమీ కొంకక పెట్టు జంగములకున్ హేరాల మిష్టాన్నముల్
నేమం బొప్పఁగ రేలునుం బగలును న్విశ్వాసపూర్వంబుగన్ 28

చ. అనిశమునుం గుమారసిరియాళుఁడు నాతనిదాది యైనచం
దనికయు ధన్యు లప్పరమదంపతులున్ శివభక్తకోటికై
యనుపమవృష్టి వేగ కొనియాడుదు రెన్నియునుం దెఱంగులన్
దినములు రేబవల్ దధిమధుప్రచురాన్నసమర్పణంబునన్. 29

గీ. వంటచెఱకులు లేకున్నవ్రాము లైన, వస్త్రములు తైలమున ముంచి వహ్నిఁగూర్చి
వంటకంబులు వండి యవ్వారి గాఁగఁ, బెట్టు శివభక్తతతికి నంబిప్రభుండు. 30

ఉ. జోరున వర్షము ల్గురియ సువ్రతుఁ డాచిఱుతొండనంబి దై
వాఱెడుభక్తి వెట్టు శివభక్తుల కర్థిఁ జతుర్విధాన్నముల్
తోరనియొల్పఁబప్పును ఘృతంబును దియ్యనిపాయసంబులుం
జాఱులు బిండివంటలును శర్కరయున్ దధియున్ యథేచ్ఛగన్. 31

క. కఱకంఠునిభక్తులకుం, జిఱుతొండఁడు మిగుల భక్తి సేయుచును గడున్
దఱచగు పెనువానలలో, నుఱనగుకూటముల మఱుఁగు లోకెము లిడుచున్. 32

వ. శతైకవృద్ధిలబ్ధంబు లైనధనంబులఁ గోటికిం బడగ యెత్తినయుక్కిరాటవంశకిరీటాలంకారంబు వీరశైవాచారం బాధారంబుగా శరీరార్థప్రాణవంచనంబు సేయక జంగమప్రమథుల నారాధించుచుఁ గల్పాంతకాలకల్పంబు లైనయాదుర్దినంబుల నియమంబుపద్రవంబు నొందకుండం గాపాడుకొనుచు నుండె నిట్లుండ నవ్వాన వెలియుదినంబు సంప్రాప్తించె. 33

గీ. ప్రతిదినంబును జంగమప్రమథముఖ్యుఁ
డొకఁడు మొదలుగ మఱి యొండ ఱోదవకున్న
నారగింపనిబాసవాఁ డగుటఁ జేసి
నాఁడు పుణ్యుండు చిఱుతొండనంబివిభుఁడు. 34

వ. మధ్యాహ్నకాలంబున వీరమాహేశ్వరసమయసిద్ధాంతమార్గానుసారంబున. 35

ఉ. ధీనిధి సెట్టినంబి తనదేహమునిండ విభూతిమంగళ
స్నానముఁ జేసి ధౌతపరిధానముఁ గట్టి త్రిపుండ్రధారి యై
చేనమృతాంశుమౌళిని వశీకృతభక్తు ధరించి సంతత
ధ్యానముఁ జేసి యెంతయును దత్పరభావము ప్రస్ఫుటంబుగన్. 36

సీ. జలక మార్చె నవీనచంద్రార్ధమౌళికిఁ, దడి యొత్తె భక్తమందారమునకుఁ
జందనం బర్పించె జగదేకభర్తకుఁ, బుష్పమాలిక లిచ్చె భూతపతికి
ధూపంబు సంధించె దురితసంహారునకు దీప మిచ్చెను మహాదేవునకును
దాంబూల మొసరించె నంబికానాథునకుఁ, బ్రణమిల్లె గజదైత్యభంజనునకు
గీ. జంగమారాధనక్రియాసమయమునను, గాని యుపహార మీరాని కారణమున
దేవదేవుని విరిసెజ్జఁ దిరము సేసి, వాకిటికి వచ్చె శివయోగివరుల నరయ 37

క. ఏవేళఁ జూచినం దన, శ్రీవాకిటఁ బగటివేళ శివయోగివరుల్
వేవేలసంఖ్య లుండెద, రావేళ నొకళ్లు లేమి యద్భుత మయ్యెన్. 38

గీ. అప్పు డాశ్చర్య మంది వైశ్యప్రభుండు, మగుడి లోనికిఁ జనుదెంచి మంత్రఫణితి
నోలతాతన్వి శివయోగియొకఁడు లేఁడు, నేఁడు మొగసాల నిదియేమి మూఁడెనొక్కొ.

చ ముసురుదినంబులందు మనమోసలఁ బంచటరుంగుమీఁదటన్
భసితవిభూషణుల్ పరమపావనమూర్తులు శైవసంహితా
భ్యసనపరాయణు ల్గిరిశభక్తు లనేకులు నిండియుంద్రు నేఁ
డసితసరోరుహాక్షి యొకఁ డైనను లేఁ డిది యేమిచోద్యమో. 40

గీ. వీథికై యేగి వత్తునా వేగవేగ, నేఁడుమాత్రము కొందఱు నియమపరులు
పాదసరసీజయుగళప్రసాదమాత్ర, మబ్బెదరు గాక మనభాగ్య మల్ప మగునె. 41

వ. అని పలికి తిరువెంగనాంచితో నేను జంగమప్రముఖులం బురంబువీథుల వెదకి తేరం బోవుదుఁ గాన లింగార్చనములకుం దగినపదార్థంబు కూడం గూర్చుకొని యుండుమా యని చందనంబును భూతియు జెందిరయుఁ బుచ్చికొని దుప్పటంబు ధరియించి చిఱుతొండనంబి నిజగృహంబు వెలువడి యక్కాంచీనగరమ్మునందు. 42

ఉ. అంగడి వేల్పుటిండుల సురావసథంబుల రచ్చపట్టులన్
జంగిలిసాలలం గణకశాలల వేశ్యలవాసవాటికా
ప్రాంగణభూములందు శివభక్తిపరాయణుఁ డర్థితోడుతన్
జంగమముఖ్యులన్ వెదకు సంభ్రమముం భయముం దలిర్పఁగన్ 43

గీ. త్రెమసి తప్పినపసరంబు వెదకినట్లు, బెరసి చేఁదప్పిపడ్డసొ మ్మరసినట్లు
పురములో వాడవాడలఁ దిరుగఁ జొచ్చె, జంగమాన్వేషణార్థి యై శైవవరుఁడు. 44

క. వచ్చినవాడకు వచ్చుం, జొచ్చినవాసంబుఁ జొచ్చుఁ జొచ్చినవోటే
యచ్చుగఁ గ్రమ్మఱఁ జొచ్చుం, బచ్చు శివార్చనకు శంభుభక్తుల వెదకన్. 45

వ. ఇవ్విధంబునఁ గంచియెల్లయుం బరికించి యెందునుం గానక కోట వదలి యక్కిరాట కులశ్రేష్ఠుండు తప్పగా నరిగి బాహ్యాళిప్రదేశంబునఁ బువ్వందోఁటచేరువ నొక్క పాడుగుడిగర్భమంటపంబున శతవర్షదేశీయుండును జరాజర్ఝరితదేహుండును బలితపాండుజటామండలుండును రుద్రాక్షమాలికాభసితత్రిపుండ్రాలంకృతుండు నై నిజవయోనురూప యగువృద్ధియన్న పాదంబు లొత్తుచుండం బులికలాసంబుమీఁదం బవళించి యున్నయయ్యవారికి శరణార్థి యగుచు మ్రొక్కె. 46

ఉ. మ్రొక్కి కరాంబుజద్వయము మోడ్చి లలాటమునన్ ఘటించి మా
యక్కడ మీరు నీముసలియవ్వయు నేఁడు శివార్చనంబు స
మ్యక్కృతిఁ జేసి నన్నుఁ జరితార్థుని జేయుట యుక్త మంచు వా
టక్కరిమాయజోగికిఁ దటాలు మనం బ్రణమిల్లినంతటన్. 47

గీ. నరసి ప్రాలినబొమ లెత్తిపరమవృద్ధు, తల వడంకఁగ నొయ్య నీ రెలుఁగుపడుచు
నంబి నెమ్మోము దేరకొనంగఁ జూచి, శివునికారుణ్య మనుచు నాశీర్వదించె 48

క. దీవించి యతనివదనముఁ, జేవెలుఁగిడి చూచి యేమి చెప్పెదు చెపుమా
య్యే వీనుల వినఁ గావున, నీ వొత్తుచుఁ జెప్పు చెప్పి దేని మహాత్మా. 49

వ. అనినం జిఱుతొండండు కృతాంజలియై యుచ్చైస్స్వరంబున దేవా మాయింటికి శివార్చనంబు సేయ దేవిరయు నీవును విజయముచేసి మమ్ముం గృతార్థులం జేయ విభూతి యందు మనుటయును. 50

సీ. నీవంశ మెయ్యది నీనామ మెఱిఁగింపు, శివభక్తిసమయదీక్షితుండ వౌదె
పెండ్లాము నీకుఁ జెప్పినయట్లు సేయునే, కులము సంతానంబు గలిగి యున్నె
కూడునీరకు నింటఁ గొదలేకయుండునే, యడిగినయర్థ మీ ననువుపడునె
యెదిరివా ఖండించు టిది దప్పరముసుమ్మి, జలగజంపులు జోగిజంగకొలము
గీ లడిగితిమి గాని యెవ్వండ వైననేమి, యొక్కభిక్షువు గా నిన్ను నొరయ నేల
శైవవిరవ్రతాచారసాహసుండు, తనయుఁ డొక్కఁడు గల్గ నాపనికిఁ జాలు. 51

వ. యీవృథాలాపంబులఁ బనియేమి నామనోరథంబు వినుము. 52

సీ. ఏఁడుగాలం బయ్యె నేను నిరాహార,ఘోరవ్రతంబుఁ గైకొన్నవాఁడ
హరుని నుద్దేశించి యమ్మహావ్రతమున, కుద్యాపనంబు పశూపహార
మయ్యాగపశువు నన్యం బేది యును గాదు, నరుఁడు గావలయు నన్నరుఁడు బ్రాహ్మ
ణక్షత్రవైశ్యసంతతులలో నొక్కఁడౌ,వాఁడును గడుఁ జిన్నవయసువాఁడు
గీ. రోగశంకావిహీనుండు రూపసియును
వానితల్లియుఁ దండ్రియు నడుగు సేసి
పాక మొనరించి వడ్డింప భవున కొసఁగి
కుడుతు నాపజ్జ నీవు నీకొడుకుఁ గుడువ. 53

వ. అనినం జిఱుతొండనంబి మహాప్రసాదం బయిన వైశ్యకులసంభవుండ తిరుకచ్చినంబి సంబంధబాంధవుండ నాపేరు చిఱుతొండనంబి యండ్రు శివభక్తులకుం బాదచర్య సేయుచుండు 54

గీ. భక్తుఁ డేవ్రతంబు పట్టె నావ్రతము పా, రంబుఁ బొందఁ జేయువ్రతము నాది
యీవ్రతంబు నాకు నెప్పు డోడంగూడ, దప్పుడు తిరు బాస మనఘచరిత 55

వ. నీయానతిచ్చినప్రకారంబున నయ్యుపహారంబు సేయించెద విభూతి యందుకొనుము మాయింటికి విచ్చేయుము మధ్యంగనస్నానం బవధరించి యంతలోన వంటకంబు లాయితంబు లగు నని ప్రార్థించిన. 56

శా. మో మడ్డంబుఁ గదల్చి మోరకుఁడుసుంబోలె న్శివారాధకుం
డామానాధిపుతోడ నిట్లనియె నయ్యా వృద్ధ నే నీవచః
ప్రామాణ్యంబులు విశ్వసింప నతిదూరం బాంతీవచ్చె నీ
రామారత్నము కాదు కూడ దనినన్ రాఁ జాల నీచోటికిన్. 57

చ. ఉదరమునన్ భరించి ప్రసవోద్భవవేదనఁ బొంది పిమ్మటన్
ముదిముది యైనపీతఁ బడి మూత్రమునం బడి లజ్జ వందుగా
నడవడ యైనతల్లికిఁ బ్రియంబొ సుతుండు వృథాభిమానదు
ర్మదుఁ డగుతండ్రికిం బ్రియుఁడొ మానసవీథిఁ దలంచి చూడుమా. 58

వ. ఇంతకుఁ గతం బింతలేనివీరమాహేశ్వరఘోరవ్రతంబులు నీవు చేసినయవి లేవు పుత్త్ర
స్నేహంబు సామాన్యంబు కాదు నీవును నీభార్యయును విచారించుకొనునది యీకా
ర్యంబు మీకిద్దఱకును సమ్మతం బగు నేని. 59

గీ. అందునది భూతిఁ దొలుత నీయనుఁగుభార్య, యందుకొనువాఁడ వీవు ననంతరమున
నాలుమగఁడును నొకకుత్తుకైనఁ గాక, యిట్టిధర్మంబు మిన్నక యేల కలుగు 60

వ. మీ రిద్దఱు సమ్మతించితిర యేని యీహంతవ్యం బగునక్కుమారుం డీకార్యంబు
నకు నెవ్విధంబున నొడంబడువాఁడు 61

గీ. నీకుఁ జంపగవచ్చుఁ బో నియమనిష్ఠఁ, దల్లి కోర్వంగవచ్చుఁ బో ధైర్యగరిమ
మాకు భుజియింపవచ్చుఁ బో మనసుతిప్పుటఁ, జిఱుతవానికిఁ జావు దుస్తరముగాని

ఉ. పాడయినట్టిచిత్త మొకపాటున నిల్పఁగ మాటిమాటిక
ట్టాడుచు నుండఁగాన తనయాత్మయునుం దన కిట్టి దొ నవం
గూడునొ కూడదో యెదిరికోర్కి యెఱుంగుట యెట్లు కుట్టియా
చూడఁగ దోసకాయలె విశుద్ధయశోధన యన్యచిత్తముల్ 63

గీ శివభక్తుఁడ యిదికొని య, య్యువిదకును విభూతి యీ ప్రయోజనమునకై
యవుగాక కొంకి కేగు మ, నవలంబియె కంచి నీకు నడుఁగామడయే 64

వ. అనినం జిఱుతొండండు నిజాంతర్గతంబునం దనభార్యకుం గలశివభక్తివిశ్వాసంబులును
జంగమారాధననియమనిష్ఠయుఁ దనయానతి దాఁటమియునుం గుమారుసిరియాళుండు
నట్టివాఁడగుటయు నెఱింగియు నాశివయోగితో నవుఁగా దని యుత్తరప్రత్యుత్తరం
బులకు నెట్టుకొనంజాలక ఛందోనువర్తనంబ మహాప్రసాదం బని యతం డిచ్చు
విభూతి యందుకొని నిజమందిరమునకు వచ్చినంత. 65

గీ ఇంటిలోనుండి వెలుపలి కేగుదెంచి, యంగనారత్న మగుతిరువెంగనాంచి
భర్తముఖరాగ మీక్షించి ప్రమద మొందెఁ, గాలమున నెందు శివయోగి గలిగె ననుచు.

వ చిఱుతొండనంబియుఁ నాబింబాధరకు శివయోగి సంభ్రమించుటయుఁ దద్వ్రతచర్యా
ప్రకారంబును నాదిమధ్యావసానంబుఁ దెలియం జెప్పుటయు నయ్యింతియింతయు
మిసిమింతురాలుగాక మునిమునినవ్వు నవ్వి మనశరీరార్థప్రాణంబులకుం గర్తలు
శివయోగీశ్వరులే కాక మఱి యెవ్వరు వారిసొమ్ములు వారికే సమర్పించు టదియును
నొకదొడ్డపనియే యెఱు విశేషించి. 67

చ. వలచినయేని సబ్బువనవంద్యునకు న్శివయోగినేతకున్
బాలకయి గారవం బయినపుత్త్రకుఁ డొక్కఁడ యేల మాంసమున్
వలయుఁగ మీరు నేను నగువారమె కామె విభూతిఁ దెం డిఁకం
బలుపులు వేయు నేటి కలభక్తుని నేమము పారఁ బొందుతెన్. 68

వ. అనినఁ దదర్థంబు నిశ్చయించి చందనికకు నవ్వృత్తాంతం బంతయు నెఱింగించి ముమ్వురు నేకోద్యోగంబున శివయోగికిం బరిచర్య సేయువారైరి. చిఱుతొండం డును శివయోగిం దోడ్తేరం జనియె నటుపుఁ బూర్వంబునందు. 69

చ కపటపుమాయజోగి యగుఖండశశాంకధరుండు వృద్ధవే
షపుఁదనరూపు వీడి వెలిచక్కిన యుండఁగ నొండురూపుతో
నపగతదోషుఁ డైనసిరియాళకుమారకుఁ డొజ్జయింటిలో
లిపి పఠియింపఁగా మదిఁ జలింపఁగఁ జేయఁగుతూహలంబునన్ 70

వ వచ్చి చూచినంత 71

ఉ. హస్తగృహీతపుస్తకమునందు లిఖించినయట్టి పలకం
బస్తవము స్మరించుచు ఘనంబుగ ధీగుణవైభవోన్నతుల్
విస్తరిలంగ బాలకులు వేవురిలోఁ సిరియాళుఁ డుండె న
భ్యస్తలిపిప్రపంచుఁడు గ్రహంబులలో నుడురాజు కైవడిన్ 72

గీ ఆజటాధారి చేరంగ నరుగుదెంచి, తనకు సాష్టాంగ మెరఁగి తాత్పర్య మెసఁగఁ
గేలుదమ్ములు మొగిచి కెలన నున్న, చిన్నముద్దులసిరియాళసెట్టి కనియె 73

శా. అన్నా యీచిఱుతొండనంబి యనుపాపాత్ముండు మీతండ్రియే
యన్నిర్భాగ్యుఁడు జోగి కొక్కరునికిన్ హాలామదోన్మాదికిన్
నిన్నుం జంపి మహాశహారముగ వండింపంగ నున్నాఁడు సం
పన్నస్నేహముతోడ నీకు నెఱిఁగింపన్ వచ్చితిం జెచ్చెరన్ 74

క కడుపునఁ బుట్టినకూరిమి, కొడుకు న్సుకుమారమూర్తిఁ గులవర్ధనునిన్
మెడఁ గోసి చంపి నంజుడఁ, గుడుపులజోగులకుఁ బెట్టుక్రూరులు గలరే. 75

గీ. దానవుఁడు గాకవాఁ డేటితండ్రి చెపుమ
చెక్కునిండినపసు రొలుక చిఱుతవాని
బత్తుఁ డొక్కఁడు మధుపానమత్తుఁ డగుచు
నిన్ను వేఁడినఁ జంపఁగ నిశ్చయించె. 76

వ 'జీవన్భద్రాణిపశ్యతి' యనువేదవచనం బవలంబించి యెక్కడి కేనిం బోయి యీబారి తప్పించుకొనుట నీకుం గర్తవ్యంబు. 77

చ. అనవుడునుం గుమారసిరియాళుఁడు వీనులు మూసికొంచు నో
యనఘచరిత్ర నీకు నిటు లానతి యీఁ దగు నయ్య నీకుఁ గా
దని పలుకంగ నాకు భయ మయ్యెడు గాక పరార్థ మైతనూఁ
ధనము వ్యయింపఁ గల్గుట కదా జననైకఫలం బెఱింగినన్ 78

గీ. ఎఱుకచాలనివాఁ డందుమే దధీచి, నల్పబుద్ధులె మేఘవాహనుఁడు శిబియు
దరఁ 'బరోపకారార్థ మిదం శరీర', మనెడువాక్యంబు వినవె సంయమివరేణ్య. 79

గీ. అధ్రువం బైనమలభాండ మైనదేహ, మనఘ యన్యోపకారార్థ మైవ్యయించి
ప్రవిమలంబుఁ గల్పాంతరధ్రువము నైన, కీర్తికాయంబుఁ గైకొంట కార్తి యేల. 80

వ. అనిన జటాధారిజంగమప్రమథుండు వీఁడు చిఱుతొండనంబికంటె నధికుండు వో మ్మ
నుచు మరలి పోవువాఁడు వెండియు. 81

గీ. కపటమాయామహానాటకప్రపంచ, సూత్రధారుండు చిఱుతొండసుతున కపుడు
మూర్ఛ రప్పించె హరుఁ డందు మోసపోయి, యక్షరాచార్యుఁడును భయమందనలసి.

శా. నోర న్నుచ్చిలి క్రమ్మ మై వడఁకఁ గన్నుల్తారకాబింబసం
చారవ్యాప్తి నధఃకరింప హృదయస్థానంబు గంపింప గ్రీ
వారంధ్రంబున ఘుర్ఘురధ్వనులు తీవ్రస్ఫూర్తి వర్తింపఁ గా
సీరాలుండు ధరిత్రిమీఁదఁ బడి మూర్ఛిల్లె న్నిరాలస్యతన్ 83

క. మోహాంధకారధారా, వ్యూహమున సిరాలుసెట్టి యుసు ఉడుగుటయున్
హాహాకారధ్వనితో, లాహల మచ్చోట గురుకులంబునఁ జెలఁగన్. 84

గీ. ప్రణుతపంచాక్షరీమంత్రపాఠశక్తి, ఫాలమున దేశికుఁడు భూతిఁ బ్రాముటయును
గ్రమ్మఱను మూర్ఛ దెలిసె సిరాలసెట్టి, భక్తులకు భస్మమే కదా ప్రాణరక్ష 85

వ. అంత నక్కడ 86

సీ. చిఱుతొండఁ డావృద్ధశివయోగిపుంగవుఁ, బ్రబలకుష్ఠవ్యాధిబాధితాంగు
వీఁపుమీఁద ధరించి వెనువెంట గ్రుడ్డవ్వ, కోలూఁదికొని రాఁగఁ గూర్చుకొనుచు
బూదిబొక్కణలాతమును కమండలువును, బులికళాసముఁ గరంబున వహించి
శరణీయు లెదురుగా శరణార్థి సేయుచు, నొయ్యొయ్య సందడి కోసరిలుచు

గీ. చంద్రశేఖర భూతేశ శర్వ రుద్ర, పార్వతీనాథ శంకర భవ గిరీశ
కాలకంధర హర కాలకాల యనుచు, వచ్చె నింటికి జనకోటి యుచ్చరింప. 87

మ. మహి నూహింపఁగ నెంతభాగ్యమొకో యామ్నాయాంతసిద్ధాంతవా
ఙ్మహిళాకుంతలమాలికాభరణమున్ మందాకినీశేఖరుం
గుహనాభైరవు యోగిపుంగవుని భర్గున్ రాజమార్గంబునన్
వహియించెం దనవీఁపునం దిరముగా వైశ్యుం డనాలస్యతన్. 88

ఉ. ఇంటికిఁ దెచ్చి యోగిపరమేశునకున్ వణిజుండు తాను వా
ల్గంటియు భక్తియున్ భయము గౌరవము న్వినయంబు నాత్మలో
నంటుకొనంగ నప్డు ముసలమ్మకు సైతము కమ్మనూనె మై
నంటి నలుంగుతో జలక మార్చి యొసంగిరి ధౌతవస్త్రముల్ 89

వ. అనంతరంబ యేకాంతగృహంబున సర్వోపచారసంభారభరితంబుగా దేవతార్చన
కుం బెట్టిన నయ్యాదిమదంపతు లిరువురు శివపూజావ్యాపారంబునం బ్రవర్తిల్లుచుండి
రప్పుడు శివాజ్ఞావశంబునం జేసి 90

ఉ. పల్లియవోటనుండి యెలపాసెము నడ్కులు జక్కిలంబులున్
బెల్లపుటచ్చులున్ సెనగచేడలుఁ జిమ్మిలి నువ్వుటుండలున్
బెల్లుగ నంబివియ్యములు పెద్దతీకంబుఁ బ్రియంబు నొప్ప మే
నల్లునకుం గుమారశిరియాలునకుం గొనితెచ్చి రర్మిలిన్ 91

వ. అంత. 92

సీ. ఫాలపట్టికయందు భస్మత్రిపుండ్రంబుఁ, గర్ణంబులను రాగికమ్మదోయి
కరమునం దిత్తడికంబంపుగంటెయు, ఘనకుచంబులమీఁదఁ గావిగంత
కటిమండలంబునఁ గరికంచుఁబుట్టంబు, మడఁచి కట్టినమేలినడిమికట్టు
కేలుఁదామరయందుఁ గేదారవలయంబు, జడకుచ్చుమీఁదఁ బచ్చడపుఁగండ
గీ. సంతరించి పదాఱువర్షములవయసుఁ, బచ్చిబాలెంతరాలు తాపసపురంధ్రి
నంబిభామినిఁ దిరువెంగనాంచిఁ జేరి, పాలువోయింపుఁ దమ్మ పాపనికి ననియె. 93

ఉ. మక్కువ రేఁగి నెయ్యపుఁగుమారునిఁ జంపుట కంతరాయమై
యక్కటికంబు పుట్టుటకు నల్లన వచ్చి భవాని యత్తఱిం
దక్కటిమాయజోగితవిధంబున బిడ్డకుఁ బాలు వేఁడ నా
యక్కయుఁ బోసె నెల్లసమయంబులఁబోలె నిరాకులాత్మ యై. 94

గీ. పాలు వోయించుకొని యాకృపాళుమూర్తి
శూలినాంచారి పాలిండ్లచూచుకములు
పాలచేఁపున గిలిగింత వాఱుటయును
మెత్తమెత్తన నఱచేత నొత్తుకొనుచు. 95

వ. తిరువెంగనాచితో నిట్లనియె. 96

మ. ప్రజ లెల్లం బురిఁ గ్రంతక్రంతల మహాపాపంబుగాఁ బల్కెడున్
నిజమో కల్లయొ కాని మీ రఁట కడున్ నిస్త్రింశభావంబునన్
నిజపుత్రు న్సుకుమారుఁ జంపి యొకదుర్నిర్వాణికిం జోగికి
న్భుజియింపంగ నొనర్చువార టిది యొందుం గల్గునే యుద్ధరన్. 97

క. జోగులు కపటోపాయ, ప్రాగల్భ్యంబున నిధానవనసిద్ధులకై
యోగతుల నైనఁ దిరుగుదు, రోగిరముగ సుతునిఁ జంపు టుచితమె మీకున్. 98

గీ. ఆవగింజంతభూతి మై నలఁదికొనిన, వెలఁది గుమ్మడికాయంతవెత్తి పుట్టుఁ
గటకటా యెట్లు తనబుద్ధి కాటఁ గలియ, నిసువుఁ జంపంగఁదలఁచెనో నీమగండు 99

క. కానందు గాక కన్నులు, దా నేమిటివాఁడు నీదుతనయునిఁ జంపన్
మానవతీ "మగవాఁడో, మానో" యనుమాట నేఁటిమాటయె చెపుమా 100

వ. అనినం దిరువెంగనాంచి యక్కపటపుంజంగమదేవిమాటలు వినక నిర్వికారం బైనయాకారంబుతో నమ్మా శివుఁ డన శివయోగి యన భేదంబు గలదే శరణార్థులయర్థప్రాణంబులు శివాధీనంబులు శివుండు కర్త శివుండు భోక్త యీయర్థంబునకుం జింతింప నేల నీకుం దడవయ్యెడు బాలెంతిరాలవు చన్నులు చేఁపుచున్నవి బిడ్డ యింత కెంత యలమటం జెందునో పాలు చాలుగదా యెప్పుడు మాయింటికి వచ్చుచుం బోవుచుండు మని కేలుదోయి ఫాలంబునం గీలుకొల్పి సముచితవ్యాపారంబులం బ్రవర్తించుచుండం జంకు గానరాక పార్వతీదేవియు నటనుండి చని యంతర్ధానంబు సేసె నాసమయంబున. 101

గీ. చేర నేతెంచి చిఱుతొండసెట్టి యంత, యింతి తిరువెంగనాంచితో నిట్టు లనియె
నొజ్జలగృహంబునకుఁ బోయి యుత్పలాక్షి, వడుగు సేయంగవలెఁ జిన్నవానిఁ దెమ్ము.

చ. చెలువ కుమారుని న్వడుగు సేసిన చేతడి యాఱకుండఁగా
బోలుపెసలారఁగా నిరుగుపొరుగులవారల భాగ్యసంపదల్
కుఁ మభివృద్ధిఁ జెంద మనకూరిమినందనుఁ బెండ్లి సేయఁగా
వలయు ననంతరత్నగణ వైభవ మొప్పఁగ ముక్తికన్యతోన్ 103

వ. అనిన నామెయు నట్ల కాక యని యాచార్యగృహంబున విద్యాభ్యాసముఁ జేయుచున్నకుమారునిం దోడ్కొని వచ్చినంత 104

ఉ. మంచిగ మేనయత్తలు సమాదరణం బడరంగఁ బెట్టి పు
త్తెంచినమంచిభక్ష్యములు తేనియ నేతను ముంచి ముంచి భ
క్షించుచు దల్లిఁ దండ్రిఁ దనచిన్నికరాంగుళి వంచి వంచి యా
రించుచు నిచ్చ మీఱఁగఁ జరించెఁ గుమారకుఁ డింటిముంగిటన్. 105

వ. అనంతరంబ 106

సీ. జడలయల్లిక యూడ్చి సంపంగినూనియఁ, జిన్నకూఁకట్లఁ జొబ్బిలఁగ నంటి
గోష్పదేశంబు సంకుమదద్రవంబున, నయమార నుద్వర్తనంబు సలిపి
గిసి గొజ్జఁగ నీరుపోసి నూతనక్రొత్త, చిఱుబంతి పసుపులో చేవ నలఁది
కస్తూరిఁ బొరపినగంధసారంబుతో, నీకాయమెరువున జిడ్డు విడిచి

గీ తేటవలిపెచ్చనీరునఁ దీర్థమాడి, వేణి యిాటార్చి సురపొన్నవిరులు ముడిచి
మడుఁగు గట్టి కాటుకయిడి తొడివి పూసి, భసితరేఖాత్రిపుండ్రంబు నొసటఁ దీర్చి.

వ. కయిసేసి కుమారునిం గనుఁగొని జననీజనకు లిట్లనిరి. 108

ఉ భైరవయోగి కొక్కనికిఁ బాశుపతవ్రతచర్యతీరునం
బారణకై నిమం బలలపాకము గా నొనరించి పెట్టుచు
న్నారము భోజనంబు ప్రియనందన నీహృదయంబునందు సం
సారముఁ బాయు జాలవిచారము లేదు గదా యొకింత యున్ 109

వ అనినం గుమారశిరియాళుండు 110

శా సంసారభ్రమ మించు కేని యను మత్స్వాంతంబునన్ లేదు మీ
వంశం బీపరిపాటిదే యనుడు గుఁడీ వైక్లబ్యసంభావనల్
మాంసాహారము లయ్యెడన్ శివునకున్ మాయామహాయోగికిన్
హింసాక్లేశము మానుఁడీ గురులు మీరే మిమ్ముఁ బ్రార్థించెదన్ 111

వ అని పల్కె నప్పుడు. 112

గీ. చావ నియ్యకొనినసత్పుత్రునకును, జంప నియ్యకొనినదంపతులకుఁ
దారతమ్య మెద్ది ధీరమాహేశ్వరా, చారసమయమార్గగౌరవమున 113

వ. ఇవ్విధంబున మువ్వురును జంగమనికాపురస్సరంబుగా నేకనిశ్చయు లయిరి తదనంత
రమున 114

సీ. చన్నిచ్చుచాగున జనయిత్రి తొడలపైఁ, బసిబిడ్డఁ బన్వళింపంగఁ బెట్టె
జందనిక తనహస్తప్రణాలంబులు, క్రింద నంటుక సంతరించుకొనియెఁ
జిన్నిబుగ్గల లేఁతచిఱుతనవ్వు వెలగ్న, శిరియాలుఁడు మొగిడ్చెఁ జేయిదోయి
చిఱుతొండనంబి క్రొమ్మెఱుఁ గారుమరకత్తి, వాఁడిగా నూఱుచు నంక దీర్చె

గీ. నేకమై యట్లు మువ్వురిహృదయములును,గుంద కానందవారిధియందుఁ దేలె
గురులు మువ్వురుఁ గుమారవరునితోడ, నేకవాక్యంబుగాఁ బ్రీతి నిట్టు లనిరి

మ. మది శంకింపకు మన్న మావలని ప్రేమస్నేహవాత్సల్యసం
పద వాటింపకు మన్న నాలుకతుదిన్ బంచాక్షరీమంత్రముం
బదిలం బొప్పఁ బఠింపు మన్న పరమబ్రహ్మార్థసంసిద్ధి యి
య్యది సు మ్మన్న యనుంగునందన శిరాలా ధీరశైవవ్రతా. 116

ఉ నంబి శివార్థము న్మనసునమ్మిక శంక యొకింతయేని చి
త్తంబునయందు లేక వనితామణియూరువుఁ దాపుఁ జేసి తీ
క్ష్ణం బగుకత్తి మోప మెడ గ్రుక్కనఁ ద్రెవ్వి నమశ్శివాయమం
త్రంబుఁ బఠించుచుండెను శిరాలుశిరంబు వసుంధరాస్థలిన్. 117

ఉ. కంపక గాజువాఱక వికారము దప్పక మందహాసని
ష్యందము చెక్కుటద్దముల జాఱక నెమ్మది నిద్రవోవుచ
ట్లందము నొందె ధాత్రి శిరియాలకుమారునివక్త్రచంద్రుఁ డా
నందము నొందె నప్డు తెలనాఁగమనంబును భర్తచిత్తమున్. 118

గీ. పన్నిదం బాడి గెలిచినభావ మొప్ప, నప్డు చక్కంగఁ దీర్చినయనువు మెఱయ
సతియుఁ బతియును గారంపుసుతు వధించి, పరుస నడపిరి వీరశైవవ్రతంబు 119

చ. మిరియము నుల్లియుం బసుపు మెంతియు నింగువ జీరకంబు శ
ర్కరయును జింతపండును గరాంబువు గమ్మని నేయి తైలముం
బెరుఁగును మేళవించి కడుఁ జెక్కువిధంబులఁ బాకశుద్ధి వం
డిరి శిరియాలునింగటికిడెందమునం దరళాక్షు లిద్దఱున్. 120

సీ. కమ్మగాఁ గాఁచినకట్టునంజుళ్లను, నీరు వెళ్లఁగ నొత్తి నేత వేఁచి
చక్కఁగాఁ దఱిగినసన్నమాంసంబులు, పరిపాటిమై జుబ్బుఁబదనువండి
మూల్గుటెమ్ములతోడ ముదకగా నుండఁగఁ, జాఁదుసేసిననల్లచారు గాఁచి
వలయుసంబారాలు వడియాలు బలియించి, దళమైనక్రొవ్వుతోఁ దాలఁబోసి

గీ. షడ్రసోపేతములు గాఁగఁ జతురభంగి, నమృతపాకంబులుగఁ జేసి రాత్మణంబ
సెట్టి శిరియాలు వంశాబ్ధిశీతకరుని, సతులు తిరువెంగనాంచియుఁ జందనికయు.

క. నానావిధపాకములుగ, నానాలుగఁ జేసి యపుడు నాల్గువిధములన్
బోనాముదొంతిఁ జేర్చిరి, నూశాస్త్రసమానుఁ డైన సుతు శిరియాలున్. 122

సీ. నిగనిగం గాఁ దోమి నింకుబోసముపొంతి, భోజనశాలలోఁ బొసఁగఁ జేర్చి
చెలువ గొజ్జఁగనీటిచేపట్టు గావించి, పాటించి రత్నకంబళము పఱచి
దేవతార్చకు ధూపదీపాదు లొడఁగూర్చి, కప్పురంబున మ్రుగ్గు గలయఁబెట్టి
యొడమదిక్కున దాగిపడిగెంబు ఘటియించి, గిరగతో విమలోదకములు డించి

గీ. యతివ సర్వాయితం బయ్యె నయ్యగారి, కారగింపఁగ నవసరం బనుచుఁ బలుక
సెట్టి తోడ్తెచ్చె జంగమసిద్ధవృద్ధు, నంధురాలగుముదుసలియవ్వతోడ. 123

క. శ్రీపాదంబులు గడిగెను, శ్రీపాదోదకముఁ గొనియెఁ జెలువయుఁ దానున్
వ్యాపారిసార్వభౌముం, డాపరమతపస్వి నునిచి యర్చించెఁ దగన్. 124

వ. అనంతరంబ చిగురు ముదురునుం గాని నిడుపు వెడల్పుం గలకదళీపలాశంబుఁ డిమి యూరియఁ బుచ్చి పఱచి యుదకంబునం బ్రక్షాళించి యుపస్తరించి పాయసాపూప సూపపుండ్రేక్షుద్రాక్షాగోక్షీరమధుశర్కరాఘృతదధిరసావళీశాకపాకశిఖరిపానకంబుల తోడ గారాపుంగొడుకుపాల మేలోగిరంబుతోడం గూడ భరితభోజనంబుగా

వడ్డించి క్రుడ్డియవ్వకు స్సైత మట్లనే సమర్పించి దేవ! భక్తవత్సల! శివయోగీశ్వరరూప! విరూపాక్ష! యమృతాహారం బారగించి రక్షింపు మని చిఱుతొండండు భార్యయుం దానును భక్తితాత్పర్యవిశ్వాసపురస్సరంబుగా నమస్కరించిన. 125

ఉ. భైరవయోగి రాజు పసిపాపనినంజూడుఁగూరలందు లో
నారసి చూచి మస్తకమునందలిమాంసము లేమి గాంచి యీ
నీరసమాంస మేటికి వణిగ్వర! పుత్త్రునియుత్తమాంగముం
గూరలు సేయ వైతి వివిగో నిజపుత్త్రనిసర్గమోహముల్. 126

గీ. కటకటా! మావ్రతంబు భగ్నంబుఁ జెందె, నేటిపారణ మిది మాకు నేటి కింక
నుత్తమాంగపుమాంసము నుజ్జగించి, యేల యధమాంగమాంస మే నెటు భుజింతు. 127

వ. అనిన విని చిఱుతొండండు భయంపడి వెలవెలంబాఱుచుఁ దిరువెంగనాంచి వదనం బాలోకించి యింక నెట్లనినం జిట్టమిడుచు నంతఁ దలకాయపాల మేలోగిరంబు ముందటం బెట్టి చందనిక యిది యేను మొదలన బెఱందకాం ద్రగుయోగిబృందారకులచందం బెఱింగినదాన నగుటంజేసి పాకంబుఁ జేసికొనియున్నదానఁ దపస్విచిత్తం బేపాకంబునుం బొందకుండ వడ్డించెదం గా కని యట్లుచేసిన నక్కహానాభైరవుండు వెండియు. 128

గీ. బంతి నీ వారగింపక పరమపుణ్య! నాకుఁ జేయాడునే భోజనంబు సేయ
నొకఁడు భుజియించు టెన్నఁడు నొప్ప దనెడు, వేదవాక్యార్థ మన్నదివినవె చెపుమ.

వ. మఱియు నొక్కభోజననియమంబు కలదు పిన్నవాఁడు బంతిభోజనంబు సేయక కూడు నోటికిం బోదు మగబిడ్డండు లేనినిర్భాగ్యునింట భోజనంబు సేయఁగూడదు నీకుమారు నాబంతికి రప్పింపు మారగించెద మనవుడు. 130

మ. మొదలం దేవర యానతిచ్చితిర యేముం జిత్తమం దెంతు మ
య్యది నాకుంగొడుకింకనుం గలఁడె వాఁ డాడంగ వేంచేసె నే
చదువం బోయెనె పిల్వఁ బంతు నెటు నేజాడం బ్రతీక్షించు నీ
యదనం గూరలు చల్లనారవె మహాత్మా యోగిచూడామణీ! 131

వ. అనిన నత్తపోధనుఁ డిట్లనియె నీయుత్తమాంగన యెలుం గెత్తి నలుదిక్కులం బిలుచు నది కుమారుండు వచ్చె నేని బంతిం బెట్టుకొని భుజింతము రాకుండె నేని నేమును నీముసలియవ్వయుం గుడుత మటు గాక యొఱగొడ్డెంబులు పలికి నీపడ్డపాటు గొడ్డేఱుఁగా జిడ్డుపఱుపం గలవార మె యనినం బ్రసాదం బని పతియనుమతిం బురంధ్రీరత్నంబు. 132

సీ. రారా వణిగ్వంశవారాశిహిమధామ ! రారా వికస్వరాంభోరుహాక్ష !
రారా మహాఘోరవీరశైవాచార ! రారా ఘనౌదార్యరాజరాజ !

రారా కుమారకంఠీరవేంద్రకిశోర ! రారా సమగ్రధీరాహిణేశ !
రారా మనోభవాకారరూపవిలాస ! రారా యసారసంసారదూర
గీ. రార నావన్నెవడుగ ! రారా తనూజ ! రార శిరియాల ! రార నాప్రాణపదమ !
రార నాకుట్టి ! కాజియ్య ! రార యనుచుఁ, జీరెఁ గారాపుఁగొడుకు రాజీవనయన.

శా. అత్తన్వంగి సమస్తదిక్కులను పర్యాయక్రమం బొప్పఁగా
నొత్తెం జిన్నికుమార రార యని యత్యుచ్చైఃశ్రుతిం జీరినం
జిత్తంబుం గనవచ్చెఁ బాలుఁడు మహాశీఘ్రప్రచారంబునన్
దత్తద్వ్యంజనపాకగంధ్యవయవస్థానప్రతానంబుతోన్. 134

శా. రక్షాపాండుర మైనదేహము నహిగ్రైవేయముం గంధరా
కుక్షిం గప్పును బ్రస్ఫురద్ఘనజటాకోటిన్ శశాంకార్ధముం
జక్షుః పద్మముతోడ ఫాలతలమున్ సంధిల్ల శంభుండు ప్ర
త్యక్షుం బయ్యె శిరాలుతండ్రికి హృదాహ్లాదంబు సంధిల్లఁగన్. 135

వ. అప్పుడు భయభక్తితాత్పర్యంబులు మనంబున ముప్పిరిగొన నప్పరమమాహేశ్వరుం
డిట్లని స్తుతియించె. 136

మ. జయ హాలాహలనీలకంధర మహేశా భక్త చింతామణీ
జయ గంగాధర చంద్రశేఖర జగత్స్వామీ కృపాంభోనిధీ
జయ నీహారధరాధరేంద్రతనయాచారుస్తనద్వంద్వసం
శ్రయసంలగ్నపటీరకుంకుమరజస్సంపన్నబాహాంతరా. 137

వ. అని మఱియు ననేకప్రకారంబులం బ్రస్తుతించె నిట్లు ప్రత్యక్షం బైనవిరూపా
క్షుండు చిఱుతొండనంబీ ! నీవు తుంబురుండవు శిరియాళుండు కుమారస్వామి
తిరువెంగనాంచి యచ్చర మీరిద్దఱు లోకైకకారణంబున మర్త్యయోనిం జనించి
తిరి మీమీస్థానంబులనుండి తొంటిచందంబున నన్నుం గొలువుండు శరీరంబుల
తోడం గైలాసంబునకు రండని యనుగ్రహించిన 138

సీ. వైశ్యాన్వయంబున వసుధ పర్ణన కెక్కి, వేయిగోత్రంబుల వినుతిఁ గాంచి
వీరమాహేశ్వరాచారంబు వదలక, యేడువాడలవార మేము గలసి
వర్తిల్లుదుము వాసి వట్టు మేమియు లేక, యిట్టిబంధులఁ బాసి యేనొకండ
రా బుద్ధి రాదు తారకరాజశేఖర, యిందఱఁ గొనిపోయి తేని వత్తుఁ
గీ. గూర్చుకొని పోవు నీ కోడఁగూడ దేని, నట్లు గా కున్న విచ్చేయు మభవ మరలి
ప్రమథసన్నిధి కేమియు బాధలేదు, కొలిచెదము నిన్ను మే మెల్లఁ గూడిమాడి. 139

వ. అనిన శంభుండు కరుణించి యేడువాడలుఁ గదలివచ్చునది నీకుం బ్రియం బగు నివ్వరం
బిచ్చితి నని యానతిచ్చిన తత్క్షణంబ. 140

గీ. కంచిలో నేడువాడలఁ గలిగినట్టి, నాణెపుంగోమటులతోడ నంబిసెట్టి
యఖిలజీవరాసులఁ గూడి యభ్రవీథి, భాసురస్ఫూర్తి నేగెఁ గైలాసమునకు. 141

వ. ఇది కావేరీవల్లభులును నుభయరావలులును కిష్కింధాచలక్రీడావినోదులు నయోధ్యాపురాధీశ్వరులును నగువైశ్యకులంబులవారలకుం గూటస్థుం డయినచిఱులోండ నంబియుపాఖ్యానము వినినను జదివినను వ్రాసినను బుత్రపౌత్రాభివృద్ధియు ధనకనకవస్తువాహనసమృద్ధియు నిష్టార్థసిద్ధియు నగును 142

ఆశ్వాసాంతము.

శా. చాముండాపరమేశ్వరీవరకృపాసంవర్ధితైశ్వర్యని
స్సీమప్రాభవ లక్ష్మణాగ్రజ సుధాసిక్తాక్షరాలాప యు
ద్యామర్దార్జునవీరశైవసమయవ్యాపారపారీణతా
సామాన్యప్రతిభావనిర్వహణదీక్షా శక్వరాధీశ్వరా. 143

క. కర్వకటకాంఘ్రిసేవక, కర్పూరవసంతరాయ కావేరీశా
దర్పితరిపుగర్వతమో, హర్పతిసౌకర్యదక్ష యంబురుహాక్షా. 144

తోటకవృత్తము.— అలకాధిపతీ సుగుణాభిరతీ, మలయోగ్భవచంద్రసమానయశా
కులపావన యూరుజగోత్రవరా, లలనాజనతారుణ్యలక్ష్మనిభా. 145

గద్య. ఇది శ్రీమత్కమలనాభపౌత్ర మారయామాత్యపుత్ర వినయవిధేయ శ్రీనాథ నామధేయప్రణీతం బయినహరవిలాసం బనుమహాప్రబంధంబునందు ద్వితీయాశ్వాసము.

శ్రీరస్తు.

హరవిలాసము

తృతీయాశ్వాసము.

శ్రీపర్వతసోపాన
స్థాపక వేమక్షితీశసామ్రాజ్యశ్రీ
వ్యాపారిముఖ్య యన్వయ
దీపక యలకాధిరాజదేవయతిప్పా! 1

వ. ద్వితీయవిలాసం బైనగౌరీకల్యాణం బాకర్ణింపుము. 2

ఉ. తారకుఁ డన్మహాసురుఁడు తామరసాసనదత్తమైనదు
ర్వారవరానుభావమున వ్రాలి త్రిలోకము నేలుచుండు ని
ష్కారణతీవ్రబాధ ననిశంబును ముప్పదిమూఁడుకోట్లబృం
దారకులన్ మహర్షులఁ బ్రతాపగుణంబున నెచ్చి పాఁతుచున్. 3

గీ. నిరపరాధబాధితు లగునిర్జరులకు, బంధమోక్షంబుఁ గావించు గంధవహుఁడు
సతులపయ్యెద వెడలించి చన్నుఁగవకు, దప్పి సేసియు దైత్యుచిత్తంబు వడసి. 4

మ. ప్రకటస్నేహదశాధురంధరత పర్వంగా నిశీథంబులన్
సకలాంగంబులు నిక్కి దీపకలికాస్తంభంబులై యుంద్రు పా
యక చూడామణు లొప్ప రాక్షసునిశుద్ధాంతంబులన్ శేషవా
సుకికర్కోటకతక్షకప్రముఖచక్షుశ్శ్రోత్రబృందారకుల్. 5

గీ. దానవునివీటిలోన మార్తాండు డెండ, యంతమాత్రంబ కాని కాయంగ వెఱచు
నెంతమాత్రము కాసిన నెలమిఁ బొందుఁ, గేళిదీర్ఘికలందుఁ బంకేరుహములు. 6

మ. పటుదిగ్వారణగండమండలలసత్ప్రత్యగ్రదానచ్ఛటా
కటుగంధం బగునీరు చిక్కనివియద్గంగాప్రవాహంబులో
పటిహైమాంబుజనాళముల్ పెటికి యూడ్వం జేయు దేవాళిచే
నిటు దైతేయుఁడు కేళిదీర్ఘికలలో నిచ్ఛావినోదంబుగన్. 7

గీ. ఐంద్ర మాసుర మాగ్నేయ మైలబిలము, వాయవీయ మైశానంబు వారుణంబు
యామ్యమును మున్నుగాఁ గలయష్టదిశలు, తాన కైకొని కైకోఁ డతండు సురల.

వ. ఇవ్విధంబునఁ దారకాసురుండు కాసరాక్షు తామ్రాక్షు ధూమ్రాక్షు చక్షురోదగ్ర
ఖడ్గరోమ బాలబిడాల కాలనేమి ప్రధాననానాబంధుసహాయుఁ డై పాకశాసన
పావక పరేతరాజ పలలాశి పాశి పవన పౌలస్త్య పన్నగాభరణులఁ బరిభవించి నిర్జ
రులం దర్జించి కిన్నరుల వెన్నునూఁచి కింపురుషులఁ జంపి గరుడులఁ బడలుపఱచి గంధ
ర్వుల బంధించి గుహ్యకుల సంహరించి యక్షుల నధిక్షేపించి ఖేచరుల గీటడంచి
యచ్చరల హెచ్చు గుందాడి సిద్ధులకు బుద్ధిసెప్పి సాధ్యుల సాధించి, మహారాజికుల
రాజసం బుడిపి విద్యాధరుల నధఃకరించి మహాఋషుల నదలించి పితరులఁ బ్రతిబం
ధించి వసువులఁ బరిమార్చి రుద్రుల కుపద్రవం బాపాదించి విశ్వేదేవతల కనాశ్వాసం
బుసేసి యనశ్వరం బగునైశ్వర్యంబున నప్రతీపం బగుప్రతాపంబున నవార్యంబగు
వీర్యంబున నవక్రంబగుపరాక్రమంబున నస్తోకం బగువివేకంబున నేకాతపత్రంబుగాఁ
త్రిలోకంబు లేలుచున్నకొంతకాలంబునకు. 9

సీ. అనువు దప్పిరి నొచ్చి రలసి రాపద నొంది, రదవద లైరి చీకాకుపడిరి
యంగలార్చిరి విచ్చి రారడిఁ బొందిరి, బ్రమసిరి పాఱిరి పల్లటిలిరి
బెగ్గడిల్లిరి పికాపిక లైరి సొలసిరి, కులకులఁ గూసిరి కుతిలపడిరి
గగ్గులకా డైరి కలఁగి రోటాఱిరి, వెలవెల్ల నైరి నివ్వెఱఁగుపడిరి

గీ. యుసవుసవు లైరి గుజగుజ యైరి డస్సి, రొల్లఁ బోయిరి వెగ్గిరి తల్లడిలిరి
సిగ్గువడి రొచ్చవడిరి యుస్సియుసి యైరి, తారకునిచేత మునులు బృందారకులును.

ఉ. ఇట్టివిధంబున౯ విబుధు లెప్పుడునుం గనుఁగాపులట్లు ము
ప్పెట్టియుఁ జేసిచేసియును వేసరి యింద్రుఁడు మున్నుగాఁగ ది
క్కెట్టిటు లున్నమా కనుచు నేగిరి పద్మజుఁ గూర్చి యేగి కూ
పెట్టిరి హస్తముల్ మొగిచి పెద్దయెలుంగున౯ దద్గుణస్తుతుల్. 11

వ. జయ జయ జగన్నాథ! జగజ్జననస్థితిసంహారకర! జంభారిప్రముఖనిఖిలబర్హిర్ముఖ
శిఖామణీమయూఖమంజరీరంజితపాదపీఠ! జలజాసన! జాహ్నవీప్రముఖసకలతీర్థ
తీర్థసంపూర్ణస్వర్ణకమండలుధర! జపతపోనిష్ఠాగరిష్ఠమనోధిష్ఠానఋగ్యజుస్సామాథర్వణ
మయనానానిశ్వాస! హిరణ్యగర్భ! భూర్భువస్సువస్త్రయీశుకీపంజర! నిరంజన! భారతీ
విహారసౌధాయమానచతుర్వదన! సనాతన! సనత్కుమారజనక! శతానంద! శాశ్వత!
విశ్వతోముఖ! నిర్వికల్ప! నిరీహ! నిరాకార! ఓంకారగమ్య! అదిగ్దేశకాలవ్యవచ్ఛేద
నీయ! ఆదిమధ్యాంతశూన్య! అవ్యయ! అవాప్తసకలకామ్య! అనంత! అద్వితీయ! నిర
స్తసమస్తోపాధికసచ్చిదానందస్వరూప! నమస్తే నమస్తే నమః. 12

గీ. నీదునిట్టూర్పుగాడ్పులు నిగమపఙ్క్తి, ప్రణవమంత్రాక్షరము నీకు భద్రపీఠి
విలయకాలంబు నీనిద్ర విశ్వమునకు, నీప్రబోధంబ యుదయంబు నిఖిలమునకు. 13

గీ. అవధరింపుము విన్నపం బాదిపురుష! యవధరింపుము మమ్ము లోకాధినాథ!
తడవు సేయక రక్షింపు తమ్మిచూలి! తారకుఁడు మమ్ము పెక్కుదుర్దశలఁ బెట్టు. 14

చ. పడితిమి కుక్కలుంబడనిపాటులు దుర్భర మైనవృత్తి వె
న్పడితిమి గర్భయాచకులభంగి దరిద్రత నట్టుకొంచు లోఁ
బడితిమి పాలలోఁ బడినబల్లులకైవడి నెల్లవెంటలం
జెడితిమి వేయునేల సరసీరుహసంభవ! దుష్టదైత్యుచేన్. 15

గీ. తారకుం డెవ్విధంబున ధ్వంస మొందు, నెట్టు బ్రదుకుదు మేము మా కేది దిక్కు
చిత్తగింపుము దేవ! సంశ్రితజనార్తి, హరణపారీణ! కరుణారసార్ద్రహృదయ! 16

వ. అని కరుణంబుగా విన్నవించిన హిరణ్యగర్భుండు ప్రసన్నుం డై బృందారకులను
మహర్షులనుం గనుంగొని యిట్లనియె 17

సీ. వెలివకుం డింద్రాదివిబుధపుంగవులారా, శాండిల్యభృగ్వాదిసంయములును
నస్మద్వరప్రభావానుభావంబున, వాఁడింతవాఁ డయ్యె వాఁడి మిగిలి
విషవృక్ష మేనియు వృద్ధిఁ బొందఁగఁ జేసి, తాఁ గుంఠనము సేయఁ దగవు గాదు
పార్వతీదేవికి భవున కుద్భవ మైన, తేజంబు వాని మర్దింపఁ గలదు

గీ. తండ్రి యగుదక్షుమీఁది క్రోధంబువలన, యోగనిర్ముక్తదేహ యై యుద్భవించి
పెరుఁగుచున్నది హిమభూమిధరగృహమున, నమ్మహాదేవు శివుఁ గూర్పుఁ డను వెలింగి.

వ. ఇంతనుండియు మీకు మేలయ్యెడుఁ బొండని పురందరాదిబృందారకుల వీడుకొల్పి
శతానందుండు యథోచితవ్యాపారంబులం బ్రవర్తిల్లుచుండె నిట్లు దేవతలు భావి
శుభసూచకంబు లగుగంధవాహాదినానానిమిత్తంబు లనుసంధించుచు నిజస్థానంబుల
కరిగి రనంతరంబున 19

సీ. అటమున్న దక్షుకన్యక తండ్రితో నల్గి, యోగమార్గమున మే నుజ్జగించి
యపరజన్మంబున నజ్ఞాతయోని యై, యోషధులకు నెల్ల నునికిపట్టు
మేరుమందరవింధ్యపారియాత్రాదిసు, ప్రథితాద్రిసంబంధబాంధవంబు
సైననీహారశైలాధినాథునకును, బితృదేవతలకన్నబిడ్డ యైన

గీ. మేనకాదేవి కుదయించె మేలువేడ్క, నబ్ధిచెలికాఁడు మైనాకుఁ డన్న గాఁగ
నభిజనాఖ్య పార్వతి యన నఖిలజనని, యాదిశక్తి పురారియర్ధాంగలక్ష్మి 20

క. పావనజంగమభువనకు, భావహ మై విశదశదిశాంతర మై యా
దేవి యుదయంబు నొందిన, యావేళం గుసుమవర్ష మంతటఁ గురిసెన్. 21

గీ. జనని విద్యుల్లతాశ మాచాయ గలిగి, క్రొత్త యుదయించినట్టియాకూఁతువలనఁ
గారుకాలంబుమణిశలాకయును బోలె. నొప్పెడువిమూరభామిని యుద్ది యయ్యె. 22

వ. అనంతరంబ ప్రతిదినవర్ధమాన యై లబ్ధోదయ యగుచంద్రరేఖయుంబోలె బంధుజనంబులకుఁ బ్రమోదంబు నందించుచు మందాకినీసైకతవేదికాస్థలంబులఁ గందుకక్రీడ సల్పుచు నుపదేశకాలంబుల విద్యలు నేర్చుచు బాల్యంబుఁ గడపి నేత్రోన్మీలనంబు సేసిన చిత్రంబునంబోలె యౌవనవిభక్తాం బై యభ్యుదయం బై యభ్యున్నతాంగుష్ఠనఖప్రభావిక్షేపంబున రాగంబు వెడలం గ్రక్కునవియుం బోనిచరణప్రవాళంబులు వృత్తానుపూర్వంబు లై యనతిదీర్ఘంబు లగుజంఘాప్రకాండంబులును వేదండశుండాదండంబులకు వైదండికంబు లై యొప్పారునూరువులును మేఖలాకలాపమధ్యకీలితమహేంద్రనీలమాణిక్యకిరణరేఖ యుంబోలె నాభిరంధ్రంబునం బుట్టి మీఁదికి నిగుడ రాజిల్లురోమరాజియును నవయౌవనారోహణార్థంబు మన్మథుం డొనర్చిన మణిసోపానంబులంబోనివల్లీవిభంగంబులును గుదుళ్లు నిండఁ బలుకం బండినమారేడుపండ్లగారాముఁ జెఱుచుగబ్బిగుబ్బలబెడంగులును నభినవశిరీషకుసుమసుకుమారంబు లగుబాహువులును ధర్మబంధురం బగుకంధరంబును సంపూర్ణపూర్ణిమాచంద్రబింబంబుడంబు విడంబింపం జాలునాననంబును గావి యగుమోవియును నూఁబూవువంటినాసికయు నిద్దంపుటద్దములకుఁ దోడిముద్దు లగుముద్దుచెక్కులును సుమకోదండవల్లీమతల్లు లగుకటివంకబొమలును విదియనాఁటిచందురునకుం గదిసి చుట్టం బగులలాటపట్టంబును గొదమతుమ్మెదచాలుఁ బురుడింపం జాలునీలాలకంబులును నొప్ప సర్వోపమాద్రవ్యసముచ్చయం బగుసౌందర్యంబు నేకత్రావస్థానదిదృక్షుచే విరించి సూత్రీకరించి యుథాప్రదేశనివేశితంబుగ నొనర్చెనో యనం దల్లిదండ్రులకు నామోదంబు నాపాదించుచుండ నొక్కనాఁడు నారదుండు సనుదెంచి 23

క. త్రిభువనమోహన యగున, య్యిభగమనం జూచి పర్వతేశ్వరునిమహా
సభలో నిట్లని పలికెను, శుభవచనప్రౌఢి మెఱయ సురముని యొలమిన్. 24

సీ. ఈనీరజాతాక్షిమేనిలో సగపాలు, గణుతింప మొగపాలు గాఁగ నున్న
దీపల్లవాధరిశ్రీపాదపద్మంబు, నొరయు నొక్కొక్కమా టుడుగణేశుఁ
డీకాంతతోడ మందాకినీవాహిని, సవతి గాఁ గల దేమిచందమునను
నీలతాతన్వికి నీరేడులోకంబు, లభిరామకేళిహర్మ్యంబు లగును
గీ. నిండువేడుకఁ గాంచు నీనీలవేణి, కొమ్ము లేనుంగుమొగ మైనకొడుకుఁ గుఱ్ఱ
నత్తయును మామయును లేనిరిత్తయింట, మనవు మనిపెడు నీయింతి మగనితోడ. 25.

ఉ. మాటలు వేయు నేమిటికి మంగళలక్షణలక్ష్మి యైనయీ
జోటికి భర్త కాఁ గలఁడు సోమకిరీటుఁడు సర్వదేవతా

కోటికిరీటకోటిపరికుంచితదివ్యమణిద్యుతిచ్ఛటా
పాటలపాదపీఠుఁ డగుపట్టి కృతార్థుఁడ వైతి భూధరా. 26

వ. అనిచెప్పి నారదుండు సనియె నంతనుండి హిమవంతుండు నివృత్తాన్యవరాభిలాషుండై యయ్యుమారత్నంబు శేషభూషణునకు నీ నిశ్చయించియు నభ్యర్థనాభంగభయం బునం జేసి. 27

క. తన్నడుగ రానిశివునకుఁ, గన్నియ నెట్లిత్తు నతనికారుణ్యము నా
కెన్నఁడు సిద్ధించునో యని, యన్నగపతి యాత్మఁ దలఁచె నౌత్సుక్యంబున్. 28

వ. అంత విరూపాక్షుండు దక్షరోషంబు కారణంబు గా దాక్షాయణి శరీరమోక్షంబుఁ జేసినది మొదలు గా సర్వసంగపరిత్యాగంబుఁ గావించి యపరిగ్రహుం డై. 29

సీ. గంగాప్రవాహసంక్షాళితాభ్యున్నత, రుద్రాక్షదేవదారుద్రుమంబుఁ
గస్తూరికాకురంగజనాభిపరిమళ, శ్లాఘ్యేందుకాంతపాషాణతలముఁ
గిన్నరద్వంద్వసంభిన్నపంచమరాగ, నిర్యన్మహావేగనిర్ఝరాంబు
పతితప్రతిధ్వానభంగోరుఘుమఘుమ, ఘుమఘుమాయతదిశాగోళకంబు

గీ. నైనహిమశైలపాదంబునందు నియతిఁ, దపముసేయంగ మదిలోనఁ దలఁచి విడిసెఁ
బ్రమథవర్గంబుఁ దానును బసవఁ డపుడు, కృత్తివాసుండు విషయనివృత్తుఁడగుచు. 30

గీ. ప్రమథు లెల్లరు విడిసి రప్పర్వతమునఁ, జంద్రకాంతశిలామణిస్థలములందు
నమరియుండునమేరువృక్షములనీడ, భూర్జతరుచర్మపరిధానములు ధరించి. 31

చ. బసవఁడు అంకె వైచి హిమపర్వతసానువనాంతరంబులం
బసిరిక మేసి నిర్ఝరులఁ బాఱెడుతియ్యనినీరు గ్రోలి క్రొ
వ్వొసఁగ ఘనాఘనధ్వనుల నుల్లస మాడెడుఁ దత్పురంబునన్
బ్రసభగతిన్ మృగేంద్రములు భద్రగజంబులు భీతిఁ జెందగన్. 32

గీ. ఆత్మమూర్త్యంతరం బైనయగ్నిదేవు, నర్చనము సేసి నియతి నయ్యష్టమూర్తి
బహుతపోవ్రతనియమైకఫలవిధాత, తలఁపుఁ జేసెను మది నొక్కతలఁపుఁ జేసి 33

గీ. అపుడు హిమవన్నగేంద్రుఁ డత్యాదరమున, నతిథి యై యున్నశంభున కర్చ లిచ్చి
తత్సమారాధనక్రియార్థమునఁ బంచె, నిజతనూజ నజినసమన్వితము గాఁగ. 34

క. రమణి తపోవ్రతచర్యా, సమధికవిఘ్నంబ యనుచుఁ దలపోసియు శీ
✓ఘ్రము గైకొనె శివుఁడు వికా, రము లేక మదిం దపంబు రమణీమణియున్. 35

సీ. పాటించుపువ్వులు పల్లవంబులు గోయుఁ, గుశపవిత్రంబులుఁ గూడఁబెట్టు
నాపగ రక్షిం మీఱు నర్ఘ్యోదకములును, నుపకరణంబులు నొయ్యఁ జేర్చు
వేదికాసమ్మార్జవిధి నివర్తించును, లీలమై రంగవల్లిక లొనర్పుఁ
గల్పించు లెస్సగా గంధాక్షతంబు లు, త్పాదించు ధూపదీపాదికములు

గీ. ప్రత్యహంబును హిమధరరాజతనయ, భవునిపదపద్మములమీఁద భక్తి గలిగి
తచ్ఛిరశ్చంద్రచంద్రికాస్తబకశైత్య, శాంతపద్మటకక్రియాక్రాంతి యగుచు. 36

వ. అక్కాలంబునం దొక్కనాఁడు స్వర్గలోకంబునఁ బాకశాసనుండు కల్పానోకహం బులనీడలఁ జింతామణివేదికాస్థలంబులందు బృందారకులు పరివేష్టింపఁ బేరోలగం బుండి దివిజకార్యార్థసంసిద్ధిఁ బొంద మనంబునందుఁ గందర్పునిం దలంచిన. 37

సీ. కాంతాజనంబుల కటివంకబొమలతోఁ, బ్రతివచ్చు పుష్పచాపంబుతోడఁ
గోకిలవ్రాతంబు గ్రుక్కిళ్లు మ్రింగించు, క్రొమ్మావి చిగురాకుఁగోడుగులతోడ
రతిదేవినిడుసోగఁ గ్రాలుకన్నులడాలుఁ, దలపించు మీనకేతనముతోడ
భుజగలీలావతీభుక్తశేషము లైన, గంధవాహకిశోరకములతోడఁ

గీ. జందురునితో వసంతమాసంబుతోడ, రాజకీరరథం బెక్కి ప్రాభవమున
వచ్చె వలరాజుచిత్తానువర్తనముగ, సంభ్రమముతో మహేంద్రునాస్థానమునకు. 38

ఉ. పక్షముపెంపునం గుసుమబాణునిమీఁదనె వ్రాలె దేవతా
ధ్యక్షునివేయికన్నులును దక్కనవేల్పుల నుజ్జగించి సూ
త్రేక్షికఁ జూడఁ గార్యగతి యిట్టిదయౌ ప్రభువుల్ ప్రయోజనా
పేక్ష నొకప్పు డాశ్రితులపేర సమంచిత గౌరవోన్నతుల్. 39

క. రా యిటు రమ్మని చేతికిఁ,జే యిచ్చి ప్రమోదరేఖ చిగురొత్త మరు
న్నాయకుఁడు నిల్పె సుమన, స్సాయకు సరిగద్దెమీఁద సౌహార్దమునన్. 40

వ. అప్పుడు. 41

గీ పతిప్రసాదంబుఁ దనమౌళిపై ధరించి, మహితవినయావనమ్రుఁ డై మన్మథుండు
సంగతంబుగ హస్తాంబుజములు మోడ్చి, విస్ఫురోక్తుల నిట్లని విన్నవించె. 42

వ. దేవర నన్నుఁ దలంపున నవధరించిన కారణం బేమి యానతిమ్ము. 43

సీ. ఎవ్వండునీపదం బెలమి నుద్దేశించి, యతిఘోర మగుతపం బాచరించె
నెవ్వండు నీచిత్త మెరియించుచున్నాఁడు, కైవల్యపదవికైఁ గాలుసాఁచి
యెవ్వండు గురునీతి కేపాకమును బొంద, కుద్దండరీతి మాఱొడ్డి నిలిచె
నెవ్వండు దంభోళిహేతినిర్ఘరధారఁ, దలఁచె నీలోత్పలధారఁ గాఁగ

గీ వాని భంజింతు నాతనిమాన మడఁతు, నతని నిర్జింతు నాతని నతకరింతు
నానతిమ్ము మహేంద్ర నా యట్టిహితుఁడు, నీకుఁ గలుగ నసాధ్యంబు నెగడు నెందు.

గీ. ఏకభర్తృవ్రతస్థ యై యేలతాంగి, నీకుఁ జేయాత్మధర్మంబు నిలువరించె
నది వినిర్ముక్తలజ్జ యై యమరరాజుఁ, జేయుఁ గాత స్వయంగ్రహాశ్లేషణంబు. 45

గీ. ప్రణయకోపప్రశాంతికై పాదపతితు, నిన్ను నేవుఁబోఁడి మన్నింప దయ్యె

వాలతాంగిఁ బ్రవాళశయ్యాశరణ్య, దేహఁ గావింతు విడువు సందేహ మింద్ర.

క. నీవజ్రము సుఖముండుం, గావుత దివ్యాస్త్రశాలికామధ్యమునన్
దేవేంద్ర చెఱకువింటం, బూవులు శరములుగ నే రిపుల నిర్జింతున్. 47

వ. నీప్రసాదంబున మలయానిలంబు ప్రాపును వసంతంబు సహాయంబును నిండువెన్నెల చెలిమియుం గలుగఁ బినాకపాణి యగుహరు నైన జయింపం జాలుదు నని తలంతుం దక్కినవారు నా కెవ్వరు నెంత యని యుత్సాహంబునం బల్కినం బురందరుండు సంకల్పితార్థంబు సఫలం బయ్యె నని యంతరంగంబున సంతోషించుచుఁ గంతున కిట్లనియె. 48

సీ. సంకల్పసంభవ సమకూర్తు వట్లనే, యరుగంగ నీ కసాధ్యంబు గలదె
యటు కాని కాని మహాకార్యభరమునం, దేము నియోగింతు మిపుడు నిన్ను
ధరణిభారధురీణతాప్రౌఢి కని కదా, తను మోచు శేషునిఁ బనిచెను హరి
విబుధకార్యార్థంబు విశ్వేశ్వరు గుఱించి, యరుగంగవలయు నీ వధికభక్తి
గీ. కుధరకన్యను శశిమౌళిఁ గూర్పవలయుఁ, బార్వతీపరమేశ్వర ప్రభవ మైన
దివ్యతేజంబు సేనాపతిత్వ మొంది, జయముఁ గావించు నని చెప్పె జలజభవుఁడు. 49

వ. హిమాద్రిపాదంబున దేవదారువనంబున నియతాత్ముఁ డై పరబ్రహ్మానుసంధానంబు సేయుచు నంధకారాతి తపంబు సేయుచున్నవాఁడు పార్వతియు హిమవన్నియోగంబున నీశ్వరునకుం బాయక పరిచర్య సేయుచున్న యది యీవార్త సకలలోకవృత్తాంతవిజ్ఞానార్థంబు పంపిన యప్సర స్త్రీవర్గంబువలన నింటి నిది కార్యక్రమంబు.

గీ. ఇది యనన్యసాధారణ మిది యవశ్య, మిది పరోపకృతిక్రియాభ్యుదయశాలి
చేయు మిప్పని సంకల్పసిద్ధి గాఁగ, బాహువిక్రమపారీణ పంచబాణ. 51

గీ. కోరి యభ్యర్థనము సేయువారు సురలు, కార్య మూహింప మూఁడులోకమ్ములకును
నతిశుభము కృత్యమో యల్ప మైనఁ గాదు, కానుసంస్పృహనీయవిక్రముఁడ వీవు. 52

వ. హుతాశనునకు సమీరంబుం బలె మధుమాసంబు సహాయం బగుం గాత మర్థలాభంబును సేమంబును బునర్దర్శనంబు నయ్యెడు మని దీవించిన దేవేంద్రునియానతి ముత్యాల సేసం బోలె శిరంబునఁ దాల్చి యైరావణకుంభికుంభాస్ఫాలనకర్కశం బగుకరంబున వాస్తోష్పతి తన్ను సంస్పర్శించి గౌరవించిన మన్మథుండు మధుసహాయుం డై హిమవత్పర్వతంబు సేరం జనియె నాసమయంబునందు. 53

చ. సకలవనంబులందుఁ గలసంయమికోటి తపస్సమాధిని
ష్ఠకుఁ బ్రతికూలవర్తి యయి షట్పదకోకిలరాజకీరజా
లకములతోడఁ గూడ ఝషలాంఛను నెచ్చెలికాఁడు వచ్చె వాఁ
రక మధుమాసరాజు నవరాగసమంచితపల్లవాస్త్రుఁ డై 54

గీ. ఉత్తరాభిముఖుం డైనయుష్ణరశ్మి, చంద మీక్షించి దక్షిణాశాపురంధ్రి
గంధవాహంబు దీర్ఘదీర్ఘంబు గాఁగఁ, జాఁగ విడిచెను విరహనిశ్వాసధార. 55

శా. ఆమూలాగ్రమశోకపాదపము ప్రత్యగ్రప్రవాళావళి
వ్యామిశ్రంబుగఁ బూచె నప్పు డటు నీహారాద్రికుంజంబునన్
భామాకోమలపాదపంకరుహసంపర్కం బపేక్షింప కు
ద్దామం బై నవసంతజృంభణము సత్వం బొప్ప దీపింపఁగన్. 56

గీ. చివురుగఱితోడ లేమావిపువ్వులు శరముఁ, జేసి మధుమాసకాలంబు చిత్తజునకు
నళికులంబులపేర నామాక్షరములు, వరుసతో నిల్పె ననఁ బొల్చె వానియందు. 57

క. నవకము లగుములు మోదువుఁ, బువుమొగ్గలు విపినవీథిఁ బొల్పెసలారెన్
దివుట వసంతుం డనుప, ల్లవుఁ డిడినఖక్షతంబులను సరి యగుచున్. 58

గీ. చెమట కింపురుషస్త్రీలచెక్కులందుఁ, గ్రమ్మి మృగనాభిపత్త్రభంగంబుఁ గరఁచెఁ
జందనద్రవ మింపయ్యెఁ జన్నుఁగవకు, నలరుఁబన్నీటితో గుహ్యకాంగనలకు. 59

వ. అప్పుడు వనౌకసు లగుతాపసు లప్రతియత్నసంస్తంభితక్రియారంభులును మదనుండు సమారోపితపుష్పచాపుఁడును మధుకరంబులు కుసుమపాత్రపరిపూర్ణమధురసగండూషసముపలాలితప్రియాసందోహంబులును మృగంబులు మృగీకండూయనపరాయణంబులును నై యుండిరి వెండియు. 60

ఉ. పంకజరేణుగంధి యగుపల్వలవారిఁ గరేణు విచ్చె ని
శ్శంక మదావళంబునకు గంధగజంబును బద్మినీమృణా
లాంకుర మర్ధభుక్తము నిజాంగనకుం బ్రియ మారనిచ్చె నా
వంకఁ దపోధనుల్ హృదయవత్సలతన్ బ్రియ మంది చూడఁగన్. 61

ఉ. దేసికగానిమార్గములఁ దిన్ననిరీతులఁ బాడిపాడి యా
యాసము నొంది సోలి యరవాడినయంగనమోముఁ దమ్మిఁ బు
ష్పాసవఘూర్ణితేక్షణము లల్లనఁ జుంబన మాచరించి యు
ల్లాస మొనర్చెఁ గిన్నరవిలాసి హిమాచలకందరంబునన్. 62

గీ. అచ్చరలు పాడుహిందోళ మాలకించి, యిందుమౌళిప్రసంఖ్యాన మెడల దయ్యె
నిర్జితేంద్రియు లైనట్టినియమపరుల, నంతరాయంబు లేమిసేయంగఁ గలవు 63

వ. అప్పుడు వామప్రకోష్ఠార్పితహైమవేత్రకుం డగునందికేశ్వరుం డభినవవసంతసమయారంభసంభూతమనోవికారంబు లగుప్రమథవీరులభావంబులు భావించిహుంకారంబు సేసి మాను మని యదల్చిన నాశిలానందనుదివ్యశాసనంబునఁ గాననం బెల్ల నిష్కంపవృక్షంబును నిభృతద్విరేఫంబును మూకాండజంబును బ్రశాంతమృగప్రచారంబు నై

బా

చిత్రార్పితావస్థానంబునుంబోలె నుండె నేనియును మనోభవుండు ముక్కంటియెదురుఁ
జక్కటి గానియొకపక్కియఁగాఁ బురశ్చక్రంబు నడచువాఁడునుంబోలె మనంబునం
జెంకుచు నెట్టకేలకు నాజగజెట్టితపంబు సేయుచలికొండచట్టుపట్టునకుం జనుదెంచి
చుట్టునుం దిరిగి యున్నసురపొన్నమోకల నీడ నిల్చి యచ్చోట శార్దూలచర్మంబునం
బర్యంకబంధబంధురితపూర్వకాయుండును నుత్తానపాణియుఁ బ్రాణాయామపరుండును
నగు నమ్మహాదేవునిపార్శ్వంబునం బుష్పాంజలి వట్టి ధ్యానావసానావసరముం బ్రతీ
క్షించుచుఁ గించిద్విలంబమానకేసరచ్ఛదాభిరామకాంచీకలాపయుఁ గర్ణికారకుసుమ
తాటంకయుఁ బల్లవావతంసయును నగుపార్వతిం గనుంగొని యిదియ నా కవసరం బని
యధిజ్యశరాసనుం డై. 64

సీ. వలుదకెం జడకొప్పు వదలి వీడకయుండఁ, బెనుపాఁపతలపాగ బిగియఁజుట్టి
మెడకప్పుతోఁ గూడి మిక్కిలి నలు పైన, కమనీయకృష్ణాజినము ధరించి
భ్రూవికారము లేనిపాడవుఱెప్పలలోని, ఘనదృష్టి నాసికాగ్రమున నిల్పి
యోగపట్టికఁ జెంది యొఱ పైననిలుకడ, నాసనస్థితిబంధ మనువుపఱచి
గీ. నిస్తరంగక మైనమున్నీరువోలె, గర్జితము లేనిఘనఘనాఘనము వోలె
ధ్యాననిశ్చలుఁ డగునిందుధరునిఁ జూచి, ప్రసవనారాచుఁ డతిభయభ్రాంతుఁ డగుచు.

ఉ. ఒయ్యన డాయఁగాఁ జనియె నుగ్రవిలోచనుపార్శ్వభూమికిం
దయ్యము లేఁదు నెచ్చెలి యెదన్ భయకంపము నుప్పతిల్లఁగాఁ
దియ్యనివిల్లుఁ బువ్వములుఁ దీర్చినయమ్ములు శౌర్యసంపదల్
వయ్యము గాఁగ భూమిఁ బడ వైచె నిలింపులు చూచి బెగ్గిలన్. 66

క. స్థావరరాజతనూభవ, యావేళన డాయవచ్చె నభవునిసేవా
హేవాకప్రౌఢిని వన, దేవత లెంతయు గభీరగతిఁ దనుఁ గొలువన్. 67

గీ. పద్మరాగవిభూషణప్రతతిమ ఱు, లలి నశోకలతాప్రవాళములు దాల్చి
సిందువారప్రసూనరాజీవరాజిఁ, గమ్రమౌక్తికరత్నశృంగార యగుచు. 68

చ. చనుఁగవ వ్రేఁగున న్మిగులసన్నపుఁగౌ నసియాడఁ గెంపు మీ
ఱిన నునుఁబట్టుఁజేలఁ గటి జెంగులు వాఱఁగఁ గట్టి భూమిభృ
త్తనయ ప్రసూనగుచ్ఛములు దాలిచి లేఁజిగురుల్ ధరించి వ
చ్చిన నడదీవవోలె నిలిచెం దరుణేందుకిరీటుసన్నిధిన్. 69

గీ. తరుణి యందందఁ గేసరదామకాంచి, జఘనపులినంబు నందుండి జాఱిపడఁగ
మాటిమాటికి హస్తపద్మముల నెత్తు, చచలభావంబుతో నుండె నభవుమ్రోల. 70

ఉ. తమ్మనియూర్పుగాడ్పుల గందముఁ గ్రోలఁగ వచ్చి యోష్ఠబిం
బమ్ముసమీపదేశమునఁ బాయక యాడెడుతేఁటిఁ గేలిప

ద్ద్యమ్మున మాటిమాటికి సముంచితవిభ్రమలోలదృష్టి యై
యమ్మదిరాక్షి చిమ్ము దరహాసవికస్వరగండపాళి యై. 71

గీ. అఖిలలక్షణసంపూర్ణ యైనయట్టి, యాలతాతన్విఁ జూచి పుష్పాయుధుండు
రమణదాఁబూను దేవతారాధనంబు, సఫలతం జెందె నని చాల సంతసిల్లె. 72

ఉ. అప్పుడు డాయ వచ్చెఁ దరుణాబ్జకళాధరు గౌరి భక్తితో
నప్పుడు డాసె నీశ్వరుఁడు నంచితయోగసమాధినిష్ఠమైఁ
దప్పక బాహ్యసీమఁ బ్రమదం బెసఁగం బరమంబు సోహమై
యొప్పెడుదివ్యతేజము సముజ్జ్వలకోటితటిత్ప్రకాశమున్. 73

క. అసమభయభక్తు లలరఁగఁ, గుసుమంబులు దోయిలించి కోమలి నించెం
గిసలయభంగంబులతో, నసమునడుము వణఁక మృదునియడుగులమీఁదన్ 74

ఉ. పల్లవపుష్పభంగములు పాదసరోరుహయుగ్మకంబుపైఁ
జల్లి శ్రవోవతంస మగుసంపగిమొగ్గ యొకింత జాఱఁగా
నల్లన మ్రొక్కెఁ బార్వతి భయంబును భక్తియు సంభ్రమంబు సం
ధిల్లఁగ భర్తకుం ఘనఫణిప్రభుహారున కంధకారికిన్. 75

క. సరితేనిమగనిఁ బడయుము, తరుణీ యని పల్కె శివుఁడు తథ్యమ యిది యీ
శ్వరభాషితమునకుం దర, తరములయందైన నన్యథాత్వము గలదే. 76

ఉ. పంచశరుండుఁ దత్పరత బాణవిమోక్షణకాలముం బ్రతీ
క్షించుచు గౌరి శంకరునిఁ జేరినయప్పటినుండి యెప్పుడుం
గించుకయో హరుండు తరుణీమణి నంచును వింట నారి సా
రించుచు నుండెఁ జెంత నురరీకృతదైవతకార్యధుర్యుఁ డై. 77

గీ. ప్రియము శోభిల్లఁగా సమర్పించె గౌరి, పసనిపర్యేద జాజి దోగపల్లవమున
భానుదీప్తులు నీటారి ప్రసన్న మైన, పృథులమందాకినీపద్మబీజమాల. 78

గీ. అంబుజాక్షి సమర్పింప నాదరమున,నక్షమాల్యంబు నిటలాక్షుఁ డందుకొనియెఁ
బంచబాణుండు సంధించె నిందువింట, నస్త్రరాజంబు సమ్మోహనాఖ్యగంబు. 79

మ. శమనారాతి నివృత్తధైర్యుఁ డగుచుం జంద్రోదయారంభకా
లమునం బొంగిన దుగ్ధసాగరములీలం బక్వబింబాధరో
ష్ఠముఁ గర్ణాంతవిశాలనేత్రము నతిస్వచ్ఛంబునై యొప్పు గౌ
రిముఖాంభోజమునందు నిల్పె సరసప్రేమంబునం జూడ్కులన్. 80

గీ. శైలసుతయును భావంబుకీలు దెలిసి, యంగకంబులఁ బులకంబు లంకురింప
వ్రాల్చె నిమ్మోము లజ్జాభరంబుచేర్చి, నీశరాలోకనంబులఁ గెల్లుమలఁగి. 81

వ. అనంతరం బంతకమథనుం డతిరిక్తం బైనయింద్రియక్షోభంబు బలాత్కారంబు
గా నుదయించినచేతోవికారంబునకుం గారణంబుఁ దెలియం దలంచి దిశాంచలంబు
లకుం జూపు పఱపునప్పుడు కట్టెదుర దక్షిణాపాంగవినిష్టముష్టియు నానతాంగుండును
నాకుంచితసవ్యపాదుండునుం జక్రీకృతకార్ముకుండును బ్రహారోద్యుక్తుండును నైన
మన్మథునిం గనుంగొని తపఃపరామర్శవివృద్ధక్రోధుండయ్యె నవ్వేళ భ్రూభంగదుష్ప్రే
క్షం బగువిరూపాక్షునిలలాటేక్షణంబునం జనియించినసముజ్జ్వలజ్వాలాజాలం బైన
కృపీటయోని భువనంబులెల్ల భయభ్రాంతంబులై హాహాకారంబులు సేయ నమ్మీనకేత
నుశరశరాసనతూణీరంబులతోడం గూడ భస్మంబు చేసిన. 82

సీ. నాగభూషణుఫాలనయనానలముచేతఁ, బంచబాణుఁడు బిట్టు భస్మమయ్యెఁ
బ్రబలాభిషంగసంప్రభవమోహంబునఁ, గేళిని యువశ యై వ్రాలె ధరణి
యువతిసంసర్గంబు యోగవిఘ్నం బని, యభవుఁ డంతర్ధాన మాచరించెఁ
జెలికాఁడు తనమ్రోల నొనికి బూడిద యైన, నామని యేడ్చె నా పఱచినట్లు
గీ. గౌరి తనచారుసౌభాగ్యగౌరవంబు, విలువ పోయినచెలువున విన్నవోయెఁ
బర్వతేంద్రుండు నిర్విణ్ణభావ యైన, కూర్మినందన నింటికిఁ గొంచుఁబోయె. 83

వ. అనంతరంబ రతిదేవి మోహాంధోన్మీలితంబు లైనలోచనంబుల నత్యంతప్రియదర్శనుం
డగుప్రియుం గానక పురుషాకారంబున భూమిం బడియున్న భస్మంబుం గని యి
ట్లని ప్రలాపింపం దొడంగె. 84

ఉ. చక్కనివారిలోన నెఱజాణలలో విటరాజకోటిలోఁ
జిక్కనివారిలోఁ గడుఁ బ్రసిద్ధివహించిన నీవు ప్రాణముం
దక్కనచోట నీమనను ధైర్యమున న్మిషిమింతురాలు గా
నక్కట! పుష్పసాయక మహాకఠినాత్ములువో మృగేక్షణల్. 85

మ. ప్రతికూలాచరితంబు నావలన నల్పం బైననుం గాంచితే
ప్రతికూలాచరితంబు నీవలన నల్పం బైన నేఁ గంటినే
కృత మెన్నండును లేనిచంద మిది లక్ష్మీపుత్ర! నీయందు న
న్నతిదుఃఖాన్విత డించి పోవఁ దగవా యధ్వానవుంబట్టునన్. 86

క. తలఁతే మన్మథ! గోత్రస్ఖలితంబుం జఘనసూత్రకరబంధంబుల్
దలఁతే మఱియు వసంత, త్పులకలికారాధనంబుఁ దత్సమయమునన్. 87

క. మెఱయంగ ముసురఁ గురియఁగ, నుఱుమం బురవీథులం బయోధరవేళం
దెఱవల రమణులయొద్దకు, నిఱుఁజీఁకటినిశల నింక నెవ్వం డనుపున్. 88

సీ. మదిరారసాస్వాదమదవికారంబులు, బింబాధరలకు విడంబనములు
ప్రియవియోగంబున బెదరించువాఁ డయ్యె, నుడువల్లభుఁడు నిష్ఫలోదయుండు

కోయిలనోరూరు క్రొత్తమామిడిమోక, నవపల్లవంబు, బ్రాణత్వ ముడిగె
శుకశారికలు గూడి శోకస్వరంబులఁ, బలవింపఁ దొడఁగెఁ దాపంబు గదిరి

గీ. మాసములు దుఃఖపడె మధుమాధవములుఁ, జిన్నిమలయానిలంబులుఁ జిన్నవోయె
మాట లేటికి వేయు సోమగలరాజ, విశ్వమున నీవు లే కున్న వెలితివడియె. 89

గీ. హృదయమున నుండి యెప్పుడు హృదయనాథ
ప్రియముఁ జెప్పెద నను టెట్లు భేషజంబు
హృదయమున నుంట నిజ మేని మదన యెట్లు
భస్మమైతివి నే నెట్లు బ్రదుకఁ గంటి 90

వ మన్మథ! మధురాలాపవినిసర్గపండితంబు లగుగండుఁగోయిలల నేలొకో భువనం
బులకు రాయభారంబు పంపవు? ప్రణిపాతయాచితంబు లగుగాఢోపగూహనంబులు
మఱచితే? యార్తనం బగుకుసుమప్రస్థానంబు నాయంగంబులం దిది నీవు రచియించి
నది కదా? దక్షిణేతరం బగుమదీయచరణంబు లాక్షారాగపరికర్మంబునకుం దగ
దొకో? పతంగమార్గంబున నింగలంబునం బడి భవదంకంబాశ్రయించెదఁ గాక మద
నుండు లేక రతిదేవి జీవించు నను నపవాదంబు లోర్వవచ్చునే? నీసుహృదీశ్వరుం
డయినవసంతుం డెచ్చట నున్నవాఁడు? పటుక్రోధరేఖానటద్భ్రూభంగభీషణము
ఖుం డగుఫాలలోచనులోచనంబు చిచ్చున నతండును వెచ్చి నిన్నుఁ గూడెనే యని
యనేకప్రకారంబులం బలవింపఁ దత్పరిదేవనాక్షరంబులు బాణపాతంబులంబోలి
తూఱనాటుటయు నంతయు నొచ్చి యమ్మధుమాసం బక్కసలయకోమలికిం బుట్టిన
మహావ్యసనంబూరార్పం జేర వచ్చుటయు. 91

సీ క్రొమ్మిడి క్రై పెక్కు కుసుమంబు లుమియుచు, నవటుప్రదేశంబునందుఁ బొరల
జేవురించిన లేఁత చెక్కుటద్దంబులఁ, దాటంకయుగళంబు తెన్నియాడ
నాక్రోశపరిదేవనాక్షరవ్రాతంబు, కంఠగద్గదికచేఁ గ్రక్కుపడఁగ
హరినీలములచాయ నక్షిగోళమ్ముల, సొబగుగాఁ గన్నీటిసోన గురియ

గీ. ముత్తియంబులు పేరులు ముఱిసిపడఁగ
హస్తముల వీఁగఁ జనుదోయి యడఁచుకొనుచు
సంబెరం బిచ్చె రతిదేవి శంబరారి
కమలినవసంతు నెదుట దుఃఖార్త యగుచు. 92

వ. ఇవ్విధంబున నారామ పేరామనియెదుట నెమ్మనంబునఁ జేరామనియై వర్తిల్లునార్తి
సంబెరంబిచ్చి సొమ్మసిలంబోయి తేచి వసంతునిం గనుంగొని మాధవ! నీచెలికానిం
జూడు కపోతకర్బురం బైనభస్మం బైనవాఁడు! నీవు వచ్చుట యెఱుంగండు సుమ్మీ!
సురాసురం బైనజగంబు బిసతంతుగుణం బైనకోదండంబునం గెలుచుండ్లువెట్టు నిట్టి

జగజ్జెట్టియుం గలండే? యతిపరుషపవనసంపాతాహతం బైనదీపంబునుంబోలె నీపరమి
త్రుండు క్రమ్మఱిలండు సుమ్మీ! నాపాపంబునం జేసి విధి వెలిగాఁ గ్రొన్ననవిలు
కానిం గొనిపోయె. నీవును బరమమిత్రుండవు గావున నన్నును నగ్నిముఖంబున నీ
సఖుం గూర్పం బాడి. "శశితోడంగూడఁ గౌముదియు మేఘంబుతోడంగూడ
మెఱుంగు" ననుట సకల సమ్మతంబు. కుసుమశరుశరీరభసితచూర్ణంబు శరీరంబునం
దాల్చి నామేను విభావసునందు వ్రేల్చెదం గిసలయతల్పంబులకు నిట మున్న సహా
యుండ వగునీకుఁ జిత పేర్పంజాలవచ్చెనే యని పల్కి శోకావేశంబున వెండియు. 93

సీ. హస్తయుగ్మము మోడ్చి ప్రార్థించి పలికెదఁ, దమ్ముఁడా నా కిమ్ముఁ దగఁ జితాగ్ని
మందమందంబుగా మలయానిలంబులు, వెరవుతో మండంగ విసరుఁ గాతఁ
బరలోకతృప్తికై బంధు లిద్దఱకును, ధర్మోదకం బిందు తమ్మితేని
సహకారమంజరీచరుపిండకబళంబు, పెట్టుండు మాకునై పికము ముట్టఁ
గీ. దేన పెట్టుండు కస్తూరిదీర్చియచటఁ, జేర గొజ్జంగపూనీటఁ జెంబు లిడుఁడు
నన్ను వలరాజుఁ దలఁచి మన్నన దలిర్పఁ, దగ సమర్పణ చేయుఁడు దంపతులకు. 94

వ. అని తెంపు సేసి యగ్నిప్రవేశంబున కాయితం బై యున్నసమయంబున రతినుద్దేశించి
యాకాశవాణి యోమన్మథపత్నీ! సాహసంబు వలవ దుడుగుము నీకుం జేరువన మే
లుగాఁగలయది నీమగండు కందర్పుండు భుజాదర్పంబునం గన్నుఁ గానక కనకగర్భుని
సమావిర్భూతమనోవికారునిం జేసి తనకుమారికయం దతనికిఁ గాఁ గానితలంపుఁ బుట్టించె
కన్నియం గవసిన తనయన్యాయంబునకుం దాన రోసి సరసిరుహాసనుం డీసునఁబుట్టించిన
వాఁడు కుసుమశరుండు కదా! యద్దురాత్ముండు హరకోపానలంబున భస్మం బగుం
గావుత మని శపించిన యది కారణంబుగాఁ బ్రద్యుమ్నున కిద్దురవస్థ తటస్థించె 95

ఉ. ఎప్పుడు పెండ్లియాడుఁ బరమేశ్వరుఁ డద్రితనూజ వేడ్కతో
నప్పుడు లబ్ధసౌఖ్యుఁ డయి యంబికప్రార్థన నాసదాశివుం
డెప్పటియట్ల సర్వభువనైకధనుర్ధరునిం బ్రియుం బ్రియాం
బొప్పఁగ నిచ్చు నీకు మది నొందు తలంపకు నమ్ము మాత్మలోన్. 96

వ. అనియదృశ్యరూపం బైనభూతంబు రతీదేవిమరణవ్యవసాయబుద్ధి మందీభవింపం జేసెఁ
గుసుమాయుధబంధుం డగువసంతుండును నావృత్తాంతంబునకు సంతసించి య
క్కాంత నూరార్చి నాళాపాంతం బవలంబించి శంబరారిపత్నియు గౌరీకళ్యాణకాల
మ్ముం బ్రతీక్షించుచు విరహక్షీణం బైనశరీరంబు రక్షించుకొను చుండె నంత 97

ఆశ్వాసాంత్యము.

ఉ. మంకణమానివంశమణిమండన! కాంచిపురీనివాస! యే
ణాంకకిరీటదివ్యచరణాంబుజసేవక! వైరిభద్రనా

గాంకుశ ! హారహీరదరహాసవిపాండురకీర్తిచంద్రికా
లంకృతదిగ్విభాగ ! శుభలక్షణ ! వారిరుహాయతేక్షణా! 98

క. కరదీపదానశోభిత, బిరుదాంకిత ! యంబునిధిగభీరసుహృదయా!
హరచరణకమలపూజా, పరతంత్రస్వాంత ! వంశపావనచరితా! 99

మాలిని. మాచమాంబాసుతా ! మానదుర్యోధనా, యాచకాభీప్సితత్యాగచింతామణీ!
ధీచతుర్వర్గ! యాస్తిక్యసంపన్నిధీ! లోచనాంభోరుహాలోలలక్ష్మీకళా! 100

గద్యము.

ఇది శ్రీమత్కమలనాభపౌత్ర మారయామాత్యపుత్ర వినయవిధేయ
శ్రీనాథనామధేయప్రణీతం బయినహరవిలాసం
బనుమహాప్రబంధంబునందుఁ
దృతీయాశ్వాసము.

శ్రీరస్తు.

హరవిలాసము

చతుర్థాశ్వాసము.

శ్రీ కావేరీవల్లభ!
లోకస్తవనీయ! సర్వలోకాశ్రయ! ద
ర్వీకరభూషణభక్త! సు
ధీకలితవివేక! యవచిదేవయతిప్పా!

వ. ద్వితీయవిలాసం బైనగౌరీకళ్యాణం బాకర్ణింపుము. 2

గీ. అవ్విధంబునఁ దనమౌళి నసమశరుఁడు, తనకుఁ గా నీశ్వరునిచేత దగ్ధ మైన
ధరణిధరకన్య నిందించెఁ దనదురూపుఁ, బరులు మెచ్చనిచెలువునిష్ఫలమ కాద. 3

వ. అనంతరంబ వసుంధరాధరకన్య యవంధ్యప్రతిజ్ఞ యై తపస్సమాధినియతత్వంబు
వహియింప నిజాభిప్రాయంబు మేనకాదేవి కెఱింగించిన. 4

గీ. గ్రుచ్చి కౌఁగిలించుకొని యమ్మహీధర, సార్వభౌముదేవి చతురభంగి
బుజ్జగించి కూర్మి పొంపిరివోవంగ, హితమితోక్తిఁ బుత్త్రి కిట్టు లనియె. 5

ఉ. ఎక్కడ లేర వేల్పులు సమీప్సితదాతలు ముద్దుఁగూన నీ
వెక్కడ ఘోరవీరతప మెక్కడ యీపటుసాహసిక్యముల్
తక్కు శిరీషపుష్ప మవధానపరత్వమునన్ మధువ్రతం
బెక్కిన నోర్చునో విహగ మెక్కిన నోర్చునో నిశ్చయింపుమా. 6

గీ. అని నివారించె గిరిపత్ని యనుఁగుఁగూఁతుఁ, బార్వతియుఁ దల్లిమాటఁ జేపట్టదయ్యె
నీప్సితార్థంబునకుఁ జాఱుహృదయరుచియు, నిమ్నమున దోడిగిలునీరు నిలుపరాదు. 7

వ. అంత నాచంద్రావన సఖీముఖంబున నిజమనోరథంబుఁ దండ్రి కెఱింగించి యమ్మహాను
భావుచేత నరణ్యనివాసమునకును ఫలోదయాంతం బైనతపస్సమాధికిని నానతి వడసి
దృఢప్రతిజ్ఞానిర్వాహంబున. 8

ఉ. భూధరరాజకన్య మణిభూషణముల్ దిగఁద్రావి యీశ్వరా
రాధనకేళికౌతుకపరాయణ యై ధరియించెఁ బాండుర

తాధృతిపూర్వకంబుగఁ బ్రగాఢపయోధరమండలీసము
చ్ఛేదవికీర్ణసంహతుల నేలుమహీధరవల్కలంబులన్. 9

గీ. పాశుపతదివ్యదీక్షఁ జేపట్టి గౌరి, చంచరీకాంగనాగరుచ్ఛాయ నేలు
కుటిలకోమలతరదీర్ఘకుంతలములు, మడమ లంటఁగ నిడుపాటిజడలు గట్టె. 10

సీ. ముత్యాలసొలనూలు మురువునూపెడునట్టి, జఘనంబుపై మౌంజి సవదరించెఁ
గందుకక్రీడపై గారం బుపచరించు, హస్తాబ్జములఁ బూని నక్షమాల
కస్తూరికాంగరాగములతో విలసిల్లు, తనువల్లి హత్తించె ధవళభూతి
బొమ్మపెండిలపాటఁ బ్రొద్దుపుచ్చు నెలుంగు, నీలకంఠస్తోత్రనియతిఁ గూర్చెఁ
గీ. బసిఁడికమ్ములయందంపుఁబట్టుచేల, కొంగుచాటున వర్ధిల్లుకుచభరమునఁ
గంతఁగా వైచెఁ బులితోలుకళవసంబుఁ, బరమకళ్యాణి గిరసార్వభౌమతనయ. 11

గీ. హంసతూలికపాన్పుపై నలరు మొగ్గ, యొత్తునును మేనుగల్గునీలోత్పలాక్షి
బాహువల్లి తలాఁడగాఁ బవ్వళించె, శైలపాషాణపట్టికాస్థండిలమున. 12

గీ. పాశుపతదివ్యదీక్షావిభాసమాన, దివ్యతేజోవిశేషసందీప్తమూర్తి
కాలతాంగికి శతవృద్ధులైనమునులు, ప్రణతు లగుదురు భావిప్రభావశక్తి. 13

వ. ఇవ్విధంబున ధరాధరశిఖరంబులయందలిహరిణకిశోరంబులకు నరణ్యబీజాంజలినిధానంబునుం దరులతాకుంజంబులకు నిర్ఝరధారాసేకంబును నొనర్చుచుఁ గృష్ణాజినోత్తరాసంగవతియు సర్వాంగభసితాభ్యంగమంగళస్నానయు నై కొంతకాలంబు గడపి కాంక్షితంబు కడఁ గానక తెంపు సేసి మండువేసవిం గనగన మండు నగ్నిముఖంబునడుమన నిలిచి మధ్యాహ్నకాలంబున నర్కమండలం బాలోకించియు వర్షాకాలంబునఁ బక్ష్మపాళీక్షణస్థితంబులును దాడితాధరంబులును బయోధరోత్సేధవిపాతచూర్ణితంబులును త్రివళీవలయస్ఖలితంబులును నాభిగహ్వరప్రవిష్టంబులు నగుజలధరజలబిందుధారలం దోఁగియు శిశిరకాలంబునం దివతాళించుకొలంకులలోనం బుక్కిటిబంటి నీట నిశాసమయంబుల నిలిచియు నంబుచుళికంబులును నుడుపతికరంబులును కరువలిం డుల్లినజీర్ణతరుపర్ణంబులును నాహారంబుగా దుష్కరం బైనతపంబు సేయుచుండ నొక్కనాఁడు. 14

మ. అజినాషాఢధరుండు ప్రౌఢతరభాషాతిప్రగల్భుండు నీ
రజబంధుప్రతిమానతేజుఁడు జటారాజిచ్ఛటాతామ్రమూ
ర్ధజుఁ డేకాకివటుండు బ్రాహ్మణుఁడు విశ్రామార్థముంబోలె నా
త్రిజగన్మోహనమూర్తిసన్నిధికి నేతెంచెన్ వనాంతంబునన్. 15

గీ. ఇవ్విధంబున నేతెంచి యెదుట నిలిచి, గౌరి నాశీర్వదించె నక్కపటవటుఁడు
కలితకోమలనవకుళగంధి యైన, యంగుళీపల్లవంబుల హస్తమెత్తి. 16

వ. పార్వతియు బహుమానపురస్సరంబుగా నయ్యుర్వీసురవటునకు నతిథిపూజ యొనర్చిన నతండును గొండరామాలి సేయుసత్కారం బంగీకరించి ముహూర్తమాత్రంబు విశ్రమించి మేలువడిచూపునం జూచి ప్రస్తావనోచితంబుగా నిట్లనియె. 17

సీ. సలిలంబు త్రిషవణస్నానతుఖుం బౌనె, యంభోజపత్రదీర్ఘాయతాక్షి!
కుసుమంబులును నిద్ధకుశపల్లవంబులు, సులభంబులై యున్నె సుందరాంగి!
సత్వంబు లన్యోన్యజాతివైరముఁ దక్కి, శాంతి గైకొని యున్నె చంద్రవదన!
యనుదినంబును దేహయాత్ర కాయిత మౌనె, నీవారపాకాది పూవుఁబోణి!

గీ. శక్తికొలఁదిఁ దపశ్చర్య సంఘటింతె, ఫలముపై నాస నాగ్రహబంధ ముడిగి
తాపసంబోష్ఠి ధర్మసాధనములందు, నాద్య మగుసాధనంబు దేహంబ కాద. 18

క. మగువా! నీపెంచినలత, చిగురున ముకుళంబు నల్లచిల్లెనె చెపుమా
పగడపుఁగెమ్మోవిపయి, న్నగ వుదయించినవిధంబునం బ్రస్ఫుటమై. 19

క. పంకజలోచన! కరద, ర్భాంకురములు మేసినట్టి యపరాధమునన్
రంకుమదపోతకంబుల, జంకింపవుగా తపఃప్రశాంతి వెలితిగాన్. 20

గీ. అభ్రవీథిపరిచ్యుతం బైనయట్టి, యమరతటినీజలప్రవాహమ్ముకంటె
ధరణిధరరాజు నీచరిత్రంబుకతనఁ, బరమపావనుఁ డయ్యె నోపద్మనయన!. 21

వ. సంబంధంబు సాప్తపదీనంబు గావున నింతతడవు నీతోడఁ గదిసి పలుకు చునికిం జేసి యే నాప్తుండఁ గావున నొక్కమాట యడిగిన బ్రాహ్మణజాతిస్వభావసులభం బైన చాపలంబుఁ జూచి హెచ్చు గుందాడం బని లేదు రహస్యంబుగా కుండె నేనిం జెప్పుము. 22

సీ. ప్రథమప్రజానాథపావనకులమునఁ, బ్రభవించి తబల! ప్రపంచసార
సౌందర్యసంపద సడిగన్నదానవు,నశ్వరం బైశ్వర్యనైపుణంబు
సౌఖ్యంబు నిరవధి సర్వసామగ్రినీ, యఱచేతిభాగ్య మత్యాయతంబు
భాగ్యంబు నీకేమి భ్రాంతి యైనది మనో,రథ మేమి చెప్పుమా రాజవదన

గీ. దుష్కరం బైనతప మిట్లు దొడరి చేసి, మేను డయ్యించుకొనఁగ నేమిటికి వచ్చెఁ
జిత్తము విచారమార్గంబుఁ జేరఁదెచ్చి, తత్వముఁదెలియఁజెప్పు మాతమ మృగాక్షి.

వ. పితృగేహంబున నవమానంబు పుట్టదు గదా! పన్నగఫణారత్నంబుమీఁదఁ జేయిసాచు వాఁడు గలండే. నిండుజవ్వనంబునకుం దగినవిభూషణంబులు తొలంగం బెట్టి వార్ధకోచితంబు లగువల్కలంబు లెట్టులు ధరించితివి దేవలోకనివాసంబున కాసపడెదేని నది వ్యర్థశ్రమంబు! నీపుట్టినిల్లు దేవభూమియకదా? తగినవరునింగామించి సమాధికహించితి వేని నదియు నీకుం దగదు రత్నం బొరునిచే నన్వేషింపఁబడుఁ

గాని యొరు నన్వేషించునే. నిట్టూర్పుగాడ్పులచే దుర్లభజనానురాగంబు నీయందుఁ
దేటపడుచున్నది. అట్టి కఠినహృదయుం డెవ్వండొకో వాఁడెవ్వని నపేక్షించియేని
నీవు తపంబు సేయుచుఁ గలమాగ్రపింగళం బగుజటాభారంబు ధరియింపఁ దగ దని
యంతనిలువక యక్కపటవటుండు. 24

ఉ. ఏనును బ్రహ్మచారిఁ దరళేక్షణ! నీవును గన్య వింతకా
లానకు నీకుఁ బెండ్లియు ఫలం బగునేని విచార మేల స
న్మానముతోడ నచ్చునను మాన్య వివాహము గమ్ము లెమ్ము కా
దేనిఁ దపంబులోనిసగ మిచ్చెద మాను తపోభిమానమున్. 25

వ. అనినం బార్వతి యమ్మిథ్యావటునకుం దనమనోరథం బెఱిఁగింప నొల్లక వయస్యం
గనుసన్న చేసిన నచ్చెలికత్తెయు నత్తపోధనకుమారునితో ని ట్లనియె. నయ్యా! నీకుఁ
గుతూహలంబు గలదేని వినుము కాలకంఠకంఠకంఠరవహుంకారపరిప్లుతకం బగుపుష్పచా
పునిసమ్మోహనాస్త్రం బీకన్యహృదయంబున నాటిననాఁటంగోలె లలాటచందనధూసరా
లక యై తుహినసంఘాతితతశిలాతలం బగుజనకునింట ధృతిం జెందక మహేంద్రప్ర
భృతు లగుదిగీశుల నుజ్జగించి పినాకపాణిం బతిఁ గాఁ గోరి తపంబు సేయ సమ
కట్టె సబాష్పకంఠస్ఖలితంబు లగుసంగీతాక్షరంబుల విరూపాక్షుచరిత్రంబు పాడుచు
వనాంతసఖు లగుకిన్నరరాజకన్యకల వగపించుచుఁ ద్రిభాగశేషంబు లగునిశాసమయం
బుల నించుకించుక నిద్రించుచుఁ గలఁ గాంచి నీలకంఠ! యెక్కడికిం జనియెద వని య
సత్యకంఠార్పితబాహుబంధన యయ్యును విరహవ్యథాదుస్సహం బగుతపోభారంబున
భర్తను వశీకరింపం దలంచి యున్నయది యని పల్కిన. 26

చ. వికవిక నవ్వె యక్కపటవిప్రకుమారుఁడు మేలు లెస్స వా
నికి నయి రాగబంధమును నిల్పె మదిం దరళాయతాక్షి మీ
కకియ వివాహవేళఁ బురశాసనుపాణిఁబరిగ్రహింపదో
మొకమున బుస్సుమంచు నహి మ్రోఁగిన నిట్లు భయంబు చెందునో. 27

సీ. రాఁచుంచ యందుఁ జీరకు జోక యగుఁగాక, పచ్చియేనికతోలుఁబచ్చడంబు
హరిచందనాస్పదం బగుచనుఁగవమీఁదఁ, బట్టుఁ జేకొనుఁగాక భసితధూళి
కమనీయచరణలాక్షారాగరేఖచే, ముద్రితం బగుఁ గాక రుద్రభూమి
కలితముక్తాఫలగ్రైవేయకంబుతోఁ, దులదూఁగుఁ గాక పెంజిలువపేరు

గీ. మనువు లెస్సయి యుండెఁ బో మానవతికి
నివ్విధం బన్న లోకంబు లెల్ల నగరె
యహహ! ముదిగొడ్డు నెక్కి బిక్షాటనంబుఁ
జేయఁ బోవుట యదియు మేల్పాయు చువ్వె. 28

ఉ. పుట్టు వెఱుంగ నెవ్వరికిఁ బోలదు మూఁడవకన్నుఁ జూచి చే
పట్టఁడు వెట్టివాఁ డయినఁ బ్రాణహరుం డఁట జంతుకోటికిన్
గట్టినతోలు-చీర కలకల్మి ప్రకాశము సేయు చున్న ద
వ్వట్టునఁ జూచినన్ శివునిపై సిగొఱుంగఁగరాదు భామినీ. 29

గీ. మూట కేటికిఁ జాలింపుమా తపంబు, హరునిఁ గూర్చి సరోజపత్త్రాయతాక్షి !
వలదు తివియంగఁ బాఁతినవాఁడికొట్టు, యూపసత్క్రియ కర్హమై యున్నె చెపుమ

వ. అనిన నక్కపటవటునకు నవ్వధూటి యి ట్లనియె. 31

ఉ. చాలు వివాదము ల్పదిగ శంభునిగూఱిచి యిట్టిపల్కు లీ
వాలముచేసి పల్కితివి యైనను నా విను చంద్రమఃకళా
మౌళిపయి న్మదీయ మగుమానస మెంతయుఁ జిక్కె నింక నేఁ
జాలుదు నయ్య యేమ్మెయి భుజంగవిభూషణునిం దొరంగఁగన్. 32

వ. అని జయావిజయలం గనుంగొని యపాంగంబులఁ గెంపు గదుర నీబ్రహ్మచారి శంక
రుని గుఱించి యింకను వంకరకొంకరమాటలాడ నుంకించుచున్నవాఁ డితని మెడపట్టి
నూకుం డని పల్కి కోపావేశంబున. 33

చ జిలుఁ గగువల్కలాంచలము చె న్నయి చన్నులమీఁదఁ జాఱఁగా
నలుకఁ దుషారశైలసుత యవ్వలిమో మయి నాలుగేన్పదం
బులు సని భ్రూకుటీకుటిలముగ్ధలలాటముఖేందుబింబ యై
మలఁగి కనుంగొనెన్ భుజగమండను నక్కపటద్విజోత్తమున్. 34

శా. సాక్షాత్కారముఁ జెందె నవ్వుచు గిరీశానుండు ధాత్రీధరా
ధ్యక్షాపత్యముఁ బ్రేమ నిర్భరకటాక్షాలోకనప్రౌఢిమన్
వీక్షించెన్ దరశాక్షియు న్మనమున న్వ్రీడాప్రమోదక్షమా
దాక్షిణ్యాంబులు సందడింప నిలిచెం దత్సన్నిధానంబునన్. 35

చ. అరు దగునీతపమ్మునకు నమ్ముడువోయితి నేఁటికొమ్ము నీ
వరవుడ నంచు శూలి ప్రియవాక్యములం దగఁ గారవింపఁగా
ధరణిధరేంద్రనందన యుదగ్రతపోమహనీయవేదనా
భర మఖిలంబు వీడ్కొలిపి భావమునం బరితోష మందుచున్. 36

వ. జయవిజయ లనుప్రాణసఖులతోడం గూడ మాతండ్రి హిమవత్పర్వతేంద్రుండు దేవ
రకుఁ బ్రమాణీకరింపం బాత్రం బయ్యెను. కన్యకం బిత్రుపరాధీన నగుట దేవరచిత్తం
బున నవధరింపవలయు నని విన్నపంబు సేయించిన. 37

గీ. అమృతకరమౌళి యవుఁ గాక యనుచుఁ బలికి, వేడ్క గిరిరాజనందన వీడుకొలిపి
తారగిరికేళి దివ్యచిత్తమునఁ దలఁచె, సప్తమునుల నరుంధతీసంయుతముగ. 38

శా. ఆసప్తర్షు లరుంధతీసహితులై యాకాశమార్గంబునన్
భాసందోహము సూర్యచంద్రరుచులన్ భంజింపఁగా డిగ్గి కై
లాసస్థానముఁ జేరవచ్చి కని రుల్లాసంబునన్ హేమపీ
ఠాసీనుం డయి దేవత ల్గొలువ రాజై యున్న శ్రీకంఠునిన్. 39

మ. పదియార్వన్నెపసిండివల్కలమునన్ భాసిల్లు ముత్యాలజ
న్నిదముల్ రత్నమయాక్షతంబులును మాణిక్యంపుఁబాత్రంబునన్
జడు గొప్పున్ ధరియించి యల్పధరణీజాతంబులన్ బోలెఁ గ
ట్టెదురన్ నిల్చినదివ్యసంయములఁ సంవీక్షించి సంభావనన్. 40

సీ. ఆకాశగంగలో నఘమర్షణస్నాన, మహరహంబును జేయునట్టివారిఁ
బ్రస్థాపితాశ్వచే భానుమంతునిచేత, గురుభావమున మ్రొక్కుఁ గొనెడివారి
నంత్యకాలమ్మునయం దుర్విలోఁగూడ, నుదధిలోపల మున్గ కున్నవారి
సర్గశేషమునకై సాహాయ్య మొనరించి, పరమేష్ఠిచే మెచ్చుఁ బడయువారి

గీ. గగనమును లేడువురవారికట్టెదురన, పతిపదంబులపై దృష్టి భక్తినిడిన
దివ్యచరిత నరుంధతీదేవిఁ జూచి, సమ్మదము నొందె కందర్పశాసనుండు. 41

గీ. అంధకారి యరుంధతి నాదరించె, గౌరవంబున భేదంబు కలుగకుండఁ
బెద్దవారికి స్త్రీపుంవిభేద మేల, మాననీయంబు పుణ్యకర్మంబుగాక. 42

క. ఆఋషులఁ జూడ శివునకు, దారపరిగ్రహము వెంటఁ దద్దయుఁ దగిలెన్
దారపరిగ్రహమే కద, సారపుధర్మముల కెల్ల సాధన మరయన్. 43

ఉ. పర్వతసార్వభౌముసుతపై ననురాగము సంప్రరూఢమై
శర్వుని చిత్తవృత్తి కొనసాగుచు నుండుట కానవచ్చుటం
బూర్వపుఁదప్పుఁ జేసి వెఱఁ బొందుచు నన్నయునంగుఁ డెంతయున్
నిర్వృతిఁ జెందె నా తనదునీతి ఫలించి తపంబు పండినన్. 44

వ. అప్పుడు సప్తర్షులు హర్షవినయభక్తిశ్రద్ధావిశ్వాసతాత్పర్యంబులు మనంబునం బెనఁగొనంగఁ గేలుదోయి మొగిచి ఫాలభాగంబునం గీలించి కంటకితకపోలభాగులై దేవా! యింతకాలంబునకుం గదా మాతపోదానాధ్యయనయజ్ఞవ్రతాదిధర్మంబులు ఫలియించె భువనాధ్యక్షుండవైననీవు మనోరథాగోచరంబైనమన్ననం జేసి మనోవిషయంబున మన్నించితి వింతకంటెను భాగ్యంబు గలదే యెవ్వానిచిత్తంబున నీవు వర్తింతువు వాఁడు కృతార్థుండు గదా నీచిత్తంబున వర్తించుమాకృతార్థత్వంబు వేఱ వర్ణింపనేల? భవత్పుంభావనావిశేషంబునయందు మాకు బహుమానంబు ప్రత్యయంబు నయ్యె యుష్మదనుధ్యానసంభవం బగుప్రమోదభారంబు మాయంతరంగంబులయం

దంగీకరించుటకు సకలభూతాంతర్యామి వగునీవ ప్రమాణంబు మాటలు వేయు నేటికిఁ జింతితోపస్థితుల మైనమమ్ము నేపనిపంపునఁ దలంచితిరో యానతీం డనుటయు. 45

చ. లలితజటాకిరీటసదలంకృత మైనశశాంకరేఖతో
మలరుచి దంతదీధితిసమాజముతోఁ బొదలంగఁ జేయుచున్
బలికె లలాటలోచనుఁడు ప్రస్ఫుటభంగి మునివ్రజంబుతోఁ
దొలకరిమేఘఘోషములతోఁ బురణించు సమంచితధ్వనిన్. 46

గీ. ఎఱుఁగుదురు కాదె మీరు నాహృదయవృత్తి, నాకొఱకు నేన వర్తింతు నేకృతులను
మన్మహామూర్తు లెనిమిది మానులార, భువనరక్షాప్రయోజనంబునకు కాదె. 47

గీ. విప్రకృతు లైనయబ్బంది వేల్పు లెల్ల, మనఁగఁ గోరిరి సేనాని మత్ప్రసూతి
ననఘులార తృష్ణాతురు లైనవారు, వారివాహంబు ఘనవృష్టిఁ గోరినట్లు. 48

వ. ఏతదర్థంబ పార్వతిని ధర్మపత్నిఁగా నపేక్షించు చున్నవాఁడ మాకొఱకు మీరు హిమాచలంబునకుం బోయి యక్కార్యంబు సంఘటింపవలయు యుష్మత్సంఘటితంబు లైనసంబంధముల కెన్నండును వికారంబు పుట్టనేర దభ్యున్నతుండును స్థితిమంతుండును వసుంధరాభారధూర్వహుండును నగునద్ధరాధరసార్వభౌముండు సంబంధబాంధవార్థుండు కన్యార్థంబ యిట్లు ప్రవర్తింపుఁడు భవత్ప్రణీతంబు లైనపురాణాగమాదులు గదా లోకవ్యవహారంబులకు నిదర్శనంబు లై యుండు నీయరుంధతీదేవియు నీకార్యంబునకు సహాయ కాఁగలదు విశేషించి వివాహశోభనకార్యంబుల యందుఁ బురంధ్రీజనంబులకుఁ జనవు చెల్లు నిది శుభముహూర్తం బిప్పుడ కదలి యోషధిప్రస్థపురంబునకుం జనుండు కైలాససానుప్రదేశంబులఁ బునస్సమాగమం బగుం గాత మని శంభుండు విస్రంభగంభీరంబుగా నానతి యిచ్చిన. 49

చ. అతఁడు సమస్తసంయమిజనాద్యుఁడు శైలసుతాపరిగ్రహా
యత్తుఁ డయి యుండఁగా సురమహర్షివరేణ్యులు ప్రాక్తనప్రజా
పతులు తదాదిగా హృదయపంకరుహంబులతోఁ బరిగ్రహ
వ్యతికరసంభవం బయిన యచ్చపులజ్జ పరిత్యజించుచున్. 50

వ. మహాప్రసాదం బని యంబరమార్గంబున హిమవంతంబు డాయం జని. 51

గీ. గగనమునుండి డిగ్గి సత్కారయుక్తి, వెలఁగె హిమపర్వతాంతరస్థలమునందు
నిర్మలం బైననిధిలోని నీడఁదోఁచు, నిండుబింబంబులనుబోలి ఋషిగణంబు. 52

శా. పాదన్యాసములన్ ధరిత్రి పరికంపంబొంద నత్యంతసం
హ్లాదంబున్ భయభక్తులున్ మనమునన్ ముట్టంగ శైలేంద్రుఁ డం

భేదాకారముతోఁ జిగ్గినమహాపుణ్యాత్ములన్ సర్వలో
కాదిశ్రేష్ఠుల వే యెదుర్కొనియె నర్ఘ్యపూర్ణహస్తాబ్జుఁడై 53

గీ. ధాతుతామ్రాధరుఁడు దేవదారుభుజుఁడు, సానువక్షస్స్థలుఁడు వటస్కంధుఁడైన
మంచుగుబ్బలిరాజు సంభ్రమముతోడ, ఋషిసమూహంబు నతిభక్తి నెదురుకొనియె.

సీ. విధిమార్గ మెక్కింత వీసరవోకుండ, నర్ఘ్యపాద్యాదిక్రియాకలాప
మాచరించి వినిర్మలాచారసంపన్ను, లగునమ్మహర్షుల నాదరమున
నంతఃపురానకు నల్లఁ దోడ్కొని పోయి, క్రమముగా నుచితాసనముల నునిచి
స్వాగతకుశలవార్తానుపూర్వకముగ, నతిగభీరప్రస్ఫుటాక్షరముల

గీ. వారితో నిట్టులనియె నమ్మేరుసఖుఁడు, గాఢవినయావనతపూర్వకాయుఁ డగుచు
హస్తయుగళంబు మొగిచి సంప్రార్థనమున, యావదర్థపదం బగునట్లు గాఁగ. 55

గీ. అపయోదసముద్భవం బైనవాన, యనధిగతపుష్పజాలకం బైనఫలము
పుణ్యనిధులార! నాగృహంబునకు మీరు, తలఁపుగానితలంపుగాఁ దారసిలుట.

క. రెంటను నేఁ బావనుఁడను, వింటిరె మునులార! మీపవిత్రాంఘ్రులన
న్నంటుట మదీయమూర్ధము, వెంటం గానభ్రగంగ వెల్లివిరియుటన్. 57

సీ. స్థావరం బగుమేను పావనత్వముఁ జెందె, భవదీయపాదసంస్పర్శనమునఁ
గడగంటి నాజన్మ కలికృతార్థతఁ బొందఁ, గన్నులారఁగ మిమ్ముఁ గానఁబడసి
యుష్మత్కృపాసమభ్యుదితసంతోషంబు, నిండి దైవాఱె నా నెమ్మనమున
మీతేజమున నాదుమేనిలోఁ దహతహ, కలుషంబుపటలంబు గ్రాఁగి పోయె

గీ. ననుఁ గృతార్థుని జేయఁ బావనుని జేయఁ, బరమపుణ్యుని జేయ సంపన్నుఁ జేయఁ
దలఁచి యేతెంచితిరి గాని తక్కఁగలదె, కార్య మానతి యిం డార్యవర్యులార! 58

మ. అని పర్జన్యకఠోరగర్జ కెనగా నాడంబరాటోపముం
జెనయం బల్కఁగభీరనిస్వనమునన్ శీతాచలేంద్రుండు ప
ల్కిన నందందఁ బ్రతిధ్వను ల్మణిగుహాగేహంబులం దుండఁగా
నినుమార్పల్కినరీతిఁ దోఁచె నవు డూహింపన్ మునిశ్రేణికిన్. 59

వ. అప్పు డంగిరసుం డందఱిమునులయనుమతి నప్పర్వతేంద్రున కిట్లనియె 60

క. సర్వము సంపన్నంబగు, నుర్వీధరసార్వభౌమ యుల్లము నీకున్
సర్వోన్నతంబు గాదె య, ఖర్వము లగునీమహాశిఖరములభంగిన్. 61

వ. చరాచరభూతజాలంబులకు నాధారుండ వగునిన్నుం బురాణబ్రహ్మవాదులు విష్ణుం
డని స్తుతింతురు సప్తపాతాళభువనగోళమూలాధారంబ వగునీవు భూభువనంబు భరి
యింపనినాఁడు భుజంగమశేఖరుండు మృణాలపేశలం బగుఫణామండలంబున నిడి

భరింప సమర్థుం డగునే? సత్పావనంబులును నాసేతుసముద్రావనీచిహ్నంబులు నగు
నీసలిలప్రవాహంబులు భవత్కీర్తితీర్థంబులుంబోలి భువనపావనంబులు. తిర్యగూర్ధ్వా
ధరస్థానంబు లాక్రమించి త్రివిక్రమావతారంబున విరాడ్రూపంబు వహించినవిష్వ
క్సేను ననుకరించెదవు నీకు నితరపర్వతంబులకును సాటియే. ఇది యిట్లుండనిమ్ము మేము
వచ్చినకార్యంబు సావధానుండ వయి యాకర్ణింపుము. 62

సీ. ఏవేల్పులకు లేనియీశ్వరశబ్దంబుఁ, దాల్చు నెవ్వఁడు సుధాధాముతోడ
నవనిప్రధానంబు లైనయంగంబుల, సవరించు నెవ్వాఁడు సకలజగము
నేకతంబున వసియించి యెవ్వనిఁ గండ్రు, యోగీశ్వరేశ్వరుల్ యోగదృష్టి
నెవ్వనిపదము మూత్మేక్షుబుధులు పున, రావృత్తిశూన్యక మండ్రు తెలిసి
గీ. యతఁడు శంభుఁడు విశ్వలోకైకసాక్షి, యడుగఁబుత్తెంచినాఁడునీ యనుఁగుఁగూఁతు
నిమ్ము పెండిలిపెద్దల మేము మీకుఁ, దుహినగిరిరాజ! భాగ్యవంతుండ వైతి. 63

సీ. త్రైలోక్యమునకుఁ జంద్రకళాధరుఁడు తండ్రి, తల్లి యాఁ గాక యీతలిరుఁబోఁడి
హరునకు మ్రొక్కి యనంతరం బమరు లీ, కుటిలకుంతలకు మ్రొక్కుదురు గాక
యీతలోదరి నిచ్చి హితబాంధవంబున, నగుదుగాక గురుండ వఖిలపతికి
నీరాజబింబాస్య కారణంబుగ నద్రి, కులము దేవకులంబుఁ గలియుఁగాక
గీ. తగినవరునకుఁ గన్యకాదాన మిచ్చు, నంతకంటెను మఱి భాగ్య మన్య మేది
తల్లిదండ్రుల కఖిలభూధరవరేణ్య!, సకలయజ్ఞాంగసముదాయజన్మభవన! 64

గీ. దాతవఁట నీవు మేము సంధాతలమఁట, గారవపుఁ బెండ్లికూఁతురు గౌరియంట
శంభుడఁట పెండ్లికొడు కిది సంప్రదాయ, మభినుతింపఁగఁ దగుఁ బర్వతాగ్రగణ్య!

మ. అని దేవర్షి బహుప్రకారమధురవ్యాహారసందర్భముం
బనిగొం చుండఁగఁ దండ్రిపార్శ్వమున సద్భావంబు లజ్జాభరం
బును మాధ్వ్యంబును దోఁప నమ్రవదనాంభోజాత యై యల్లన
ల్లన లెక్కించుచు నుండెఁ బాణి నవలీలాపద్మపత్రంబులన్. 66

గీ. భూమిధరరాజు సంపూర్ణకాముఁ డయ్యె
ముదముతో మేనకాదేవి మొగము చూచి
కన్యకాదానవేళలఁ గలదు చనవు
క్షితిగృహస్థులకంటె సద్గేహినులకు. 67

వ. అనంతరంబ తనకూర్మికన్యం జూచి హిమవంతుండు. 68

సీ. రావమ్మ తల్లి! సర్వజగచ్ఛరణ్యున, కమృతాంశుమాళికి నైతి భిక్షు
యర్థులై వచ్చినా రాదిమబ్రహ్మలు, ఘనపుణ్యరాసులు గగనమునులు

పరమపతివ్రతాపరిషచ్ఛిరోమణి, యదె యరుంధతి త్రిలోకైకవినుత
నీవు కారణముగ నెఱయంగ సిద్ధించె, భాగ్యంబు గృహమేధిఫలము నాకు
గీ. ననుచు మ్రొక్కించె ఋషులకు వందఱకును, నబ్జభవుకోడలికిఁ దుషారాద్రినాథుఁ
డవధరింపుఁడు శివునియర్ధాంగలక్ష్మి, ప్రణుతి యొనరించె మీ కని పల్కి నగుచు.
గీ. ఈప్సితార్థక్రియాసముపేతుఁ డైన, శైలపతిమాట కందఱు సంతసిల్లి
ప్రణుతి యొనరించి యంజలిపాణి యైన, గౌరి నాశీర్వదించిరి గగనమునులు. 70

వ. తదనంతరంబ యభిలషితవరసంప్రాప్తిసముపజాతకుతూహల యగు నా హంసగమన నరుం
ధతి తనతొడలమీఁదఁ గూర్చుండఁబెట్టుకొనియె మునులును వినిశ్చితకార్యులై వివాహ
తిథి నేఁటికి నాలవనాఁ డని ముహూర్తనిశ్చయంబు సేసి సారుంధతీకులై హిమా
చలంబు నామంత్రించి చని విశుద్ధం బైనకార్యార్థంబు విన్నవించి యమ్మహాదేవుం
డనుప నిజస్థానంబుల కరిగిరి పశుపతియు నెట్టకేలకు దివసత్రయంబు గడపు చుండె
నట యోషధిప్రస్థపురంబునందు. 71

గీ. ఓషధీనాథుఁ డభివృద్ధి నొందు చుండఁ, దిథికి జామిత్రగుణము సంధిల్లు చుండఁ
బర్వతేంద్రుండు సముపేతబాంధవుండు, పుత్రికోద్వాహకళ్యాణమునకుఁ దొడఁగె.
గీ. నవశుభారంభసంవిధానముల నపుడు, కౌతుకవ్యగ్రకాంతానికాయ మగుచు
ననుపమస్ఫూర్తి సానుమంతునిపురంబు, సకలమును నొక్కయిలువోలె సంభ్రమించె.

సీ. సంతానకద్రుమచ్ఛాయాసమాకీర్ణ, రాజవీథీపరివ్రాజితంబు
ధవళచీనాంశుకోత్తమసమాకల్పిత, మహనీయతరకేతుమండనంబు
సమధికస్తంభకాంచనతోరణావళీ, మేళనోత్తేజితమిహిరదీప్తి
ప్రతిగృహద్వారపర్యంతసంధానిత, సుమగుచ్ఛమాలికాసుందరంబు
గీ. గరుడగంధర్వకిన్నరఖచరయక్ష, సిద్ధవిద్యాధరాంగనాశ్రేణిభరిత
మఖిలలోకవిలోచనహర్షకరము, రాజితం బయ్యె నోషధిప్రస్థపురము. 74

వ. మైత్రీముహూర్తంబున నుత్తరఫల్గునీనక్షత్రంబునకుం జంద్రయోగంబు గలుగుచుం
డఁ బతిపుత్రవంతు లగునమ్ముత్తైదువ లమ్మత్తకాశినికి శృంగారంబు సేసి రపుడు. 75

గీ. గౌరసిద్ధార్థవినివేశకలిత మగుచుఁ, దరుణదూర్వాప్రవాళసంభరిత మగుచు
నాత్మరక్షాశిలీముఖం బగుచు నపుడు, బాల కభ్యంగనైపథ్యలీల యమరె. 76

క. బంగారుకంకపత్రముఁ, గెంగేల ధరించి యొప్పె గిరినందన య
భ్యంగముతఱి భాస్కరకర, సంగత యగువిదియనాఁటిశశికళవోలెన్. 77

సీ. కమనీయలోధ్రకల్కంబునలుంగున, నభ్యంగతైలంబు నపనయించి
యాశ్యామ మైనకాలాగరుద్రవమున, నంగరాగాలేప మాచరించి

కస్తూరి పునుఁగును గంధసారంబును, సంపంగినూనెయు సంతరించి
యభిషేకవిధియోగ్య మగుమడుఁగొల్లియ, నిర్ణాభిబిలముగా నెఱిక గట్టి

గీ. చలువనెల లైన ముత్యాలచవికలోనఁ, బృథులమాణిక్యశశికాంతపీఠియందుఁ
బదియునార్వన్నెపసిఁడికుంభములనీట, జలక మార్చిరి గౌరికిఁ జంద్రముఖులు. 78

వ. మంగళస్నానవిశుద్ధగాత్రియు గృహీతప్రత్యుద్గమనీయయు నై ప్రఫుల్లకాళ యగుశర త్కాలవసుంధరయుం బోనిపార్వతిం దత్ప్రదేశంబులనుండి మణిస్తంభచతుష్టయాభిరామంబును వితానవంతంబును నగుకౌతుకవేదిమధ్యంబునకుం దెచ్చి నెచ్చెలు లలంకరింపం దొడంగి రప్పుడు. 79

గీ. అగరుధూపంబు సంభూజితార్ద్రభావ, మంతరన్యస్తకుసుమమాల్యము తదీయ
మలిమనోజ్ఞంబు ధమ్మిల్ల మలరుఁబోణి, యుప్పపూదండఁ గైసేసె నెలమి నొర్తు 80

గీ. కలితగోరోచనాపత్త్రకములతోడఁ, గరము విలసిల్లె నీహారగిరితనూజ
చక్రవాకపదాంకితసైకతములఁ, గరము విలసిల్లునాకాశగంగ వోలె. 81

గీ. తుమ్మెదలతోడఁ గూడిన తమ్మివోలె, జలజరేఖాయుతం బైనచంద్రుపగిది
ఫాలమునఁ గుంతలంబు నేర్పఱిచినపుడు, నెలవుగాఁ దోఁచె గిరికన్య నెమ్మొగంబు 82

వ. మఱియు నొక్కసైరంధ్రి లోధ్రకషాయరూక్షంబును గోరోచనాక్షేపనితాంతగౌరంబు నగునీహారగిరికన్యకాలలామంబు కపోలభాగంబునకుం బరాగలాభంబు సంధిల్లఁ గర్ణావతంసంబుగాఁ గాయజప్రరోహణంబుఁ గీలించె,నొక్కచంచలాపాంగి మంచుం గొండరాచూలియధరప్రవాళంబు కించిన్మధూకచ్ఛవిస్పష్టరాగంబుఁ గావించె,నొక్కయిందుబింబానన యంబికచరణాంబుజంబులఁ గ్రొత్తలత్తుక హత్తించె, నొకకిసలయపాణి చరణపల్లవంబుల ఫాలలోచను కిరీటబాలేందుని ముట్టుమని నెట్టుకొనిదీవించె, నొక్కశాతోదరి కళిందసుతాజాతనీలోత్పలపలాశకాంతిమంతంబు లైనహిమవంతు ముద్దుంగూఁతునిద్దంపువెడందసోఁగకన్నులం గాలాంజనంబు మంగళార్థంబుగా రచియించె,నప్పుడు కుసుమంబులతోడ లతయును నక్షత్రగ్రహతారకంబులతోడ రాత్రియును గలహంససందోహంబుతోడ మందాకినియుం బోలె దివ్యాభరణంబులతోడం గూడి పార్వతి సర్వలోకనయనోత్సవకర యయ్యె నయ్యవసరంబున. 83

చ. ద్రవమయి యున్న క్రొత్తహరితాళమనశ్శిలలం గరంగి ప
ల్లవమునఁ దోఁచి మేనక యలంకరణం బొనరించె గౌరికిన్
నవనవపత్త్రభంగరచనాకలనంబున మంగళార్థ మ
త్యవిహతలీల రత్నముకురామలకోమలగండమండలిన్. 84

గీ. దంతతాటంకమండనోద్భాసి యైన, ముద్దుఁగన్నియ యాననాంభోజ మెత్తి
తీర్చి రచియించె మేనకాదేవి రక్తి, మలయజంబునఁ గళ్యాణతిలకరేఖ. 85

ఎ ప్రమద స్తనోద్భేదనం బాదిగా నెయ్యది ప్రతిదినప్రవర్ధితం బయ్యె నది మనోరథంబు
ఫలియింప వివాహదీక్షాతిలకంబు లలాటంబునం దీర్చి యధిష్ఠానాంతరసన్నివేశం బై
ధాత్రీ ప్రతిసార్యమాణం బైనపూర్ణకౌతుకహస్తసూత్రంబు బంధించి మేనకాదేవి
బాష్పాకులలోచన యయ్యె నప్పుడు నవఫేనపుంజ యగుదుగ్ధాబ్ధివీచిపోల్కిఁ బట్టు
పుట్టంబు గట్టి చెలువారునాసరోరుహాక్షి కులదేవతలకు మ్రొక్కి ముత్తైదువల కభివాద
నంబుసేసి కళ్యాణమండపమ్మునం దఖిలపరివారపరివృత యై సింహాసనంబుమీఁదం గూ
ర్చుండి మహోక్షలాంఛనునాగమనంబుఁ బ్రతీక్షించుచు నుండె నంత. 86

సీ. బ్రాహ్మి సంపాదించె భసితాంగరాగంబు, మాహేశి రుద్రాక్షమాలఁ గూర్చెఁ
గౌమారి వెలయించె గజచర్మచేలంబు, వైష్ణవి తోలుదువ్వలువ మడిఁచెఁ
వారాహి కెంగేలి గారాపుత్రేలికిఁ, గై సేసె మణిమయాకల్పపఙ్క్తి
నింద్రాణితోఁ గూడి హేరాళముగ గ్రుచ్చెఁ, జాముండ హస్తభూషావ్రజంబు

గీ. నాదికాలంబు సతిఁ బెండ్లియాడఁ బోవు, నవసరంబున నిబ్భంగి సవదరించె
దివ్యశృంగార మబ్భంగి దేవదేవుఁ, డాదరించెను సమ్మోద మావహిల్ల. 87

సీ. భసితంబు కర్పూరపాళి కస్తూరికా, భరితాంగరాగసంపద వహించె
పచ్చిరేనుఁగుతోలు పసిఁడికమ్ములపట్టు, పచ్చడం బనెడివిభ్రమముఁ దాల్చె
భుజమధ్యమునఁ గ్రాలు భోగిభోగంబులు, తారహారములచందంబు నొందె
జేగురించినకంటి చిగురుచాయలతీఱు, సింధూరతిలకంబు చెవులు నించె

గీ దివమునందును వెన్నెల దీటుకొనఁగ, శైశవంబున విగతలాంఛనతఁ జెంది
చాల నొప్పారుసుకుమారచంద్రరేఖ, తనకుఁ దాన చూడామణిత్వము వహించె. 88

వ. ఇవ్విధంబున గంగాధరుండు సమాసన్నగణోపనీతం బైనఖడ్గంబున నీడఁజూచి వందిభు
జావలంబియై శార్దూలచర్మవిహితపల్యాణబంధం బగువృషభంబును గైలాసశిఖరంబుం
బోలె నారోహణంబు సేసి బ్రాహ్మి మొదలయినమాతృకలును గపాలాభరణ యైనభద్ర
కాళియు భృంగిరిటనికుంభధరభద్రకాళప్రముఖప్రమథపరివారంబునుం బరివేష్టింప
భూతబేతాళశాకినీడాకినీగణంబులు మంగళతూర్యనాదంబులు మురాయింపం ద్వా
త్రింశత్కోటిదేవతాసమూహంబులుఁ గొలువ సహస్రరశ్మిధవళాతపత్రంబు ధరి
యింప గంగాయమునలు వింజామర లిడ నుభయపార్శ్వంబుల నిజవాహనారూఢులై
హరివిధాతలు వేత్రహస్తులై తలంగుండు పాయుం డొలంగుం డనుచు సందడి నెడఁ
గలుగఁజేయఁ గలహాశనతుంబురులును విశ్వావసువులును హాహాహూహూవులును త్రిపు
రవిజయాదివిద్యాధరులును త్రిపురవిజయాదికంబు లుగ్గడించుచుండ సప్తర్షు లరుంధతీ
సహితంబుగా మంగళద్రవ్యంబులు సంతరించుకొని వడువ నాకాశమార్గంబునం జామీ

కరకింకిణీక్వాణంబులు సెలంగ ముహూర్తకాలంబునకు నగేంద్రగుప్తం బగు నోషధి
ప్రస్థపురంబునకుం జని తదీయోపకంఠంబున డిగ్గిన. ౮9

మ. వనగంధద్విపరాజి నెక్కి యధికవ్యాయామవిస్ఫారసం
హననుల్ బంధులు మేదినీధరము లుద్యత్కీర్తితోఁ దోడు రా
మనమందుం బ్రమదంబు పొంగ దివిషన్మాన్యుండు ధీయుం డెదు
ర్కొని నీహారగిరీశ్వరుండు సుమనఃకోదండసంహారునిన్. 90

వ. ఇట్లెదుర్కొని తుషారగిరీశ్వరుండు మేనకాదేవి పసిఁడిపాత్రంబుల జలంబు వోయ
సురాసురకిరీటమణిశాణోత్తేజితంబు లగుపురాసురాంతకునిపదంబులు గడిగి కన్యాదా
నం బొనరించె నంతం దుషారగిరికన్యకాశంకరులు సంకల్పసిద్ధి వడసిరి నిర్వృత్తపాణిగ్ర
హణమహోత్సవు లై భవానీభర్గులు భక్తిభావనావశంవదు లై బ్రహ్మాసనాసీనుం డగు
పితామహునకుం బ్రణమిల్లిరి చతురంతవేదికామధ్యాధ్యాసీనులై పార్వతీసర్వజ్ఞులు
లౌకికం బైనయార్ద్రాక్షతారోపణం బనుభవించి రంత. 91

సీ. అమృతబిందువులు పై నందందఁ జిలుకంగఁ, బద్మాతపత్రంబుఁ బట్టెఁ గమల
కళ్యాణసమయార్హగద్యపద్యంబులఁ, గైవార మొనరింపఁ గడఁగె వాణి
రంభోర్వశీముఖ్యజంభారివనితాళి, తూర్యత్రయంబునఁ దోడు సూపె
మందాకినియును గాళిందియు నిలుచక్క, రమణఁ బై వింజామరంబు లిడిరి
గీ. వేళ యెఱిఁగి మహేంద్రాదివిబుధగణము, ముకుటముల హస్తపల్లవములు ఘటించి
వేఁడుకొనిరి మహాదేవు వినతు లగుచుఁ, జిత్తసంభవునకుఁ బునర్జీవనంబు. 92

సీ. సంబంధబాంధవసరదనుగ్రహముచే, నచలాధిపతిఁ జరితార్థుఁ జేసి
కందర్పుఁ దొల్లింటికంటె నున్నతుఁ జేసి, రతిదేవిహృదయవైరాగ్య ముడిపి
పెండ్లికి వచ్చినబృందారకుల నెల్ల, వివిధసంభావన వీడుకొలిపి
ప్రమథవర్గము నికుంభప్రధానమ్మును, బేతాళడాకినీవితతి ననిచి
గీ. కనకకలశాది భక్త్యలంకారయుతము, నైనకౌతుకరత్నగేహంబు సొచ్చి
పార్వతియు దాను నీహారభానుమౌళి, పవ్వళించెను ముదమునఁ బాన్పుమీఁద. 93

వ. అనంతరంబ గంగాధరుండు భృంగిరిటవికారంబుల నిగూఢంబుగా నవ్వించియు, బాద
సాంత్వనపరిగ్రహంబున మందమందాక్షసారంబు గారచించియు గాఢాలింగనంబులును
నీవీబంధస్పర్శనంబులును బింబాధరచుంబనంబులును నఖాంకురవ్యాపారంబులును దంత
క్షతవేదనాప్రపంచితకిలకించితంబులును వెలయ బాహ్యాంతరోత్సవప్రదేశంబులు సం
ధించి మన్మథుం గృతార్థుం జేసి యనేకకాలంబు పరమానందంబుఁ జెంది శతానంద
ముకుంద పురందరాదులకు హితంబుగ సుతుం గాంచి యాంబికేయుండును గాంగేయుం

డును గార్త్తికేయుండును షాణ్మాతురుండును నగునక్కుమారునివలనఁ దారకాసుర
వధియింపించి మహాదేవుండు లోకంబు లన్నియు రక్షించె నిది గౌరీకళ్యాణము 94

క. ఈగౌరీకళ్యాణము, భోగీంద్రధరాపదానపుణ్యకృతిధీ
ర్యాగము దీనిం జదివిన, భోగము మోక్షమును గలుఁగు భూజనములకున్. 95

ఆశ్వాసాంతము.

చ. కోమరగిరిక్ష్మారమణకుంజరచారువసంతవైభవ
క్రమసముపార్జితాభినవగంధహిమాంబుకురంగనాభికుం
కుమఘనసారసంకుమదకుంభమనోహరగంధపాళికా
సముదయసార్వభౌమ! కవిసంఘమనోభవకల్పకద్రుమా! 96

క. కరదీపదానబిరుదా, భరణా! కావేరివల్లభా! సుగుణనిధీ!
శిరియాళవంశశేఖర!, హరచరణస్మరణపరిణతాంతఃకరణా!. 97

పంచచామరము. హరాట్టహాసమల్లికాశశాంకశంకరాచలా
మరాపగాసరస్వతీసమానకీర్తిమండలా!
కురంగనాభిగంధసారకుంకుమాదివాసనా
పరంపరావితీర్ణశస్తభవ్యహస్తపల్లవా!. 98

గద్య. ఇది శ్రీకమలనాభపౌత్ర మారయామాత్యపుత్త్ర వినయవిధేయ
శ్రీనాథనామధేయప్రణీతం బయినహరవిలాసం
బనుమహాప్రబంధంబునందుఁ
జతుర్థాశ్వాసము.

శ్రీరస్తు.

హరవిలాసము

పంచమాశ్వాసము.

శ్రీమత్కుమారశైల
స్వామికృపాలబ్ధనిత్యశాశ్వతవిభవా!
హేమాచలధీర! ధరి
త్రీమండనచరిత! యవచిదేవయతిప్పా! 1

వ. ఆకర్ణింపుము, 2

ఉ. గౌరి వివాహమై కుసుమకార్ముకుఁ గ్రమ్మఱిలంగఁజేసి బృం
దారకవర్గము న్నిజపదంబున కన్పి హిమాచలంబుపైఁ
బారిషదవ్రజంబు దను భక్తి భజింపఁగ నాదరించె సం
సారసుఖంబు శంకరుఁడు సంభృతసన్యకుటుంబభారుఁడై. 3

గీ. ప్రమథగణములతో మాతృసమితితోడ, నందికేశ్వరుతోడ నానందలీల
నార్యపైఁ జేర్మి యెట్టిదో యద్రియింట, నిల్లటం బుండెఁ ద్రిభువనాధీశ్వరుండు

సీ. జమిలిపాములతోడిసాగతం బొల్లక, సవరించు బంగారుజన్నిదములు
పచ్చయేనికతోలుపచ్చడంబుఁ ద్యజించి, గడితంపుఁ బట్టుఁబచ్చడముఁ గట్టు
భస్మాంగరాగంబు పనికట్టువడఁ జేసి, కస్తూరితోడ శ్రీగంధ మలఁదు
నస్థిమాల్యములపై నసురక్తి వర్జించి, రమణీయతారహారములు దాల్చు

గీ. జడలు బాగడఁ జొల్లెంబు సంతరించి, తేఁతరికౌలరాయుఁ గీలించు నందు
మంచుగుబ్బలియింట సమ్మనము మీఱ, మనువుఁగడువంగ నున్నప్డు మదనవైరి 5

గీ. ఓషధిప్రస్థపురమున నుబ్బియుబ్బి, హేమపుంజస్వరంబుల నెక్కియాడు
గణము లిరువంకఁగొలిచిరాఁ గాళగళుఁడు, వృషభపుంగవువాహ్యాళి వెడలునపుడు 6

ఉ. ఆరభటీకఠోరతరహాసు లుపంచితచంద్రహాసు లం
గారనిభారుణాక్షులు ప్రకామవిశాలమనోజ్ఞపక్షు లా
కారధురంధరుల్ ప్రకటఁంబుమనోహరకంధరుల్ జటా
ధారులు మేరుధీరులు సదాశివుసన్నిధిపారిపార్శ్వకుల్. 7

గీ. వీటఁ దమకెవ్వ రెదు రని వెఱపు లేక, చెల్లుబడిఁ బ్రల్లదంబులుసేయుఁ దొడఁగి
రభవులెంకలు జమునిమాంకకార్లు, వేళవాటికుట్టీమధ్యవీధులందు. 8

క. కుంభోద్భవుపాళెమున ని, కుంభుదివాణమున భృంగి కులపతిగాఁ గాఁ
గుంభోద్భవువగఁ దిరిగిరి, శంభునికింకరులు గర్వసంరంభమునన్. 9

సీ. పులికళాసంబు గప్పుదురు పాఱఁగ మీఁద, విద్యాధరాంగనావిటగణంబు
గంధర్వకామినీకాముకవ్రాతంబు, లాత్తాల్గఁ గొని మోఁది లజ్జ గొంద్రు
కకపాలవెలిబూదిఁ గన్నులలోఁ బ్రామి, బాధింతు రప్సరగపల్లవుల
గరుడభామాభుజంగప్రతానముఁ బట్టి, బాధింతు రురుయోగపట్టకముల

గీ. నాగడీలు మహాధూర్తు లగడుఁగాకు, లుద్ధతులు గొంట్లు పలుగాకు లుదురుమిడుకు
లాకతాయులు శరులు గయ్యాళు లగుచు, నోషధిప్రస్థ మిల్లిల్లు నుడుకుచుండ. 10

వ. మఱియు నానాప్రకారంబులం బ్రమథజటాధారులు యథేచ్ఛాచారులై యోషధి
ప్రస్థపురంబునందు క్షుద్రోపద్రవంబులు సేయుచుండ హిమవంతుం డంతయు నెఱింగి
మేనకాదేవియుం దాను మంతనం బుండి యీశ్వరునితోడిపొత్తింతియ చాలునని
యాప్రొద్దు కూఁతు రావించి యి ట్లనియె 11

క. కమలాక్షి యసంఖ్యాత, ప్రమథగణంబులును భూతపరిషత్తుఁ బిశా
చములున్ మొదలగు ధూర్తుల, సమూహమున నీమగండు సంభావించున్. 12

క. భూతప్రేతపిశాచ, వ్రాతంబులు తోడు గాఁగఁ బ్రమథులు పగలున్
రాతిరియును నష్టాదశ, జాతిప్రజలకును దుర్దశలు సంధింతుర్. 13

ఉ. వేమఱు రాత్రియుం బగలు వీథులఁ గల్పలతాప్రసూనమా
ధ్వీమదమత్తచిత్తు లయి వేలుపుతేమలఁ బట్టుకొంద్రు నీ
స్వామికి నిష్టభృత్యు లగుజంగమముండకపాలపాణికా
శాముఖవీరపాశుపతలాంఛనధారులు ధూర్తవర్తనుల్. 14

క. ఈవీట నసంఖ్యావలి, ద్యావాపృథివీమహామహత్తులకుం ద
ర్పావేశంబున ధార్ష్ట్యము, గావింపఁగ మాన్పఁ దగదె కఱకంఠునకున్. 15

సీ. తలమీఁదిచదలేటిదరి మీలఁ దినఁ జేరు, కొంగలు చెలఁగి కొంగొంగు రనఁగ
మెడదన్నుపునుకలనిడుపేరు లొండొంటిఁ, బోరిఁబోరిఁ దాఁకి బొణ్బొణుగు రనఁగఁ
గట్టినపులితోలుకడకొంగు సోఁకి యాఁ, బోతుతత్తడి చిట్టుబుట్టు మనఁగఁ
గడియంపుఁబాములు కకపాలలో నున్న, భూతి మైఁజిలికిన బుస్సు రనఁగ

గీ. దమ్మిపూఁజాలిపునుకకంచమ్ము సాఁచి, దిట్టతనమున బిచ్చము దేహి యనుచు
వాడవాడల భిక్షించుకూడుగాని. యిట్టిదివ్యాన్నములు మెచ్చునే శివుండు. 16

గీ. అఖిలలోకేశ్వరుఁడు మామ యాత్మలోని, విసువుఁ జారజనంబుల వేసటయును
ప్రమథగణములు సేయుధార్ష్ట్యంబు నెఱిఁగి, దారుకావని కరుగంగఁ దలఁచె నభుడు.

వ. ఇట్లు దలంచి నందివాహనారూఢుండును గతిపయప్రమథపరివారపరివృతుండును నై
మామ వీడుకొనక గౌరికిం జెప్పక నభోమార్గంబునం దత్పర్వతైకదేశస్థితం బగుదేవ
దారువనంబుం బ్రవేశించె నప్పర్వతం బెట్టి దనిన. 18

సీ. వృద్ధకచ్ఛపరాజువీఁ పంఘ్రిపీఠంబు, సురతరంగిణివెల్లి శిరసుపాగ
మహీమండలమునకు మానదండము మేను, పూర్వాపరంబులుపొరుగుటిండ్లు
కాత్యాయనీదేవి కన్యకారత్నంబు, చేసికన్నులవేల్పు పెండ్లికొడుకు
పాలనీయము శ్రీశైలసామ్రాజ్యంబు, యాగహవిర్భాగ మోగిరంబు

గీ. మాల్యవన్మేరుకైలాసమలయసహ్య, గంధమాదనమందరక్రౌంచవింధ్య
భూధరంబులు చుట్టాలు పొగడఁ దరమె, సకలగుణధాముఁ బర్వతసార్వభౌము 19

క. అందు విహరించుఁ గాంచన, కందరమందిరములందుఁ గౌతుక మొప్పన్
బృందారకమిథునంబులు, కందర్పవిహారములఁ బగళ్లును రేలున్. 20

ఉ. ఎంచి నుతింప శక్యమె యహీశ్వరునంతటివాని కైన ర
త్నాంచితరోచిరుద్గమనిరస్తరవీందుమరీచిజాలమున్
గాంచనకందరాయతనికాయితవారిధరాంతరాళని
ర్వంచితదేవతామిథునవాంఛితమూలము శీతశైలమున్. 21

గీ. హేమశైలంబు దోగ్ధ గా భూమి సురభి, నఖిలరత్నౌషధులును గల్పాదియందుఁ
బృథుమహారాజుపంపునఁ బితికె నెలమి, మంచుగొండను బెయ్యఁ గావించి గిరులు 22

శా. ఆమోదంబున వేఁటలాడుదురు నీహారాద్రికాంతారరే
ఖామధ్యంబునఁ జాపటంకృతులతో గంధద్విపశ్రేణులన్
క్షామక్షామమనోజ్ఞమధ్యములు గుంజాభూషణాలంకృతల్
వ్యామగ్రాహ్యపయోధరల్ శబరసేనాధీశసీమంతినుల్. 23

క మృదుమేనిసామకూఁతురు, జడనిధిచెలికాఁడు కొడుకు సర్వంసహకున్
గొలకోల కడలికడలకు, వడపులగుబ్బలికి సరియె వసుధాధరముల్. 24

క. ఆటవికభామినీభుజ, తాటంకితదీర్ఘదీర్ఘతరవేణుధను
ర్జ్యాటంకారధ్వనిపరి, పాటీముఖరములు తుహినపర్వతతటముల్. 25

వ. మఱియును జాహ్నవీనిర్ఝరధారార్ఘూత్కారఘుమఘుమాయితమణిగుహాకుహరంబును
వనమహిషకోణాభిఘాతప్రస్నిగ్ధపాషాణస్థలనరోహద్గర్భిణీగర్భపాతంబును శబరపురం
ధ్రీనీరంధ్రకుచకలశలేపనముద్రాయోగ్యవర్ణవర్ణనీయగైరికశిలాచూర్ణంబును గిన్నర మి
థునక్రీడాసంకేతనికేతనాయమానకనకకేతకీకుంజక్రోడంబును గంధర్వకన్యకానఖముఖ
స్ఫాల్యమానవీణాగుణక్వాణసంగీతభంగీతరంగితాంతరంగవనకురంగంబును విద్యాధరాభి

సారికామనోరథపదానురోధనిర్ఝరోధనిరవగాధసంబాధపృథులతమతమాలవీథీతిలకంబును
నైనయక్కొండదక్షిణభాగంబున నుండుదాక్షాయణీవనంబున కనతిదూరంబున. 26

సీ. కర్ణికామాణిక్యకనకపద్మినులతోc, గల్పవల్లీకుడుంగములతోడ
విమలచింతారత్నవేదికాస్థలులతో, సిద్ధరసాపగాశ్రేణితోడ
దివ్యలోకాప్సరస్త్రీనికదంబముతోడc, గామధుగ్ధేనుసంఘములతోడ
దివ్యౌషధీలతాదీపమాలికలతో, సకలర్తుసన్నివేశంబుతోడ
గీ. మదనవైరికి గారాపుమామ యైన, మంచుగుబ్బలికొనిసీమాంచలమున
దేవతామునిసేవ్య మై తేజరిల్లు, ధర్మసంజీవనము దేవదారువనము. 27

క. అందువసియించుసంయమి, సందోహము పంచబాణసదృశము లీలా
సౌందర్యకళానిర్జిత, బృందారకసతులు వారిబింబాధరలున్ 28

సీ. జిలుcగైనకనకంపుcజీనాంబరముకొంగు, పాలిండ్లబింకంబు బయలుపఱుప
భ్రమరకంబులc జుట్టుప్రస్వేదకణములు, నొసలికస్తురిబొట్టు నూలుకొలుప
దరవిశ్లథం బైనధమ్మిల్లభారంబు, చిమ్మచీcకటులకుc జిట్టమిడువc
దరళహాటకరత్నతాటంకదీప్తులు చెక్కుటద్దములపై జీరువాఱc
గీ. బసిcడికుండల నిర్ఝరాంభస్సుc దెచ్చి, పాయc గంకణనిక్వాణములు సెలంగc
గన్యలతలకు మునికన్యకాకదంబ, మభిమతం బైనయప్పావనాశ్రమమున. 29

క. జ్యోతిష్టోమాదిముఖ, త్రేతానలపుణ్యధూమరేఖావృతగం
ధాతిరయం బడcగించుం, జాతకసంఘము తదీయపర్యంతమునన్ 30

ఉ. సమ్మదలీలతోc జదువు సామము లేదును గండుcగోయిలల్
తుమ్మెద లాలపించుc బరితోషమునం బ్రణవాక్షరంబులన్
సమ్మతిc బ్రస్తవించు శుకశారిక లాగమభాషితంబులన్
నెమ్మదిc జెప్పు శాస్త్రిముల నీలగళంబులు తద్వనంబునన్. 31

శా. కాముం జీరికిc గొక క్రోధము నహంకారంబు లోభంబు నీ
ర్ష్యామాత్సర్యమదావలేపకుహనారాగంబులం జేరనీ
కాముష్యాయణు లై ప్రశాంతమతు లై యయ్యాశ్రమాంతంబులన్
సేమం బొప్పcగ సంచరింతురు మునుల్ నీవారముష్టింపచుల్. 32

శా. ఆనందంబునc ద్రుళ్లి పుచ్ఛములు పెల్లల్లార్చుచున్ లేcగ ల
క్కానన్ గోకులగోష్ఠదేశముల జంఘాలాఘువం బొప్ప హా

మానుష్ఠానవిధిప్రకారపరతంత్రాత్మప్రసూనామధు
ర్ధనోదన్యసుధాప్రవాహలహరీతృప్తాంతరంగంబులై. 33

శా. ఆయావేళల మౌనిభార్యలు గృహవ్యాపారలీలాభవ
త్కాయక్లేశము లుజ్జగింత్రు విలసత్కర్పూరరంభాతరు
చ్ఛాయన్ శీతలచంద్రకాంతమణిపాషాణప్రదేశంబులన్
వాయుప్రేరణఁ బచ్చకప్పురము పైవర్షింప నక్కానలోన్ 34

వ. మఱియు నత్తపోవనంబునందు. 35

క. నిలయవ్యాపారంబుల, నలపుల మేనులు చెమర్చి యుపరాహ్ణమునన్
సెలయేఱులలోఁ జిల్లులు, చిలుకలు నాడుదురు మునులచివురుంబోణుల్ 36

సీ. సెలయేటి తెలినీటఁ జిఱుబంతిపస పాడి, సేసక్రొమ్ముళ్లఁ బచ్చియలు తుఱిమి
గురువిందపేరులు గుబ్బచన్నులఁ దాల్చి, నెమిలిపించంపుఁబుట్టములు గట్టి
పయ్యెదమాఱుగాఁ బాఱుటాకు లమర్చి, చాఁదునఁ దిలకంబు సంతరించి
కంకేళిచిగురాకుఁ గర్ణపూరముఁ జేసి, కుసుమపూవులధూళిఁ గురులఁ దాల్చి

గీ. చెంచుఁజిగురాకుఁబోణులచేఁతలెల్ల, నభినయింతురు పర్ణశాలాంతరములఁ
దండ్రు లెందేనిఁ జనునప్డు తల్లులెదుర, గారవము సేయ మునికన్యకాజనంబు. 37

సీ. నిర్ఝరాంభఃకేళి నీలకంఠాంగనా, తాండవాడంబరదర్శనంబు
పుష్పాపచాయంబు పూర్ణిమాతిథినిశా, చంద్రోదయారంభసంభ్రమంబు
ప్రసవకందుకలీల బాలప్రవాళాచ్ఛ, గిరినదీసైకతక్రీడనంబు
పాంచాలికారక్తి కాంచనకుంభాంబు, పూరకల్పితలతాపోషణంబు

గీ. లతిథిపూజార్థసజ్జీకృతార్ఘ్యపాద్య, సలిలమధుపర్కలాజకుశప్రవాళ
గంధపుష్పాక్షతాదిప్రగల్భనములు, ప్రత్యహకృత్యములు మౌనిబాలికలకు. 38

వ. మఱియు నద్దేవదారువనంబునందు మునులవ్రతభంగంబు సేయంబూని యేతెంచినపదు
నాల్గుజాతులయప్సరస్త్రీనికదంబంబులు ప్రతిజాతి కొక్కొక్కవాడ యేర్పడ నానా
సంకేతసన్నివేశంబులై తప్పకుండు మార్తాండమండలం బిక్షుదండంబులు మృత్యుదేవతా
వదనగహ్వరంబు నారాయణోరుకాండం బగ్నిజ్వాలాజాలంబు శంబరారాతిచెఱకు
విల్లు ముక్కంటినొసలిచిచ్చుఱకన్ను గంధర్వవంశద్వయం బాదిగా బహువిధాన్వయం
బుల నుత్పన్నంబు లగుటం జేసి తమతమయుత్పత్తిలాంఛనంబులును, సౌభాగ్యధ్వజపతా
కాపటలంబులుం దేటపడఁ బ్రతిభవనభిత్తిభాగంబునం జిత్రించినచిత్తరువులయందుం
గోరకితనేత్రత్రిభాగుం డై కుసుమకంకపత్త్రంబుల వంక లొత్తుచు రతీదేవివృత్తస్తనం
బులమీఁద నత్తమిల్లినయున్మత్తచిత్తభవువిక్రమసంపత్తి ప్రకారంబును, బట్టపగలు
యోజనగంధ యనుగంధగజగమనపట్టపుచానంగఁ జూచి తొట్రుపడువసిష్ఠపౌత్రుని

దృష్టిప్రియత్వంబును, నాచార్యభార్యయగు తారాదేవిమీఁదఁ దారకారాజు వలపు చీటంబు వాటంబు సేయు లలితకటాక్షవీక్షావిక్షేపమ్ములును, ధృతిమాలి మాలినీసైకతంబున నేకతంబునం గురువిందపాదలో వేలువులంజియకెంజిగురు చవి నూచినకుశికనందనురాగావేశంబును, గుసుమకోదండజయడిండిమం బగువిభాండకసుతునివనితామండలాసక్తియు, బృందావనంబునందు ముకుందుం డొనరించిననందవ్రజవధూవిహారాడంబరంబును, నంబురుహసూతి యాఁడుపట్టిం బట్టుకొనినపట్టునుం, బురుహూతుండు గౌతమకళత్రంబుమీఁదం గల్పించినచీఁకటితప్పును జూడఁ జూపఱకుఁ జిత్తంబు లువ్విళ్లూర వేఱవేఱ వసియించియుండునచ్చేడియలలో విబుధమత్తకాశినీజనోత్తమ యగుతిలోత్తమయు వశీకృతకుసుమనారాచ యగు ప్రమ్లోచయు నలకూబరనఖాంకరేఖాంకితస్తనకుంభ యగురంభయు గుణపేశి యగుసుకేశియుఁ గలమంజుఘోష యగుమంజుఘోషయు శృంగారరసరాశి యగునూర్వశియు రూపానురూపస్థానక యగుమేనకయుఁ గలికిచూపుల హేలాసందర్శితమేఖలాకలాపంబు లగువ్యాపారంబుల హాటకతులాకోటిఝుళఝుళత్కారమందరంబు లగుమందరగమనంబుల వికస్వరకపోలఫలకంబు లగుమొలకనవ్వుల నమృతరసకూపంబు లగునాలాపంబులఁ ద్రిభువనంబులు వశీకరింతు రట్టిదేవదారువనంబునందు. 39

సీ. నందికేశ్వరు నొక్కనవశాద్వలంబున, హరితాంకురములు మేయుంగఁ బనిచి
ప్రమథుల నొక్కసరస్సమీపంబున, లింగార్చనంబుఁ జెల్లింప ననిచి
భూతజాతము నొక్కపులినస్థలంబున, నాత్మేచ్ఛ నుండంగ ననుమతించి
మాతలేడ్వురు నొక్క మణికందరంబున,విశ్రాను ముండంగ వెరవుచేసి
గీ. పసిఁడికొప్పెర లాతంబుఁ బచ్చకోల, జోగపట్టియ కకపాల జోలిసంచి
కలికికాటుకగిరొబ్బట్టు పలుగుపేరు, జాతిగాఁ దాల్చి నెఱిమిండజంగ మగుచు. 40

వ భిక్షాటనంబునకుం జొచ్చె నప్పు డవ్వేళవాటంబునందు. 41

శా. ప్రాలేయాచలకన్యకాధిపతికిం బ్రమ్లోచ మోచాఫల
స్థూలాపూపఘృతాన్వితంబుగఁ గడుందోరంబు బిచ్చంబుఁ గెం
గేలం బెట్టె నఖాంకురద్యుతులతోఁ గీల్కొంచు మాణిక్యము
ద్రాలంకారమయూఖకందళదళ వ్యాపారమేపారఁగన్. 42

గీ. రంభ రంభామ్రఫలసమగ్రంబుగాఁగ, నమృతదివ్యాన్నభిక్ష కామారి కొసఁగ
రాఫుఁజన్నులనడుమ రారాజుపట్టి, పట్టె రొత్తినఖరేఖ బయలుపడఁగ. 43

సీ. కనకనూపురరణత్కారనిక్వాణంబు, రవలిమెట్టియలతో రాయిడింప
రవయుంగరంబుల రత్నాలదీప్తులు, వాలాడుగోళ్లపైఁ జిలువాఱ

గుదురునిండినమించుగుబ్బచన్నులమీఁద, ముత్యాలహారంబు మురువు సూపఁ
గంపించుబంగారుఁగమ్మలక్రొమ్మించు, నిద్దంపుఁజెక్కుల నీడ సూప
గీ. నెదురుగానల్ల నేతెంచి హేమపాత్ర, నాజ్యమధుశర్కరాఫలాద్యన్వితముగ
మదనవైరికి నర్పించె మంజుఘోష, యమృతదివ్యాన్నపాయసాహారభిక్ష. 44

శా. అక్షయ్యంబుగ దివ్యమాధుకరభిక్షాన్నంబు వడ్డించెఁ దా
గోక్షీరంబులతోడ శర్కరలతోఁ గ్రొన్నేతితోఁ దేనెతో
ద్రాక్షాదాడిమచూతపాకములతో దాక్షాయణీభర్తకున్
జక్షూరాగ మెలర్పఁగా హారిణి విశ్వాసంబుతో ముంగిటన్. 45

ఉ. అల్లనఁ జేర వచ్చి ధవళాన్నముఁ గమ్మని యాలనేతితో
బెల్లముతోడ వాల్కడపుఁబేసముతోడను నిమ్మపండ్లతో
నెల్లభుకూర్తి నెచ్చెలికి వారణవైరికి మంచుఁగొండరా
యల్లునికిం బినాకికిఁ బ్రియంబున నూర్వశి పెట్టె భిక్షమున్ 46

ఉ. పెట్టెఁ దిలోత్తమాప్సరస భిక్ష ప్రియంబున భూతభర్తకున్
గట్టెఁ బసిండి శర్కరలఖండముతోడ ఘృతంబుతోడఁ గ్రొం
బట్టుఁబసిండి సిబ్బిలపుఁబయ్యెదకొం గొకకొంత జాఱి చ
న్గట్టు లలాటలోచనునికన్నులు మూఁటికి విందు సేయఁగన్. 47

గీ. సహజసౌజన్య సహజన్య శంకరునకుఁ, బొసఁగ వడ్డించెఁ దత్కాలపుణ్యభిక్ష
సారదోర్మూలకూలంకషంబులైన, వీఁగుఁజాలిండ్లు పయ్యెద వీడుకొలుప 48

క. విశ్వచతుర్దశభువనా, ధీశ్వరునకు భక్తియుక్తి నిపకంబెసఁగన్
విశ్వాచి యనెడునచ్చర, శశ్వన్మధురాన్నభిక్ష గమ్మతిఁ బెట్టెన్. 49

గీ. కనకనూపురమేఖలాకలకలంబు, రత్నకంకణరవముతో రాయిడింప
నభవునకుఁ బెట్టె మధురదివ్యాన్నభిక్ష, చిత్తభవకీర్తిశశిరేఖ చిత్రరేఖ. 50

వ. మఱియుం దక్కురేఖాంగనలు భుజంగభూషణునకు నపాంగరంగస్థలలాస్యలంపటంబులగుకటాక్షవీక్షణంబులతోడఁ గూడ భిక్షాహారంబులు సమర్పించిరి కందర్పసూదనుండునుం బ్రతిమందిరంబునం జందనకుసుమధూపదీపాద్యుపచారంబులు గ్రహించుచు నశ్వేశవాటంబున భిక్షాటనక్రీడ సలిపి యంతం దనివిసనక కనకగర్భకపాలపాత్రం బర్థపూర్ణం బై కరపల్లవంబున నుల్లసిల్ల నల్ల నల్లన యోగపాదుకాయుగళంబు గల్లుగల్లున మ్రోఁగ మునిజనాశ్రమంబుఁ బ్రవేశించి మునిమందిరములమోసలల నిలిచి 'భవతీ భిక్షాందేహి' యటంచు వారివాహగర్జాగంభీరస్వరంబునఁ బలుకుమఁ గులాంగనాజనంబు నపాంగదృక్తరంగంబులం జెలునగవులిసిలింతలువాఱఁగముంగొనుచు సంయమి

వధూపాతివ్రత్యభంగంబు తనకుం బరమప్రయోజనంబు గా గర్భోక్తిసందర్భంబుల
నిజాభిలాషంబుఁ దేటపఱచుచుఁ బర్యటింపం దొడంగిన. 51

మ. దరహాసంబుల భ్రూలతానటనచేతన్ విభ్రమప్రౌఢిమన్
బరిహాసోక్తుల భావగర్భరససంపత్తిస్ఫుటాలోకన
స్ఫురణాభంగుల మౌనికాంతలమనంబు ల్చూఱలాడెన్ మహే
శ్వరుఁ డుద్దామవిలాసదారువనికావాటప్రదేశంబులన్. 52

సీ. సుబలమార్కండేయశునకమౌంజాయన, మాండవ్యగోత్రసంభవులయిండ్ల
బకదాల్భ్యరైభ్యకభల్లకిచతుకర్ణ, కణ్వవత్సాన్వయాగ్రణులయిండ్ల
ఘటజానుకాత్రేయకటకళాపసుమిత్ర, హరివక్త్రమునివంశధరులయిండ్ల
వాయుభక్షకభార్గవవ్యాసజైమిని, శుకకపిలకులప్రసూతులిండ్లఁ

గీ. బుణ్యగృహిణులఁ బతిభక్తిపూర్ణమతుల, భాగ్యసంపన్నలను బుత్రపౌత్రవతుల
సతుల ముత్తైదువుల నిర్విశంకవృత్తి, రజనికరఖండమౌళి విరాళి గొలిపె 53

వ. ఇట్లు ప్రతిగృహంబున భిక్షాటనంబు సేయుచు మహోక్షలాంఛనుండు వాంఛానుకూలప్రకారంబునం జోరరతవ్యాపారపారాయణుం డై మగలకన్ను మొఱంగి సంధ్యాసమయంబుల ననుష్ఠానార్థంబు పురుషులు సమిత్కుశఫలాహరణార్థం బెందేనిం జనిన యడరువేచి శపథశతక్షతోష్ఠంబును నిరుద్ధనిశ్వాసోత్సాహంబును నివారితోల్లాసంబును నిమేషమాత్రసౌఖ్యంబును నిబిరీసభయకంపంబు నైనసంభోగంబు లభిలషించు నారంభోరువులమనంబు లెఱింగి సంకేతస్థానకేళికలను నికుంజక్రోడసంవేశక్రీడలను వాతదూతీపరామర్శంబులను భ్రూలతాదేశంబులను నపాంగరంగస్థలలాస్యలంపటకటాక్షవీక్షావిక్షేపంబులను మందహాసకందళితపరిస్పందంబులఁ గందర్పపరబ్రహ్మానందం బనుభవింపంజేసి మిసిమింతుండునుంగాక దేవదారుకాంతారమధ్యంబున. 54

సీ. మువ్వన్నెపులితోలు మొలదిండుగాఁ గట్టి, కర్కోటకాహి బాగగ బిగించి
చిలువపోఁగులను వ్రేల్చెవులఁ గీలనచేసి, వలరాచనీరు మైఁ గలయ నలఁది
చిన్నారిపొన్నారిశశిరాంశుఁ దలఁదాల్చి, కొనగోటిజత లేడికొదమఁ బూని
పచ్చియేనికతోలు పచ్చడంబు ధరించి, గిలుకు మువ్వలకోలఁ గేలఁ బట్టి

గీ. పసిఁడిజలపోసనముతోడ నెసకమెసఁగు, బిసరుహాసనుపుఱియకప్పెర ధరించి
పెద్దనడివీథి నిలుచుండి భిక్షుఁ డడుగు, నాశ్రమంబునయందు ఖట్వాంగపాణి. 55

వ. ఇవ్విధంబున మన్మథమథనుండు మదనోన్మాదంబునం గన్నుఁగానక మునికళత్రంబుల పాతివ్రత్యంబులు పొలిపుచ్చుచు విచ్చలవిడిఁ జరియింపం బూనిన నిలింపమానివ్రాతంబు వారివారికి నెఱింగి గుజగుజవోవుచు వంచనంబు ప్రకాశింపంజాలక లోలోన యడంచుకొని యుండుచుండ నప్పాటం బ్రతిభవనంబునఁ బొటిల్లుచీఁకటితప్పు

కప్పిపుచ్చ వెరవుపడకుండునట్లుగాఁ బ్రకాశించినఁ గట్టాయితంబై యందఱు నాజగ
జెట్టివేల్పు నేవిం బట్టుకొనువారై చుట్టుముట్టిన. 56

క. ముసిముసినవ్వులు నవ్వుచు, మిసిమింతుఁడు గాక యొక్కమిఱుత నిలిచి య
క్కుసుమశరహరుఁడు తపసులు, కసమసఁదనుఁబట్టుకొనఁగఁ గడగినఁ బెలుచన్. 57

*   *   *   *   *   *   *

*   *   *   *   *   *   *

*   *   *   *   *   *   *

*   *   *   *   *   *   *

ఆశ్వాసాంతము

శా. శ్రీమద్దక్షిణకాశికాపురమహాశ్రీకాళహస్తీశ్వర
ప్రేమాత్మోద్భవకాలభైరవకృపాశ్రీవర్ధితైశ్వర్య! యు
ద్దామప్రాభవ! దానవైభవకళాధారేయ! హేమాచల
స్థేమా! వీరకుమారగిర్యధిపలక్ష్మీభోగభాగోచితా! 58

క. కావేరీవల్లభ! సం, భావితబుధలోక! సమరఫల్గున! ధరణీ
దేవార్చనాపరాయణ, కోవిద! తిరుకచ్చినంబికులజలధిశశీ. 59

మాలిని. మృగమదఘనసారోన్మేలనాసంప్రయోగ
ప్రగుణితహిమపాతిప్రౌఢకేళీవిహారా!
యగురుఘుసృణపంకవ్యాప్తిగంధాంబుగంధ
స్థగితదిగవకాశా! దానవిద్యానిధీశా! 60

గద్య. ఇది శ్రీమత్కమలనాభపౌత్ర మారయామాత్యపుత్త్ర వినయవిధేయ
శ్రీనాథ నామధేయప్రణీతం బయినహరవిలాసం
బను మహాప్రబంధంబునందుఁ
బంచమాశ్వాసము

శ్రీరస్తు.

హ ర వి లా స ము

ష ష్ఠా శ్వా స ము.

శ్రీవటుకనాథభైరవ
దేవశ్రీపాదపద్మదృఢతరభక్తీ!
దేవబ్రాహ్మణసేవక!
దేవప్రభుతనయ! యవచిదేవయతిప్పా 1

వ. ఆకర్ణింపుము. 2

ఉ. హేమనగంబుమీఁద దివిజేంద్రులు గొల్వ మహావిశుద్ధము
క్తామణిరత్నసంఘటితకాంచనగండశిలాతలంబునన్
హైమవతీసహాయుఁ డయి యర్ధశశాంకధరుండు దేవతా
గ్రామణి నీలకంఠుఁడు సుఖంబునఁ దాఁ గొలువుండె నర్మిలిన్. 3

వ. అప్పుడు పార్వతీదేవి మహాదేవునియింగితం బెఱింగి యిట్లనియె. 4

గీ. అభవ! నీకంఠమూలంబునందుఁ దెలిసి, కానవయ్యెడునిది యేమికప్పు సెప్పు
మఖిలలోకవిలోచనాహ్లాదకలన, కంఠమై యందమయ్యె శృంగారరేఖ. 5

గీ. అనతిమ్ము మహాదేవ! యభవ! నీదు, కంఠమూలము నలుపైన కారణంబు
నమ్మ మన్నించి యీకారణంబు నాకు, నానతీఁ దగు నీవు లోకాభివంద్య. 6

వ. అనిన విని శంభుండు శాంభవి కిట్లనియె. 7

మ. మును జంభాసుర బాహువిక్రమకళాముద్రావిభాభాసురున్
ఘనదంభోళినిశాతహేతినిహతిన్ ఖండించి యాఖండలుం
డనువాదంబున దేవతల్ గొలువఁగా నైరావణారూఢుఁడై
ఘనమార్గంబున వచ్చె నాకమునకున్ గర్వం బఖర్వంబుగన్. 8

క. ఆవేళను గంధర్వులు, కైవారపదానుసారకమనీయముగాఁ
బ్రావేశికధ్రువాగా, నావళులం బరిఢవించి రంచితలీలన్ 9

ఉ. క్రచ్చలఁ బారిజాతలతికావనదేవతజంభవైరిపై
మచ్చికఁ గూర్పఁ గా నవసుమప్రకరంబుల వేల్పుబోఁటిలో
విచ్చినపైఁడితామరలవెంబడి వచ్చినకమ్మగాడ్పులన్
మెచ్చులరీతిఁ గోకిలసమీరణ దీవన లిచ్చె నొప్పుగన్. 10

క. మందాకినీతరంగము, లాందోళము నందఁ జేయు చల్లల్లన సం
క్రందనునిమీఁదఁ బొలసెను, మందారలతావనాంతమందానిలముల్. 11

గీ. దేవతాభర్త యమరావతీపురంబుఁ, జేరఁ జనుదెంచె వేల్పులు చేరి కొలువ
భ్రాజదైరావణానేకపప్రచార, తరళమాణిక్యకుండలాభరణుఁ డగుచు. 12

వ. అయ్యవసరంబున. 13

శా. గీర్వాణాధిపుచెంగట న్నిలిచె నక్షీణప్రభావాధికాం
తర్వాణిస్తుతవాగ్విలాసుఁడు కృతద్వంద్వవ్యుదాసుండు చి
న్నిర్వాహస్థిరయోగవైభవకథానిత్యోదయోల్లాసుఁ డ
ద్దూర్వాసుండు ప్రసూనమాల్యరుచిమద్దోఃపద్మవిన్యాసుఁ డై. 14

గీ తనకుఁ బ్రమ్లోచ యనుదేవతాపురంధ్రి, పావడముఁ జేసె నెద్దాని భయముతోడ
నట్టితనపారిజాతమాల్యంబు హరికిఁ, దర్శనం బిచ్చె దీవించి తాపసుండు. 15

వ. ఇట్లు దూర్వాసుం డాశీర్వాదపూర్వకంబుగా నొసంగినకుమారపారిజాతమాల్యం బహల్యాజారుం డగుశునాసీరుండు దుర్వారవిజయగర్వాటోపంబునం గన్నుఁ గానక పట్టితాలంకారతాటంకితలలాటం, బగు నైరావణకరటికుంభపీఠంబుపై నలవోకయుం బోలె వైచె వైచిన, నమ్మదాంధగంధసింధురంబు వసుంధరాభరణశౌండం బగుతుండం బెత్తి నున్నని యప్పువ్వుదండఁ గ్రమ్మఱఁ గ్రమ్మఱించి విసరి కేసరంబులు వీసర వోవ మకరందంబు చిందఁ బొరలు విఱుగం బుప్పొడి సడలం గపోలభిత్తిభాగంబుల మొత్తి యున్మత్తమధుపంబుల రేఁచి యుప్పరంబునం ద్రిప్పి చెందిరంబు ధూళిఁ దూలించి యందంద కొంతతడవు వినోదించె, నప్పువుదండ వాస్తోష్పతి పట్టినయేనుంగు వలన నిట్టు నట్టునుం బడి కువిటుచేతం బడినపూఁబోఁడిపోలిక, బెబ్బులివాతం బడిన హరిణిచందంబునఁ బ్రమత్తునికైవస మగురాజ్యలక్ష్మివిధంబున విడివడియు, హస్సియుఁ, గ్రుస్సియు నొగిలియుఁ బగిలియుఁ, దీనదశకు వచ్చినం గనుంగొని. 16

మ. వికటభ్రూకుటిఫాలభాగుఁడును, బ్రస్వేదాంబుపూర్ణాఖిలాం
గకుఁడుం, బాటలగండమండలుఁడు నై, కల్పాంతసంహారరు
ద్రకఠోరాకృతి దుర్నిరీక్షుఁ డగుచున్, ధట్టించి దూర్వాసుఁ డు
గ్రకటాక్షంబుల నింద్రుఁ జూచి పలికెన్ గాఢాగ్రహవ్యగ్రతన్. 17

క. ఓరి మదాంధ! యహల్యా, జార! త్రిలోకాధిరాజ్యజాతి మగునహం
కారంబా యిది మమ్ముం, జీరికిఁ గైకొనక యిట్లు సేయుట యెల్లన్. 18

గీ. ఏను దీవించి చేయెత్తి యిచ్చినట్టి, పుష్పమాలిక నాదలఁ బూనవైతి
హస్తిచేతికి నిచ్చితి వంతఁబోక, దండనార్హంబె యిప్పువ్వుదండ నీకు. 19

క. క్రోధం బితరులకుఁ దపో, బాధక మగుఁగాని నాతపంబున కది యు
ద్బోధకమ, సలిల మగ్నికి, బాధకమై వైద్యుతాగ్నిఁ బ్రభవించుగతిన్. 20

క. నీకనులకు నిది మాల్యం, బోకుధరవిరోధి! యింతనుండియు నిట నీ
నాకం బఖిలంబున ని, శ్శ్రీకం బగుఁ గాక నీవిజృంభణ మణఁగన్. 21

ఉ. నన్నుఁ దిరస్కరించితి మనంబున నించుక భీతి లేక వే
గన్నులఁ గాన వైతి మదగర్వవికారదురాగ్రహైకసం
పన్ననిరాజ్యలక్ష్మికి నపాయము గల్గక యుండు నెట్టులో
యన్నియు వస్తుజాతములు నంబుధిలోఁ బడుఁగాత లక్ష్మితోన్ 22

క. ఎచ్చోట నుండు నిందిర, యచ్చోటనె యుండు సత్పదార్థంబులు నీ
యుచ్చైశ్శ్రవ మైరావణ, మచ్చర లమరద్రుమంబు లంభోధిఁ బడున్ 23

గీ. అమృతకుంభంబు పడుఁగాక యబ్ధియందుఁ, గామధేనువు పడుఁగాక కంధియందుఁ
దారకాధీశ్వరుండుఁ జింతామణియును, గూడ దుగ్ధాంబునిధిలోనఁ గూలుఁగాత. 24

వ. అని పల్కి దూర్వాసుండు చూడంజూడ నంతర్ధానంబు సేసిన. 25

క. యతిపతిశాపాక్షరములు, శతమఖున కసహ్యహృదయశల్యము లయ్యెన్
మతిఁ దలఁపఁ బూజ్యపూజా, వ్యతిక్రమము సర్వకార్యహార మగుఁ గాదే. 26

గీ. మానిశాపాగ్నిదందహ్యమానుఁ డగుచు, విన్ననైనమొగంబుతో వీడు సొచ్చెఁ
బాకశాసనుఁ డఖిలదిక్పాలకులును, దైన్యవైవర్ణ్యవంతులై తన్నుఁ గొలువ. 27

వ. అంతం గొంతకాలంబునకు. 28

సీ. రంభాదు లగునప్సరస్సరోజాక్షులు, పదునాల్గుజాతులు పడిరి వార్ధి
సంతానతరుపారిజాతాదికుజములు, మున్నీటినీటిలో మునిఁగిపోయె
నైరావణమ్ముఁ జింతారత్నముం గూలె, నుచ్చైశ్శ్రవంబుతో నుదధిలోనఁ
గామదుగ్ధేనువుఁ గాదంబరియుఁ దాను, నమృతకుంభంబుతో నబ్ధిఁ బడియె

గీ. నిమ్మహావస్తువులఁ గూడి యిందురేఖ, మున్నుగా దుగ్ధమయమహాంభోధిఁ జొచ్చె
బ్రహ్మమునిఘోరశాపప్రభావయుక్తిఁ, బ్రథమదిక్పాలుత్రైలోక్యభవ్యలక్ష్మి. 29

గీ. దివ్యమణి లేక యప్సరస్త్రీలు లేక, యమృతకుంభాదు లగుపదార్థములు లేక
యుక్కఁపడియుండె బహుకాల మొప్పు దఱిఁగి, విగతలక్ష్మీవిలాసుఁడై వేల్పుఱేఁడు.

చ. అమృతముఁ గల్పవృక్షనివహంబును లేనిసుధారసాశన
త్వమును నశోకవల్కపరిధానతయుం గలవేల్పుపెద్ద తా
నముచినిషూదనాదులు మనంబున నొందిరి ఖేదమోదదుః
ఖము గుడువంగ నోగిరము గట్టఁగఁ బుట్టముఁ బుట్టకుండుటన్. 31

వ. ఇవ్విధంబున బృందారకు లిందిరావ్యపాయంబున నపారదారిద్ర్యాంధకారమగ్నులై నగ్నాటులుం బోలి భయంపడి లేటమొగంబువడి హాటకగర్భపాలికిం బురందరుండు ముందఱగాఁ జని మునిశాపయుక్తి మూఁడులోకంబులరాచసిరి యబ్ధిలో మునింగిన భంగి లేటతెల్లంబుగఁ దెలియంబఱచిన నానలినాసనుండు వెన్నునిం గూర్చుకొని మాసమీపమ్మునకు వచ్చి మమ్మిట్లు సన్నుతించె. 32

క. జయ పార్వతీమనోహర !, జయ పరమానంద ! జయ నిశాకరమౌళీ !
జయ భూమిసలిలపావక !, వియదనలార్కేందుహోతృవిలసితమూర్తీ ! 33

క. త్రిభువనభువనారంభా, రభటీసంరంభమూలరత్నస్తంభా !
యభినవహిమకరరేఖా, శుభికాలంకారధామశోభితమకుటా !. 34

క. దివసావసానసంధ్యా, నవపరమానందనందినాందీనాథ
వ్యవహారఝంక్రియావధి, వివిధమహాతాండవైకవిద్యాభిరతా !. 35

క. తరుణహిమకిరణరేఖా, భరణా ! సురనికరమకుటభాసురరత్న
స్ఫురణాపరిచయరంజిత, చరణా ! నిరుపాధికాభిసంప్రతికరుణా. 36

గీ. అజర ! యవ్యయ ! యనపాయ ! యప్రమేయ !, యాద్య ! యనవద్య ! వేదవిద్యాభివంద్య !
నిర్మలాకార ! నిర్ద్వంద్వ ! నిరుపమాన !, నిత్య ! నిజభక్తవైకుంఠ ! నీలకంఠ 37

వ. అని యనేకప్రకారంబులం బ్రస్తుతింప ననుకంపాపరాధీనుఁడ నగు నే నిట్లంటి. 38

గీ. అబ్ధి మథియింపవలయు నీయవసరమున, నమృతలక్ష్మీప్రధానమహాపదార్థ
సముదయంబులు లేకున్న జగము లెల్ల, విన్నఁబోయిన పతిదీనవృత్తి నొంది. 39

సీ. ఆరసాతలమగ్నమయ్యె మునుంగని, మందరాద్రీంద్రంబు మంథయష్టి
సర్వసర్వంసహాసంభృతిప్రవణుండు, దందశూకస్వామి తరువుత్రాఁడు
చరమాంగపీఠికాస్థాపితశేషుండు, కితవకచ్ఛపరాజు క్రిందిమట్టు
నింద్రాదిసురలు బలీంద్రాదిదనుజులు, దర్పదుర్వారులై త్రచ్చువార

గీ. లేను బ్రష్టయు హరియును నింతనంత, నుండువారము కార్యప్రయోగరక్ష
నీవిధంబున దుగ్ధాబ్ధి యేచి తరువ, వివిధసద్వస్తులుం బ్రభవింపఁ గలవు. 40

వ. ఇట్టిమహాప్రారంభంబునకుం దగినసాధనసామగ్రి యిది. శేషుండును గమఠపతియును నశేషభువనభారంబునకుం దగినవారి నియోగించి వచ్చునది, యచ్యుతుండు సు

రాసురులం గూర్చుకొని మందరాచలంబు పెకికితెచ్చునది, యేనును బితామహుం
డును మున్నాడి పాలమున్నీటిదరికిం జేరి యుండువారము. ఇదియ నిశ్చయం బని యే
నంతర్ధానంబుం జేసితి, జలజాసనుండును మదాదేశంబున దుగ్ధాబ్ధితీరంబుం జేరె, జనా
ర్దనుండును దేవదానవసేనాసమేతుం డై దిక్పాలురుం గూడరాం బశ్చిమదిశాముఖుం
డై చనువాఁడు ముందర. 41

శా. కాంచె న్మందరశైలముఙ్ మృదుతటీగండోపలశ్రేణికా
చంచన్నిర్ఝరవేణికాఘుమఘుమస్ఫాయద్గిరాగోళముఙ్
బంచాస్యస్ఫుటకంఠనాళనినదప్రధ్వస్తశుండాలముఙ్
సంచారాలసకిన్నరీశతలతాసంఛన్నహింతాలమున్. 42

వ. చనుదెంచి యప్పాంచజన్యధరుండు జంభారిప్రముఖు లగుదివిజవరుల నెడఁగలుగం
దొలంగ నియమించి. 43

సీ. కటిమండలంబునఁ గనకంపునునుఁజేల, ధృఢముగా బిగియించి దిండుగట్టి
కట్టాయితం బైనకంఠరహుంకారంబు, గావించె దిక్కులు గ్రక్కదలఁగ
సమధికావష్టంభసంరంభజృంభణ, సమకూర్చె నిజభుజాస్తంభమునకుఁ
బానాభిఘట్టనఁ బార్శ్వదేశంబుల, వదలించి ధాత్రి గ్రక్కదలఁ జేసి
గీ. పట్టెఁ గదలించె నసియార్చెఁ బాఁ తగల్చె, నెత్తె వక్షస్థ్సలంబున నెఱియ నొత్తెఁ
దోయజాక్షుండు లోకైకదుర్ధరుండు, దాల్చె నవలీల నిట్లు మందరనగంబు. 44

సీ. అంగదాభరణంబులందుఁ గీలించిన, వజ్రాలకీలన వదలకుండ
వక్షస్థ్సలంబున వైచినచపకంపుఁ, దులసిదండకు వాడు దోఁపకుండఁ
గడు నొప్పఁ దీర్చినకస్తూరితిలకంబు, చెమటబిందులచేతఁ జెదరకుండ
నెట్టెంబు సుట్టిననెమ్మిపింఛముదండ, కొనరేక యొక్కింత గుదియకుండ
గీ. శ్రవణకల్హారముకుళంబు జాఱకుండ, విరులకీల్కొప్పు వదలి కైపెక్కకుండ
నెత్తె శృంగారకంతుకం బెత్తినట్లు, కైటభారాతి మందరక్ష్మాధరంబు. 45

శా. గోలాంగూలకులంబు లాకులపడెఙ్ ఘోషించె శార్దూలముల్
జాలిం బొందె లులాయముల్ సుడిగొనెఙ్ సారంగముల్ విచ్చె లే
గోలంబుల్ బెదరెం జమూరుగణ మాక్రోశించెఁ బంచాస్యముల్
తాలాంకావరజుండు మందరమహాధాత్రీధరం బెత్తినన్. 46

గీ ఏడుపాతాళములును గగ్గోడుపడియెఁ, బెల్లగించి మహీధ్రంబు పెకికినప్పు
డిందిరాభర్త గిరి మీఁది కెత్తినపుడు, గ్రక్కదలసాగె బ్రహ్మాండకర్పరంబు. 47

గీ ధాత్రి నాఁడు వరాహావతారవేళ, నేకదంష్ట్రాగ్రమున ధరియించినట్టి
తోయజాక్షుండు బాహాచతుష్టయమున, మాటమాత్రనె మోయఁడే మందరాద్రి. 48

గీ. మందరాద్రిని మోయించి మాధవుండు, పట్టి తెప్పించె నిర్జరప్రతతిచేత
నసురయూథంబు చేత దుగ్ధాబ్ధిదరికి, నబ్జగర్భుండు నేనును నభినుతింప. 49

వ. అనంతరంబ నేనును హరిహిరణ్యగర్భులును గార్యభారధురంధరులమై ప్రవర్తింపం
బురందరాదిసురలు జలంధరాదిరాక్షసులును సముద్రమథనంబునకుం బ్రారంభించిరి. 50

గీ. అఖిలకార్యసమారంభణాదులందుఁ, బూజనీయుండు గావున బుద్ధిఁ దలఁచి
విఘ్ననాయకు నంభోధివేలమీఁద, సురలు నసురులుఁ గొలిచిరి పరమభక్తి. 51

శా. క్షీరాంభోనిధి సైకతస్థలమున న్సింహాసనారూఢుఁగా
హేరంబు న్హరినందను న్నిలిపి ప్రత్యేకంబ దేవాసురుల్
గారామారఁగ నాచరించి రభిషేకం బుల్లసద్గంధక
స్తూరీసౌరభవాసితంబుల నదీతోయంబులం దోఁగఁగన్. 52

క. అభిషేకానంతరమున, నిభరాజాస్యునకుఁ గట్ట నిచ్చిరి యదితి
ప్రభవులును దితితనూజులు, నభినవదివ్యాంబరములు నాభరణములున్. 53

గీ. కుంకుమాగురుమృగనాభిపంకములను, గంధకర్పూరనీహారకర్దమముల
నలఁది రమరాసురులు భక్తి యతిశయిల్ల, భవునిపట్టికిఁ బసిఁడికుంభములఁ బట్టి. 54

సీ. ఉండ్రాలు నూఁబిండి పుండ్రేక్షులుం దేనె, యనఁటిపండ్లుం బూరియలు ఘృతంబుఁ
బెసరుఁబప్పును బాలుఁ బెరుఁ గోగిరంబులుఁ, బాయసాన్నంబులుఁ బానకములు
నాళికేరంపుబొండాలు మీఁగడయును, నవదధిపిండఖండా ల్గడుములు
లడ్డువంబులు చక్కిలాలు మోరుండలు, ఖండంబు చలిమిడి మండపప్పు

గీ. లాదిగా భక్ష్యచోష్యలేహ్యాదు లైన, బహుపదార్థంబు లర్పించి ప్రణతు లైరి
వేలుపులు రాక్షసులును నావిఘ్నపతికి, దుగ్ధపాథోధిమంథనోద్యోగవేళ. 55

వ. ఇట్లు షోడశోపచారంబులం బూజించి దేవాసురులు విఘ్ననాయకు నిట్లని స్తుతి
యించిరి. 56

దండకము. జయజయ జగదేకరక్షామణీ! దేవచూడామణిశ్రేణిశోణప్రభాజాలసుస్మేర
పాదారవిందా! ముకుందప్రియా! యిందుధారీ! కటస్యందిదానాంబుధారాధునీధోరణీ
గాహకౌతూహలాయత్తమత్తద్విరేఫాంగనాగానసంగీతరంగీకృతస్వాంత! దంతావ
భాస్యా! నమస్యా! త్రిలోకైకవశ్యా! యవశ్యాయశైలాత్మజాధర్మసంతానసంతానకల్ప
ద్రుపుష్పావతంసా! యసారోరుసంసారమాయాంధకారాహృతిప్రక్రియాభాస్కరా!
కోటిభాస్వన్నిరాఘాటదేహప్రభాభాస్వరా! దేవ! హేరంబ! లంబోదరా! యేక
దంతా! మహాకాయ! సంతప్తకార్తస్వరాభా! విశాలాక్షు! మౌంజీధరా! నాగయజ్ఞోప
వీతా! సమన్వీతకృష్ణాజినా! యాఖువాహా! కుఠారాయుధా! విఘ్నరాజా! గణాధ్యక్షు!

కారుణ్యలీలాకటాక్షంబునన్ మమ్ము వీక్షించి రక్షింపు మీక్షీరవారాశి నీమందరక్ష్మా
ధరస్వామి కవ్వంబుగా నీభుజంగాధినాథుండు సూత్రంబుగాఁ గచ్ఛపాధీశుఁ డా
ధారపీఠంబుగా సర్వదివ్యౌషధీవల్లుల న్వైచి నానాపదార్థంబు లన్వేన్నలం బంచుకోఁ
గోరి యున్నార మిక్కార్య మేవిఘ్నముం బొందకుండంగ నేవిక్రియం జెంద కిష్టార్థ
సంసిద్ధులం గైకొనుం గాక నీయాజ్ఞ సర్వేశ ! సర్వాత్మకా ! నిర్వికల్పా ! నిరీహా !
నిరాతంక ! నిశ్శంక ! యోంకారమూర్తీ ! నమస్తే నమస్తే నమః. 57

క. అని నిర్జరులును దైత్యులు, వననిధిమథనాదియందు వారణవక్త్రుం
గొనియాడి తత్ప్రసన్నతఁ, గని రొగి సంతసము మీఱఁ గడఁక దలిర్పన్. 58

వ. కట్టాయితం బై సురాసురులు బిట్టేచి పాతాళగోళంబు క్రిందమట్టుగా నాదికమఠం
బుఁ బెట్టి వాసుకిఁ దరిత్రాడుగాఁ జుట్టి తోఁకయు శిరంబును బట్టి మంథరాచల
మంథానంబున దుగ్ధసింధువు మథింపం దొడంగిరి. ఘుమఘుమధ్వానంబు దిక్కూలం
బిక్కటిల్లె వారివాహవ్యూహంబులు కడలవియఁ జదల నుదిలకొనియె. డిండీర
పిండఖండంబులు బ్రహ్మాండంబునం బ్రసరించె. నంభస్తరంగంబులు దిగిభకుంభంబుల నా
స్ఫాలించె నావర్తచక్రంబులయందు గ్రహతారకానక్షత్రంబులు తిరుగుడువడియె.
నప్పుడు రటత్తిమితిమింగిలంబులును లంబచ్ఛంబలంబును వళద్ధూళియు విరుత్క్రమ
రంబు నుద్భ్రమద్భుజంగంబును నై గంగకుం బరిభవంబును గోదావరికి భేదంబును బె
న్నకు విన్నఁబాటును గాళిందికి మాలిన్యంబును వేత్రవతికి త్రాసంబును విపాశకుం గ్లేశం
బును శతద్రువున కుపద్రవంబును నాపాదించుచు బాడబానలంబునం దొకతొక నుడు
కునీరునుం గలసి నఖంపచం బై సంవర్తసమయారంభంబునుంబోలె మర్యాద నతిక్ర
మించుచు గిరికటకపాషాణసంఘట్టనంబున నెగయుమిణుంగురులుంబోలె నంతర్మణి
శలాకాశకలంబులు మీఁదికెగయ నంభోనిధానంబు మథ్యమానం బయ్యె మఱియును.

సీ. మూలాశ్మసంఘాతములరాపిడిని జేసి, కమఠంబు సుఖియించి కన్ను మోడ్చె
కటకపాషాణసంఘట్టనంబున వ్రస్సెఁ, గుండలీంద్రునివీఁపుకుప్పసంబు
సానూపలద్రోణిఝుర్ఝులత్కారంబు, దిఙ్మండలంబుల దీటుకొనియె
శిఖరకోటీశిలాశ్రేణిశరావుల, గ్రహతారకములు చూర్ణంబు లయ్యెఁ

గీ. ప్రబలబలగర్వదుర్వారబహుసుపర్వ, పూర్వగీర్వాణభుజదండభూరిసార
వితతమందరమంథానవివశనముల, సలిలనిధి మీఱె సంరంభసంభ్రమమున. 60

వ. ఇట్లు తరువందరున సముద్రమధ్యంబున. 61

ఉ. బుగబుగమందుగర్భజలపూరము ఘూర్ణిల బంతిగట్టి క్రొం
బొగలు తరంగసంఘములఁ బొడ్మఁగ నూష్మ జగత్త్రయంబునుం

బొగులఁగాఁ జేయ నుద్దవిడిఁ బుట్టెను నల్లనిచిచ్చు మావిలేఁ
జిగురులచాయలం దెగడుజిహ్వలు గ్రోయుచు దుర్నిరీక్ష్యమై. 62

క. వాసుకివిషధరవిషని, శ్వాసంబుల ఘట్టనముల సమధికతరమై
యాసాగరమధ్యంబున, భాసురహాలాహలంబు ప్రబలం బయ్యెన్. 63

చ. గరళమహత్తరానలశిఖానివహంబులు దూఱి పాఱినం
దరికొనియెం జగత్త్రయము తల్లడ మందిరి నిమ్నగంబులన్
సురగరుడోరగామరులు స్రుక్కఁ బితామహుఁ డంబుజాక్షుఁ డా
తురత వహించె దిక్పతులు తూలిరి ఘూర్ణిలె నేడువార్ధులున్. 64

వ. అప్పుడు సుస్థిరుండై విరూపాక్షుండు త్రైలోక్యరక్షాదక్షం బగుతనదక్షిణహస్తం బెత్తి యోడకుండుఁ డభయం బిచ్చితి నని యెంత యూఱడించిన నూఱడిలక నారాయణాదులు గన న్వేల్పులు పలాయమానపరాయణులై వెనుక మరలియుం జూడక పోవం దొడంగిన. 65

శా. హుంకారం బొనరించి యప్రతిమరౌద్రోద్రేకసంరంభని
శ్శంకాహంకృతిఁ జాఁచె నీశ్వరుఁడు హస్తంబున్ భుజంగాధిపా
లంకారంబు నశేషలోకపరిషల్లావణ్యలక్ష్మీకలా
సంకోచావహదాహభీషణవిషజ్వాలాజిఘృక్షార్థమై 66

క. స్తంభించి నిలిచె గరళము, శంభునిముందట యుగాంతజలధరముగతిన్
గంభీరహుంక్రియావ, ష్టంభసముజ్జృంభమాణసంరంభమునన్. 67

చ. జలధరమంతయై కరటిచందము గైకొని సూకరాకృతి
న్నిలిచి పికంబుతో దొరసి నేరెడిపండును బోలె నుండయై
కలశపయోధిమంధనముఖంబునఁ బుట్టినయమ్మహాహలా
హలము క్రమంబున న్నృపునిహస్తసరోరుహ మెక్కఁ జక్కఁగన్ 68

క. కటుక మగువిషము విషధర, కటకం బగుకేలఁ బూని కౌతూహలియై
ఘుటికాసంసిద్ధుఁడు రస, ఘుటికయునుంబోలె మృడుఁడు గుటుకున మ్రింగెన్ 69

గీ. కంఠికానీలరత్నంబుకరణి నొప్పె, లలితమృగనాభిపంకంబుచెలువు దాల్చెఁ
గాలకూటవిషంబు తత్కంఠమునకు, నాభరణ మయ్యె బ్రహ్మాదు లభినుతింప 70

వ అప్పు డప్పరమేశ్వరు నిట్లని స్తుతియించిరి 71

సీ. జయ విరూపాక్ష! యీశ్వర! దివ్యలోచన!, జయ వజ్రహస్త! దివానివాస!
జయ పినాకేష్వాస! శాశ్వత! నిత్య! య,నిత్య! నిత్యానిత్య! నిరుపమాన!

జయ చింత్య! జయ రుద్ర! జయమహాదేవ! య,చింత్య! చింత్యాచింత్య! చిత్స్వరూప!
జయ పాదభక్తార్తిసంహారకారణ!, జయ ముకుందప్రియ! జయ గిరీశ!
గీ. దివసమాసార్ధమాససద్విశ్వరూప! కల్పయుగవత్సరాధీనకాలఖేట
రుండ! బహురూప! చండీశ! దండపాణి!, జయ నమస్తే నమస్తే ప్రసన్నమూర్తి! 72

వ. అని యనేకప్రకారంబులం బ్రస్తుతించి నీలకంఠుం డనునామధేయంబు శివుని కిచ్చి రిది
కాలకూటోత్పత్తిప్రకారంబు. 73

ఉ. హాలహలాగ్ని దాహభయ మస్తమితం బయినం గడంకమై
వేలుపులు న్నిశాచరులు వెండియుఁ గవ్వపుఁగొండ వార్ధిలోఁ
దేలిచి గుమ్ముగుమ్మనఁగఁ ద్రిప్పఁగఁ జొచ్చిరి దానవేశ్వరుల్
వారిసహాయుఁ గాఁ గొని యవక్రభుజాబలవిక్రమంబునన్ 74

క. తరిగొండఁ దరువఁదరువన్, శరనిధిమధ్యమున నొక్కజలజము పుట్టెన్
బరిమళపరంపరలచే, సురభీకృత మయ్యె జగము సురుచిరభంగిన్ 75

వ అయ్యష్టదళపద్మమునందు. 76

సీ. ఇరుప్రక్కియలనుండిసురసింధురంబులు, పరిపూర్ణ హేమకుంభములు దాల్ప
నందంద నవనిధానాధిదేవతలును, సారది బంగారుపీఁపు లిడఁగ
జయజయధ్వనులతో సర్వదేవతలును, గేలుఁదమ్ములు మౌళిఁ గీలుకొల్పఁ
బుష్పవర్షములకుఁ బ్రోదియై వినువీథి, దేవదుందుభినాద మావహిల్లఁ
గీ. బ్రబలి మున్నీటినడునీటఁ బాండువికచ, కమలకాంచనకర్ణికాగ్రంబునందు
బ్రహ్మాదిదిక్పాలవందితపాదపద్మ, పద్మ యుదయించెఁ గన్నులపండు వగుచు. 77

గీ. పవడములఁ బోలుశ్రీహస్తపల్లవములు, దనరశోభిల్లుహేమపద్మము ధరించి
కలిమిచూపులపూఁబోఁడి కలశజలధి, నర్థిఁ గొలువుండె రత్నసింహాసనమున. 78

క. జలరుహవాసిని పుట్టిన, కలితముహూర్తమున రెండుగడియలమాత్రం
జలిగురికాఁడై నిగనిగ, కలువలచెలికాఁడు పుట్టెఁ గలశపయోధిన్. 79

వ. తదనంతరంబ. 80

క. అందంద యుద్భవించెను, సందరమున నిందిరానుసంజాతములై
మందారకల్పతరుహరి, చందనసంతానపారిజాతాదు లొగిన్. 81

ఉ. అంతఁ బయోనిధానమునయం దుదయించె సరోజవాసినీ
కాంతకుఁ దోడఁబుట్టు వనఁగాఁ గరపద్మమునం జలూకికా
సంతతియున్ హరీతకియు సాధనసంగ్రహమై తలిర్ప ధ
న్వంతరి యొట్టిరోగములవారికి నామయసౌఖ్యకారియై. 82

గీ ఆదివైద్యుఁ డతండు దుగ్ధాబ్ధిఁ బుట్టె, నమృతపూర్ణకుంభం బొకహస్తమునను

నంబుచరమును గరకకాయయును నొకటఁ, దాల్చి సాకార మైనశాంతమయుఁ డనఁగ.

వ. మఱియును. 84

క. అచ్చపువెన్నెలచాయల, మెచ్చనితనుదీప్తితోడ మేఘధ్వనిపెం
పచ్చుపడఁగ సకిలించుచు, నుచ్చైశ్శ్రవ ముదధినడుమ నుదయంబయ్యెన్. 85

గీ. క్షీరవారాశిలో నవతారమయ్యెఁ, దార యనుకన్యకయు నతిధవళనయన
తారకారాజబింబావదాతవదన, తారహారాదిభూషణోత్కరముతోడ. 86

శా. అయ్యంభోనిధివారిగర్భమునయం దైరావణం బుద్భవం
బయ్యెం గండతలంబునన్ దొరఁగుదానాంభఃప్రవాహంబు లెం
దొయ్యొయ్యన్ బ్రభవించి తజ్జలధినీ రుబ్బింప దిక్సింధుల
న్వియ్యం బందఁ గఠోరగర్జితమహానిర్ఘాతనిర్ఘోషముల్. 87

సీ. మధుకరంబులు పుట్టె మధుకరంబులు గావు, రమణీయవేణీభరములు గాని
శశిబింబములు పుట్టె శశిబింబములు గావు, మహితవక్త్రేందుబింబములు గాని
మెఱుఁగుఁదీఁగలు పుట్టె మెఱుఁగుదీఁగలు గావు, లలితకోమలతనూలతలు గాని
చక్రవాకులు పుట్టెఁ జక్రవాకులు గావు, కఠినంబు లగుచన్నుఁగవలు గాని

గీ. యనఁగ మందరకందరవ్యాప్తిచలిత, వార్ధికల్లోలవీచికావర్తతతుల
నుద్భవిల్లిరి రంభాతిలోత్తమాదు, లప్సరస్స్త్రీలు దేవవేశ్యాజనములు. 88

క. తిరిగొండఁ దరువఁదరువం, దిరుగుడువడునుదధిలోనఁ దీవ్రముగా ది
ర్దిరఁ దిరుగుచుఁ దరఁగలవడిఁ, దరతరమ సుపర్వసురభి దరికిం జేరెన్. 89

ఉ. అంత న్విద్రుమవల్లరీకిసలయవ్యాప్తైకశంకావహా
త్యంతస్వచ్ఛరుచిచ్ఛటల్ జలధిపై నందంద వర్తింపఁగా
స్వాంతాశాంతరభూమిభాగమున విశ్వంబుం బ్రకాశింపఁగాఁ
జింతారత్నశలాక పుట్టెను మహాక్షీరాబ్ధిమధ్యంబునన్. 90

గీ. తరువఁ దరువంగ వార్ధిమధ్యంబునందు, నాగవల్లీలతాప్రతానంబు పుట్టె
నమృతసంసర్గమునఁగదా యాఱునెలలు, జరగు నేయాకునకు లేనిసరసవృత్తి. 91

క. శీతలపరిమళధారా, పాతపవిత్రాయమానపవమానం బై
యాతోయధిమధ్యంబున, శ్రీతులసీవనము పుట్టె శ్రీయంశమునన్. 92

గీ. కలిగె దివ్యౌషధీలతావలులశక్తిఁ, బాలమున్నీటినీటిలోఁ బ్రథితలీల
విమలగారుడమాణిక్యవిభ్రమంబు, లభినవంబులు హరితదూర్వాంకురములు. 93

వ. ఇట్లు మహార్ణవజాతంబు లగుపదార్థజాతంబులం గనుంగొని బ్రహ్మాదిదేవతలు హరునకు శశాంకుని హరికి లక్ష్మి నింద్రునకు నైరావణోచ్చైశ్శ్రవంబులను నిచ్చిరి. అప్సరసల నాకంబున నుండ నియమించిరి. కామధేనువును వరుణున కొప్పనంబు సేసిరి. కల్ప

తరుచింతామణుల నందనోద్యానంబునం బ్రతిష్ఠించిరి. దూర్వాంకురంబులు హారం
బున కవతంసంబుగా నొసంగిరి నాగవల్లీదళంబులు భోగార్థంబుగా భూజనంబుల
కిడిరి. శ్రీతులసీకాననంబును సకలతీర్థంబులకు సమాశ్రయంబుఁ గావించిరి. యనంత
రంబ మందరంబును యథాస్థానంబునం బెట్టి వాసుకిం బాతాళంబున కనిచి కమఠ
పతిం గుస్తరించి నివాసంబులకుం బోవ నుద్యోగించి యున్నంత 94

ఉ. అంధకకాలకేయమహిషాదులు దైత్యులు బాహుశైలద
ర్పాంధులు గూడి యొక్కుమ్మడి మైపడి దొమ్మి యొనర్చి వైద్యుని
ర్బంధము సేసి కైకొనిరి గ్రక్కునఁ దన్మహనీయదక్షిణ
స్కంధముమీఁద నున్నమణికమ్రసుధారసహేమకుంభమున్. 95

గీ అమృతకుంభంబు గైకొని యసురవరులు, వేఱ యొకచోట వేలంబు విడిచియుండి
రమరులకు నీక యప్పదార్థముఁ గపంగి, తార విభజించి భుజియించువారుఁ బోలె.

వ. అవ్విధం బెఱింగి హరవిరించులు విష్ణు రావించి గోత్రకలహంబుమాన్ప నిఖిలమాయో
పాయ విద్యావిదుండవగు నీవ యెఱుంగుదు మాకు నిం కిక్కడ నుండం బని లేదు
పోయి వచ్చెద మని యామంత్రణంబు సేసి నిజస్థానంబుల కరిగినయనంతరంబ. 97

గీ. కైటభారాతి యక్కార్యగతికిఁ దగిన, యనువు చింతించి యసురుల నవమతింప
సురల కమృతంబు నొప్పింప వెరవు దెలిసి, యరిగెనంతర్హితుం డయి యద్భుతముగ.

వ. ఇవ్విధంబున హరి యంతర్ధానంబు చేసినముహూర్తమాత్రంబున 99

శా ఆకాశంబుననుండి డిగ్గె నొకనీలాంభోజపత్రాక్షి ది
వ్యాకారంబును దివ్యమాల్యములు దివ్యాలంకృతు ల్దివ్యవ
స్త్రాకల్పంబులు దివ్యగంధములు నాహావుట్టఁ జేయంగ నా
కాకశ్రేణికి దైత్యపఙ్క్తికిని విద్యుల్లేఖచందంబునన్. 100

క. బృందారకపథమున డిగి, యిందీవరపత్త్రనేత్ర యిరువంకలవా
రుం దమకతమక యిటు రా, యిం దనఁగా రెండువీళ్ళయెడమున విడిసెన్. 101

వ. నిలిచి హావభావవిలాసంబులన దేవాసురులం భ్రమియింపం జేయుచు స్కంధావార
మధ్యంబున. 102

సీ. పాకశాసనునకుఁ బరిహాసవచనంబుఁ, గాలకేయునకు శృంగారలీల
వైవస్వతునకు భ్రూవల్లరీనటనంబు, కరటిదానవునకుఁ గలికిచూపు
పాశపాణికిఁ గుచప్రాంతోరుదర్శనం, బంధకాసురునకు నలఁతినగవు
ధననాయకునకు నుత్కంఠాతిశేషంబు, మహిషునకును నర్మమర్మకలన

గీ. గంధవహునకు సిగ్గు జలంధరునకుఁ, గలికితనము బావకునకుఁ గౌను బలికి
వలపు నటియించుచును వారవార తనకుఁ, దాన వారికి వారికి నైనయట్లు. 103

గీ. అందఱను భ్రమపెట్టుచు నవ్వధూటి, యెవ్వరికిఁ దాను భ్రమయక యెడన యుండె
దానిపై వాలి చొక్క నందఱమనములు, గంధఫలిమీఁద వాలుభృంగములపగిది. 104

గీ. అసురులకు దేవతలకు నయ్యవసరమునఁ, బాలుపోకుండె నప్పు డప్పద్మనయన
యుభయవాదులు గూడి యయ్యుత్పలాక్షి, పాదపంకజములకును బట్టులైరి. 105

వ. మఱియు విష్ణుమాయావిశేషంబున. 106

క. ఇది చెప్పినట్ల చేయుదు, మిది పంచినయట్ల నడతు మిది కళ్యాణా
భ్యుదయనిధానము మా కని, హృదయంబులఁ దలఁచు చుండి రిరుదెసవారల్. 107

గీ. కనకసింహాసనము వెట్టి కాళ్లు గడిగి, పాదతీర్థంబు లౌగిఁ ద్రావి ప్రణతిసేసి
కొలిచి కూర్చుండి రిరువంకకొలమువారు, భువనమోహిని యైనయప్పువ్వుఁబోఁడి.

క. ఎవ్వనివంకఁ గనుంగొను, నవ్వనితామణివిలోచనాంచలమున వాఁ
డవ్వేళనఁ గిలించు, న్మవ్వం బగుకేలుదోయి మకుటాగ్రమునన్. 109

వ. వైరాగ్యానుబంధంబు లుడిగి యియ్యిరువాగువారుం దమలోన నిట్లనిరి 110

క. మన మొండొరు నమ్మక యెడ, ననిచినయీయమృత మింతయును దగ నింకే
మని యొండుగాఁ దలఁప కీ, వనితామణి పంచిపెట్ట వలయుం జుండీ 111

వ. అని యమృతకలశంబుఁ దెచ్చి యప్పయోజాక్షిచేతి కిచ్చి ధర్మంబు పుణ్యంబు పాపంబు
నీయది యిరుదెఱంగులవారు నీకు నొక్కరూప యిప్పదార్థంబు మాకుం బంచిపెట్టుము.

గీ. తప్ప కుండఁగఁ బక్షపాతంబు లేక, పంచిపెట్టెదువా రబ్బరంబుఁ గాక
యన్నదమ్ముల మై యుండి యకట మేము, నిన్ను వడ్డించు మందుమె యన్నుమిన్న

గీ. అనిన నేనేర్తు నయ్య మీయంతవారు, కోరి కూర్చుండ నమృతంబుఁ గుడువఁబెట్టఁ
బంచి వడ్డింపనేర్పు టల్పంపుఁబనియె, తొల్లి యొకనాఁ డెఱింగినతోవ గాదు. 114

వ. అయిన మీవచనంబులు చెఱపంజాల నానేర్చినవిధంబున సుధారసంబు వడ్డించెద మీ
రందఱుఁ గృతస్నానులై పయోధిపులినవేదికాస్థలంబున నిరుదెఱంగులవారును రెండు
బంతులుగాఁ గూర్చుండుఁ డని నియోగించిన. 115

గీ. వార లట్లచేసి వరుసగాఁ గూర్చుండి, పసిఁడిపళ్లెరములు పన్నికొనఁగ
నల్లనల్ల వచ్చె నలసయానంబున, నమృతకుంభహస్త యగుచుఁ దరుణి. 116

మ. అరవిందాసన పట్టుఁబుట్టముచెఱం గాందోళనం బొంద ని
ర్భరపీనస్తనభార మల్లఁ గదలన్ రత్నాలతాటంకము
ల్మెరయ న్నూపురమేఖలావలయముల్ మ్రోయంగ పాత్రంబుల
న్సురధేన్వాజ్యము త్రస్తరింపఁ దొడఁగె న్దూర్వాంకురాగ్రంబునన్. 117

స్నానపవిత్రగాత్రులును చందనచర్చితబాహుమధ్యముల్
ధ్యానసమాధినిష్ఠులును మత్సరచిత్తులు నై మహాసమా

ధానముతోడ నుత్తరము దక్షిణము న్నముపాశ్రయించి యు
ద్దానవులు స్సుపర్వులును దన్నుఁ బ్రియంబుగఁ జూచు చుండఁగన్. 118

గీ. మధురగోక్షీరధారాసమాన మైన, మంచియమృతంబు వెట్టె వైమానికులకు
మగువ మృగతృష్ణికాంభస్సమాన మైన, కల్లయమృతంబు వడ్డించెఁ గర్బురులకు. 119

వ. ఇవ్విధంబున నప్పరమాణుమధ్య తథ్యమిథ్యామృతాహారంబు లాసురాసురులకు వెట్టి కాఁచుదుగ్ధమఘృతధారాభిఘారంబుగావించి పంక్తిమధ్యంబుననిలిచి కంకణఝణఝణత్కారంబు తోరంబుగా నాపోశనంబు వోసి యారగింపుండు ప్రొద్దుపోయె ననుచు నెలుఁగెత్తి మత్తకోకిలకంఠకుహూపంచమస్వరంబునం బల్కిన. 120

గీ. మొదలఁ దేనియలుట్టునంభోరుహాక్షి, ముద్దుఁబల్కులు శ్రుతిపుటంబుల భుజించి
పిదప భుజియింపఁ దొడఁగిరి త్రిదశవరులు, దైత్యులును దథ్యమిథ్యాసుధారసములు.

క. కిక్కురుమన కమృతంబుం, గ్రుక్కలువెట్టుదురు సురలు కోణపముఖ్యుల్
తక్కరిసుధారసంబులు, గ్రుక్కలువెట్టుదురు వారిఁ గూడియె తారున్ 122

గీ. గ్రుక్కగ్రుక్కకుఁ గడుఁ దేజ మెక్కుచుండె
నమరులకు గ్రుక్కగ్రుక్కకు నడఁగుచుండె
దైత్యులకుఁ దేజ మట్టివిధంబు గాక
రాహుకేతువు లనియెడురాత్రిచరులు 123

వ తమయెదిరిపంక్తి నున్నచంద్రార్కులసంగడి న్మెలంగి కూర్చుండిన నాగ్రహారాజు లిద్దఱుం దమలోన నిట్లని విచారించిరి. 124

ఉ. పంచన వేల్పుటెంకికిటువచ్చి యుపాంతమునందు ముంగటం
గంచముఁ బెట్టుకొన్నయది కర్బురయుగ్మము మాఱువెట్టనే
తెంచుచు నున్నవాఁడు మనదేవర విష్ణుఁడు వెంట వీరి నూ
ఱించుట మే లృధారసము చిప్పెఁడుపోయకమున్న శౌరికిన్. 125

గీ. అని విచారించి చెప్ప నున్నంతలోనఁ, బోసె నియగంచములయందుఁ బుడిసెఁడంత
త్రావియును ద్రావకుండఁగ రాహుకేతు, లనుచుఁ జెప్పిరి మురవైరి కర్కవిధులు. 126

మ. అటు విన్నప్పుడ తత్సుధారసము కంఠాధగ్రప్రదేశంబు సా
చ్చుట లేకుండఁగ రాహుకేతువుల యత్యుద్రోత్తమాంగంబు లా
క్కట ఖండించెను మాయపుంబడఁతియాకారంబు వీడ్కొకి య
క్కటకాలంకృతహస్తచక్రమున శ్రీకాంతుం డవిభ్రాంతుఁ డై. 127

క. రాహునకుఁ గేతునకు హరి, బాహాచక్రమున నదరు పాటిల్లుటయుఁగ్
హాహానినాదపటుకో, లాహలబహుళంబుగాఁ గలంగిరి దివిజుల్. 128

సీ. వేగ మాయావధూవేషంబు డిగఁద్రావి, కైకొనె నిజమూర్తి కైటభారి
హరి తమ్ము వంచించె సరివేళ గాదని, దైత్యులు చనిరి పాతాళమునకు
నమృతంబు భుజియించి యమృతకుంభముఁ గొంచు, జనిరి వేల్పులు నిజస్థానమునకు
బహువారములయందు బహువస్తువులు గాంచి, కలశపాథోరాశి కాను పుడిగె
గీ. నుక్కువడి యున్కిమాని పెల్లుబ్బె నాక, మప్సరగకామినీతురంగాదికముల
నచ్యుతుఁడు లచ్చి నటఁ బెండ్లియాడి యరిగె, నాగరిపు నెక్కి వైకుంఠనగరమునకు
క. ఈవార్ధిమథనకథనం, బేవారు పఠించిరేని నెలమియు నాయు
శ్శ్రీవృద్ధులఁ గాంతురు వి, ద్యావత్తయు యశము గల్గు నావారలకున్. 130

ఆశ్వాసాంతము.

శా. శంకాతంకవిహీనవిక్రమకలాసాకల్యవిజ్ఞాన ! సా
హంకారోరువివేకవిక్రమ ! సురాహారాహిపస్పర్ధిని
స్సంకాశోజ్జ్వలకీర్తివిభ్రమ ! మహీసంకల్పకల్పద్రుమా !
లంకాశంకరశైలమధ్యవసుధాలంకార భవ్యక్రమా ! 131

క. శరణాగతధీపంజర !, నరకుంజర ! దానకర్ణ ! నందితవిద్వ
ద్వరవర్ణ ! విమలచరిత, స్ఫురితా ! యనవరతశంభుపూజానిరతా !. 132

ఉపేంద్రవజ్రము. కులప్రదీపా ! యలఘుప్రతాపా !
విలాసశక్రా ! జితవీరచక్రా !
కలాజయంతా ! ఘనకాంతికాంతా !
నిలీనశంకా ! నిజనిష్కలంకా ! 133

గద్య. ఇది శ్రీమత్కమలనాభపౌత్త్ర మారయామాత్యపుత్త్రి వినయవిధేయ
శ్రీనాథ నామధేయప్రణీతం బయినహరవిలాసం
బను మహాప్రబంధంబునందు
షష్ఠాశ్వాసము.

శ్రీరస్తు.

హరవిలాసము

సప్తమాశ్వాసము.

శ్రీకాళహస్తినాథ
ప్రాకారాంతఃప్రణీతపాతాళగుహా!
శ్రీకాళహస్తిభక్తసు
ధీకల్పితవిభవ యవచిదేవయతిప్పా! 1

వ. ఆకర్ణింపుము. 2

ఉ. అర్జునుఁ డింద్రనీలగిరియందు రసాలతమాలతాలనీ
పార్జునలోధ్రతిందుకనవామలకీవనసామ్రపాటలీ
సర్జకురంటకాదిగురుచందనచందననింబకేతకీ
భూర్జకపిత్థపూర్ణముఖభూరుహపుణ్యతమాశ్రమంబునన్. 3

క. ద్యూతపరాభవమున నగు, చేతోదుఃఖమునఁ దపము చేయఁగఁ దొడఁగెన్
భ్రాతలయనుమతి శత్రు, వ్రాతజయార్థంబు మది దివస్పతి గురిగాన్. 4

మ. ధనురస్త్రంబులు కేలఁ దాల్చి శరధిద్వంద్వంబు నేపార వీఁ
పున బంధించి కిరీటియై కవచియై పూనెం దపశ్చర్య య
ర్జునుఁ డత్యంతగరిష్ఠనిష్ఠ నమరేంద్రుం గూర్చి యయ్యింద్రకీ
లనగాగ్రంబునఁ బ్రత్యనీకవిజయశ్లాఘాభిలాషంబునన్ 5

క. వంచన మనంబులోన నొ, కించుకయును లేక యున్మహీంద్రముమీఁదన్
బంచానలమధ్యంబునఁ, బాంచాలీవల్లభుఁడు తపం బొనరించెన్. 6

గీ. గాండివముతోడ నొకయోగదండయష్టి, యస్త్రములతోడఁ గొన్నిదర్భాంకురములు
కలపములతోడఁ బుండరీకంబుతోలు, దాల్చి క్రీడి విరుద్ధపుఁదపము చేసె. 7

శా. శాకాహారుఁడు నిర్జితేంద్రియుఁడు పాషాణాగ్రతల్పుండునై
నాకేశప్రియనందనుండు సలిపె న్నానాప్రకారంబులన్
నాఘుంజిత్తము దేహము న్సరియొకా నానాతపశ్చర్యలన్
వ్యాకీర్ణోరగసింహభల్లుకలులాయాభీలశైలాటవిన్. 8

సీ. పతయాళునిర్ఝరాంభఃప్రవాహంబుల, నఘమర్షణస్నాన మాచరించుఁ
గొండగోఁగుంబూల గుండవర్ధనముల, నర్చించు శశిలాంఛనార్ధమౌళి
స్ఫటికాక్షమాలికాపాణిప్రవాళుఁడై, జంభారిమంత్రంబు జపము చేయు
నొంటికాల బుజంబు నూర్ధ్వంబుగాఁ జాఁచి, తడవుగా నిలుచుండి తపమొనర్చు
గీ. శరభశార్దూలసింహాదిసత్త్వచయము, కెరలి తనమీఁద బిట్టు లంఘించునపుడు
కడిమిఁ జెండాడు భుజదండగాండివోగ్ర, చండతరశాతనిర్ఘాతకాండవితతి 9

గీ. వీరరసగర్భితం బయ్యు విస్తరిల్లె, శాంతరస మెంతయును సవ్యసాచియందు
మలయశైలనితంబమండలమునందు, సర్పవేష్టితచందనక్ష్మాజమట్లు. 10

వ. ఇవ్విధంబునఁ గపికేతనుండు గాండివజ్యాఘాతరేఖాకిణకళంకాలంకారంబు లగుకరం
బులు నీవారపాకంబునకును బాంచాలకన్యకాకుచకుంభకుంకుమప్రేక్షణీయం బైన
వక్షంబు రుద్రాక్షధారణంబునకును నంగారపర్ణగర్భనిర్భేదనచణహుంకారకారణం బగు
కంఠంబు మహేంద్రదేవతామంత్రాక్షరధారణంబునకును ఖాండవదహనవేళావిజృంభితా
వష్టంభసంరంభం బగుహృదయాంభోరుహంబు ప్రణవోపలంభమునకును గుంభసంభవ
ప్రదిష్టశాఖాశిఖరపక్షిలక్ష్యావలోకనజాగరూకం బగువీక్షణంబులు నాసికాప్రదేశాను
సంధానంబునకును యంత్రమత్స్యవిభేదనోపాయసందర్శనప్రభావసంసిద్ధి యగుబుద్ధి
వృద్ధోపసేవనమునకును గంగాజలనిగ్రహానుగ్రహోపాదనసమగ్రం బగుమానసోత్సాహం
బింద్రియభంగంబునకును నుత్తరదిగ్విజయయాత్రాధురీణంబు లగుచరణంబులు తీర్థగమ
నంబులకును బాల్పడఁ జేసి జగజెట్టిబిరుదంబు నెట్టుకొనం జేసి తండ్రిఁ గుఱించి తపం
బుఁ జేయుచుండ దినంబులు గడచె వారంబు లరిగెఁ బక్షంబులు సనియె మాసంబులు
వోయె ఋతువు లతిక్రమించె సంవత్సరంబు దాఁటె నయ్యవసరంబున 11

సీ తెల్లనిగడ్డంబు తెల్లనిమీసము, ల్నరసినరోమపాండురశిరంబు
మేధావిబొట్టును మెఱుఁగుజన్నిదములు, భూతిలలాటత్రిపుండ్రకంబుఁ
గావిదోవతియును గంటోత్తరీయంబు, నిష్టికోలయుఁ జంక నిఱ్ఱితోలుఁ
బంచాంగముష్టియుఁ బాణిఁ బవిత్రంబు, నొక్కవ్రేలికి వెండియుంగరంబు
గీ. జాఱుబొజ్జయు నునుదబ్బసంబెలయును, జెత్తగొడుగును జక్కఁదాల్చి కుతుకమునఁ
దనకు సజ్జాతిగా నొక్కతపసి వృద్ధ, బ్రాహ్మణుఁడు వచ్చె నొయ్యొయ్యఁ బార్థుకడకు

వ. వచ్చి యాశీర్వదించి మహాత్మా నీసంగడంబునఁ దపంబు చేయవచ్చితి నిచ్చోఁ గొన్ని
దినంబులు క్రూరజంతువులు నన్ను బాధింపకుండ నరసికొని యుండవలయు నని పల్కి
యతనిముందటఁ బరిశ్రాంతుఁడుంబోలెఁ జతికిలంబడి కూర్చుండి. 13

గీ మోఱకునిచందమున నీఱుశౌఱుచూపు, పాండవేయునిపైఁ దార్చి బ్రాహ్మణుండు
పలికె నిప్పచ్చరం బైనబొంణములఁ, బరమనాస్తికభావంబు పరిమళింప 14

గీ. అన్న! యెవ్వరివాఁడ వీయడవిలోనఁ, దపము సేసెదు నీమంత్రతంత్రపదులు
పాకశాసనదేవతాప్రార్థనాసు, సూచకము లైనయవి యన్ని చూడ నిపుడు. 15

ఉ. చక్కనివాఁడ వెంతయును జల్లనివాఁడవు భాగ్యరేఖఁ బెం
పెక్కినవాఁడ వీవిపిన మెక్కడ నీసుకుమారతాగుణం
బెక్కడ ఘోరవీరతప మీయెలప్రాయమునందుఁ జేయునే
యక్కట యెవ్వఁ డైన నకృతాత్ముఁడ వీ వొకరుండు దక్కఁగన్. 16

క. శరచాపధారణంబున్, బరమమనశ్శాంతి దాంతిపరిపాకంబున్
బరికింపఁ 'జంకదుడ్డును, శరణార్థియు' ననెడువట్టిచందము దోఁచెన్. 17

క. వైరిమదకుంభకుంభవి, దారణదారుణకృపాణధారలు పరిఘా
కారములు కందమూలో, ద్ధారములకుఁ బాలుపడెఁ గదా నీకరముల్. 18

శా. ఈభద్రాకృతి యిమ్మహాభుజయుగం బీదీర్ఘకోదండ మీ
యాభీలత్వ మొకం డొకొండ భువనైకాధ్యక్షతా హేతువే
లాభం బాత్మఁ దలంచి చేసె దొకొ గోలాంగూలభల్లూకమ
త్తేభాకీర్ణవనాంతరంబునఁ దపం బేకాగ్రభావంబునన్. 19

గీ ఈశ్వరునిఁ గూర్చి చేసెద వేని లెస్స, మాధవునిఁ గూర్చి చేసిన మాను హితవు
బ్రహ్మఁ గూర్చి చేసిన నది పరమతరము, తగు నె యిలవజ్రధరుఁ గూర్చి తపము సేయ.

గీ ఎవ్వఁ డుపదేశ మొనరించె నింద్రుఁ గూర్చి, తపముసేయుము నీ వంచు దయ దలిర్ప
నాతఁ డెఱుఁగఁడు గాక యాయద్రిభేది, గౌతమునియింటఁ జేసినకారుగోష్ఠి. 21

సీ. ఆసహస్రాక్షునియాత్మసంశుద్ధికిఁ, బరమసంయమి యింటిపంచ సాక్షి
యానిర్జితేంద్రబాహావిక్రమమునకు, భుజగాంతకునియాకపోక సాక్షి
యాసునాసీరునహంకారగరిమకు, నిషధాచలము మీఁది నిలవు సాక్షి
యాశచీవల్లభు నౌచిత్యకలనకుఁ, దాపసుచేతిపూదండ సాక్షి

గీ. యిట్టిదేవేంద్రువలన నీ వేమి ఫలము, వడసెదవు చాలు నీవాంఛ పాడుగాను
వాఁడు నీకంటె నేమిట వాసి గలఁడు, తగదు చాలింపు మీవిరుద్ధంపుఁదపము. 22

వ. అని యెంత చెప్పిన నత్యంతధీరోదాత్తుం డగుపాండుపుత్త్రుం దూరక తపంబు చేయు చుండె నట్టియేకాగ్రభావంబునకుం బ్రియుం బొంది వృద్ధబ్రాహ్మణవేషంబు మాని వృద్ధశ్రవుండు ప్రత్యక్షం బై వరంబు వేఁడు మనుటయు. 23

క. కురుభీష్మకర్ణసైంధవ, కురుతనయులతోడఁ గూడఁ గురుపతిబలము
న్వరిమార్చునట్టిసత్త్వముఁ, బురుహూతా యిమ్ము కరుణ బొంపిరివోవన్. 24

వ. అనిన నింద్రుండు సవ్యసాచి కి ట్లనియె. 25

గీ. భీష్మగురుకర్ణకృపు లనిర్భేద్యబలులు, ద్రోణిభూరిశ్రవోభగదత్తశల్య
సైంధవులు పేరు గలవారు సమరజయము, శంభుకృప లేక యెబ్భంగి సంభవించు. 26

వ. పశుపతిఁ గుఱించి తపంబు సేయుము తత్ప్రసాదంబున నీకుం జయం బయ్యెడుఁ
బునర్దర్శనంబు గాఁగలయది పోయి వచ్చెద నని యింద్రుం డంతర్ధానంబు చేసె. 27

గీ. తండ్రి చెప్పినమాటలు దప్ప కప్ప, నాదరించి ధనంజయుం డభవుఁ గూర్చి
యింద్రకీలాచలంబుపై నేకనిష్ఠ, ధీరుఁ డొనరించె నతిఘోరవీరతపము. 28

మ. భసితోద్ధూళితనిర్మలావయవుఁడు స్వంచాక్షరీసంతతా
భ్యసనవ్యాప్తిపరాయణుండును శివధ్యానానుసంధాత యుక్
మసృణస్నిగ్ధతరక్షురప్రమయకంధాభద్రపీఠుండు నై
యసమస్థేమఁ గిరీటి పాశుపతదీక్షారంభముం గైకొనెన్ 29

సీ. ప్రథమసంధ్యారాగపరిపాటి మిన్నేటి, కనకపంకజకోరకములు దెలుపఁ
గందువాఱినమించుగచ్చుటద్దమువోలె, విధుమండలము కాంతి వీడుకొనఁగ
దర మైనవేఁబోకఁ దఱపి వెన్నెలఁ గ్రోలి, దివిఁ జకోరములు మత్తిల్లి యాడ
మందరాచలకూటమధ్యభాగమ్మునఁ, గృత్తికానక్షత్ర మత్తమిల్ల
గీ. మృదులభస్మరచితశయ్య మేలుకాంచి, యమలరుద్రాక్షధారణం బాచరించి
యర్జునుఁడు పర్ణశాలికాభ్యంతరమున, హరున కొనరించు నరుణోదయార్చనంబు. 30

క. కపికేతుఁ డింద్రకీలా, ప్రపాతపతయాళునిర్ఝరస్నాతుం డై
యుపచారవిధుల నన్నిటఁ, దపనోదయవేళ వ్యాళధరుఁ బూజించున్. 31

మ. అవధానంబునఁ బాకశాసనసుతుం డర్ధేందుకోటీరు సం
గవకాలంబునఁ బూజసేయు హిమవాఃకర్పూరకస్తూరికా
ద్రవకాలాగరుగంధసారసురభిద్రవ్యంబులం బూవుల
న్నవలీసర్జరసాగురుప్రముఖనానాధూపధూమంబులన్. 32

శా. పంచబ్రహ్మషడంగబీజసహితప్రాసాదపంచాక్షరీ
చంచన్మంత్రపరంపరాపరమనిష్ఠాతత్పరత్వంబునన్
మంచుంగొండయనుంగుఁబెండ్లికొడుకు న్మధ్యాహ్నకాలంబు సే
వించు న్నిర్జరరాజసూనుఁడు మనోవీథి న్సదానందుఁడై. 33

శా. ఆయావ్రాజినఖండమధ్యమున సేవాబద్ధపద్మాసనుం
డాయింద్రాత్మజుఁ డింద్రకీలశిఖరీంద్రారూఢబిల్వద్రుమ
చ్ఛాయానిర్మలచంద్రకాంతమణిపాషాణప్రదేశంబున
సాయంకాలము పూజ సేయు నభవు న్సంధ్యానటుం ధూర్జటిన్. 34

ఉ. అంచితభక్తితో శివుని నర్చనికాసమయంబునందు నే
వించు గురూపదేశపదవీపరిశుద్ధసమర్చనావిధిన్
గాంచనకోరకంబుల బికప్రసవంబులఁ గొండగోఁగులన్
గాంచనకందరాముఖగృహంబులఁ బార్థుఁడు సంస్కృతార్థుఁ డై 35

వ. ఇట్లు పాశుపతదీక్షాధురంధరుం డై కాలకంధరుం గుఱించి తపంబు సేయుచుండఁ గొం
డొకకాలంబునకు. 36

మ. ఒకనాఁ డింద్రతనూభవుండు గిరికూటోత్సంగభాగంబున
న్నికచానేకలతాతరుప్రతతులన్ దేవార్చనాపుష్పకో
రకము ల్గోయుచు నుండఁగా వినఁబడెన్ శ్రవ్యంబు లై కుర్కుర
ప్రకరోదంచితకంతకాశకుహలీబాబామహారావముల్. 37

గీ. చాయగోసులకంటెఁ గేసరులకంటెఁ, బులులకంటెను బిసరులై పొగరుమిగిలి
జల్లుకొని వచ్చెఁ బైపై నిసారమేయ, యూథములు వేదమయమూర్తు లుద్ధతముగ 38

గీ. ప్రకటలీల నుదాత్తంపుఫణితిఁ గొన్ని
క్రమములో ననుదాత్తస్వరములఁ గొన్ని
స్వరితములఁ బ్రచయంబుల వరుసఁ గొన్ని
ఘోషణము సేయఁ దొడఁగె నాకుర్కురములు 39

క. కనకపుశృంఖలలఁ ద్రయీ, శునకంబులఁ బట్టుకొనఁగ నూరెలఁ బ్రమథుల్
తను నిరుచక్కియ లీలా, వనచరులై కొలువఁ గపటవైహారికుఁ డై. 40

సీ. వికటపాటలజటామకుటికాభారంబు, కఱకైనజుంజుఱు నెఱులు గాఁగఁ
జారుసుధాధామశకలావతంసంబు, పెడకొప్పుపై నుండుపీఁకె గాఁగ
ఘనలలాటంబునఁ గనుపట్టుకనుచిచ్చు, గైరికద్రవతిలకంబు గాఁగఁ
భుజమధ్యమునఁ గ్రాలుభుజగహారంబులు, గురిజపూసలగుబ్బసరులు గాఁగ

గీ. శంకరుండు గిరాతవేషంబు దాల్చి, యగజ చెంచెత యై తోడ నరుగుదేఱఁ
బాణి నోంకారదివ్యచాపము ధరించి, వచ్చె వివ్వచ్చువరతపోవనముకడకు. 41

వ. అట్టిసమయంబున. 42

చ. జలధరనీలదేహమును జంద్రకలాయుగళీసమానదం
ష్ట్రిలు భిదురోపమానముఖసంపుటపోత్రము పుల్లమేచకో
త్పలదలవర్ణకర్ణములు చాటలువుత్తులలోచనంబులుం
గలిగి కఠోరకంఠఘనఘుర్ఘురఘుట్టనఘోషజన్మ మై. 43

ఉ. ముట్టియ నింద్రనీలతలమూలమహీధ్రభవంబు లైనపొ
న్నుట్టలు గ్రుచ్చి వైచుచును ఘోరవిపాతదముఁ జాఁపకట్టుగా

మట్టుచు ఘర్ఘరధ్వనుల మాటికిమాటికి దిక్పుటంబులం
ఘట్టన చేయుచు స్వేదకణమ్ముల నిప్పులు వెళ్లఁగ్రాయుచున్. 44

క. పంది వడిఁ బాఱుదెంచెఁ బు, రందరనందననిశాకరధరులనడుమన్
దందడి గొరిజలతాఁకునఁ, గందుకములువోలె శిలలు గరువాఱంగన్. 45

ఉ. ఏసెఁ బినాకచాపమున నీశుఁడు గాండివకార్ముకంబునన్
వాసవసూతి యాప్రబలవజ్రసమానము లైనబాణముల్
రాసెఁ బరస్పరంబును వరాహముప్రక్కలు గాడిపాఱి మూ
కాసురసూకరంబు దిరుగాడె వడి న్మరణాతివేదనన్. 46

క. అభవార్జునశరపాత, ప్రభవవ్యథఁ దిరిగె నవ్వరాహము కడు సం
క్షుభిత మయి విలయవేళా, నభస్వదుద్భ్రాంతఘనఘనాఘనముక్రియన్. 47

క. దీర్ఘతరహరనరాశుగ, నిర్ఘాతనిపాతజాతనిబిడవ్యథ నం
తర్ఘూర్ణమాన మగుచును, ఘుర్ఘురఘోషంబుతోడఁ గ్రోడము గూలెన్. 48

వ. అప్పుడు గిరాతవేషధారి యగుపురారి యోంకారచాపంబు నేల నిలువంబెట్టి తదీయ శిఖరంబున నఱచేయి మోపి యొరగి యొయ్యారంపునిలుకడ నిలిచి వలకేల వాలమ్ము ద్రిప్పుచుఁ గట్టెదుర నున్నజగజెట్టి యగునింద్రునిపట్టిం గనుంగొని ప్రావృషేణ్యపయోవాహగర్జాగంభీరం బైనస్వరంబున నింద్రకీలగిరిగహ్వరంబులు ప్రతిధ్వని యొసఁగ సాటోపంబుగా సగర్వంబుగా సావష్టంభంబుగా ని ట్లనియె. 49

గీ. ఎవ్వఁడవు రోరి నీవు నాయెదురఁ బాఱు, పంది నేసితి బాహుదర్పంబు మెఱసి
యెఱుఁగవుర యోరి నన్ను నీయింద్రకీల, పర్వతం బేలువనచరసార్వభౌము. 50

ఉ. ఏనును నాకుటుంబ మగుసీతరశాక్షియు వెంట వెళ్ళి యి
క్కాననభూమిలో బహుమృగంబులఁ జంపుచు వచ్చివచ్చి యే
నీనిశితాస్త్రపాతమున నిక్కిటిఁ జంపుదు నంచు వాక్ప్రతి
జ్ఞానియమంబున స్వనకజాడగఁ గూడఁగ వచ్చు చుండఁగన్. 51

క. వేఁట నలసి యీచెంచెత, యోటమివెట్టం గడంగి యున్నట్టియెడన్
గాఱెఱుకు గోఱవింటన్, జీటంబున వేడ్కయొల్లఁ జెఱచితి కదరా 52

గీ. తపసి వై యుండి తగు రోరి ధనువుఁ బట్ట, శాంతిపరులకు సేలరా సత్వహింస
కపటధారివి రత్యంతకల్మషాత్మ, యెవ్వఁడవు రోరి నాపంది సేయ నీవు. 53

క. మండెడుబలుసారసమున, గుండియ వగులంగ నేసి కూల్చితి దీనిన్
వెండి ప్రయోజన మేదీ, రండాసుత! దీనిపై శరము నిగుడింపన్. 54

ఉ. తబిసివి గానఁ జావునకుఁ దప్పితి నీ కిది వేఁటవంతమా
యబలుఁడ నీతెఱంగునఁ బరాటవికా[illegible]

నిబిడశరాహతం బగువనేచరజంతువు నేసి తీగతిన్
సబముపయి న్నిగుడ్చినిశాతశిలీముఖ మెట్టిదో. 55

వ. అనినం గిరీటి యయ్యాటవికచక్రవర్తి కి ట్లనియె. 56

క. పైవచ్చుక్రూరజంతువుఁ, జేవెరవున నేయ నెందు సిగ్గే చెపుమా
యీవక్రభాషణంబులు, నీ వాడెదు శబర పొమ్ము నీచను త్రోవన్. 57

క. పంది నపేక్షించితివో, పందెము గెలువంగ వేడ్క పడియెద వేదో
కందువుగా కాఫలము పు,ళిందాధిప యేమిటికిఁ బలికె దీభంగిన్. 58

మ. తడవే లోరి పుళిందరాజ! చను మధ్యాహ్నంబు డాయంగ న
య్యెడు నీవేళ శివార్చనంబునకు మా కేకాంతమై యుండఁగాఁ
బడు నీవుం గడు దప్పినాఁడ వటవీయం త్రిప్రకారంబులన్
విడు కోపం బిది శాంతి గైకొనుము వాగ్వివాద మిం తేటికిన్. 59

క జోటియు నీవును గుఱ్ఱుర, కోటియు ననుచరులు దప్పిగొన్నారు మహా
ధాటి పరిశ్రమమున ని, చ్చోట వసించెదర యేని సుఖముండఁ దగున్. 60

వ. అని యర్జునుండు పల్కిన నాగజ్జులాఁడు మోఱకంబున మొగి మడ్డంబు గదల్చి యీ
యొడ్డిమాటలం బనిలే దీపంది యొక ప్రయోజనంబె వేఁటపంతంబు దప్పి మమ్ము నధి
క్షేపించితి వీతప్పునకుఁ దపసివిగాన నిన్ను శిక్షింపను పొమ్మది యునుం గాక. 61

గీ. తాటియంతవిల్లు ధరియించినాఁడవు, జ్యాకిణాంకితము భుజాయుగంబు
గర్వరేఖ మిగులఁ గానంగ నయ్యెడు, దాంభికంబు నీదుతపసితనము. 62

శా. ఏమో నాహృదయంబు నిన్నుఁ గని యిట్లే చాపమం దాసమై
భామాసన్నిధి నుబ్బుచున్నయది నీబాహాప్రతాపంబు ని
స్సీమం బే నొకకొంతసే పిచట నుజ్జృంభించరాఁ జేయుమా
నామీఁద న్నిగుడింపుమా నిశితనానాక్రూరనారాచముల్. 63

క. చెం చని నన్నుం జూడకు, వంచింపకు హీనజాతివాఁ డని సంగ్రా
మాంచలమున నిదె నను మె, చ్చించెదవే నపుడు నిన్ను సేబాసందున్. 64

మ శివలింగార్చన మెందువోయెడుఁ దపస్విత్వమ్ము నెందే నుప
ద్రవమ్ముం బొందదులే యొకింతవడిలో ధ్యానానుసంధానముల్
వ్యవధానం బొకయింత సైఁచవొకో బాహావిక్రమశ్రీమహో
త్సవముం జూపుదుగాక నాయెదుర నాశ్చర్యం బవార్యంబుగన్. 65

గీ. ప్రదర మరివోయు మేయుము ప్రాక్పరికారం, కౌతుకాధీనహృదయుండఁ గాను నేను
శౌర కులపత్ని యైనయానీరజాక్షి, యాసపడుచుండు ఘోరశరాహవముల. 66

వ. అని పల్కి యాక్రీడాకిరాతుండు గుణధ్వని చేసిన జలధరధ్వానగంభీరం బై యాతెం
చునాభ్రాంతకు సిర్కు చూపినఁ గోపించుగంధద్విపంబుంబోలె రోషించి యర్జునుండు
గాండీవగుణగర్జాడంబరంబున నంబరంబు పిక్కటిల్ల నాటక్కరివిలుకానిపై భల్లం
బులు నిగుడించె. 67

శా. గాండీవప్రవిముక్తనిష్ఠురమహాకాండప్రకాండంబులన్
ఖండించె న్బ్రతిబాణఘట్టనమునం గందర్పవిద్వేషి యా
తం డాశ్చర్యము నొంది బాపురె పులిందశ్రేష్ఠ! యంచు న్భుజా
దండాహంకృతి వెండియుం బఱపె శాతక్రూరనారాచముల్ 68

శా. ప్రారంభం బొకయింత లేకను దృశాప్రాయంబున న్బొందఁగాఁ
గ్రూరాజిం దగనేసెనో నటికనో క్రొవ్వాఁడిఱంపంబుచే
నీరీతిం దునుమాడవచ్చునె యనన్ హేలాగతిం ద్రుంచె దు
ర్వారాహంకృతి నీశ్వరుండు విజయాస్త్రవ్రాతమున్ వ్రేల్మిడిన్. 69

క. శితికంఠుఁ డేయుశరములు, ప్రతిహతములు సేయు నరుఁడు పార్థునిశరముల్
శితికంఠుఁ డేయుశరములఁ, బ్రతిహతములు సేయు బహుళబాహాప్రౌఢిన్. 70

క. క్రూరతరహరనరాశుగ, నారాచశిలీముఖాదినానాస్త్రఘటా
నీరంధ్ర మైననభమునఁ, గారుకొనియె గాఢ మంధకారము దిశలన్ 71

క. ఓంకారగాండివజ్యా, టంకారంబులు నభఃకటాహము నిండెన్
శంకరకపికేతుభుజా, హుంకారనిరంకుశాహవాంగణభూమిన్. 72

వ. ఇట్లోహరిసాహరి నల్లాడుహరార్జునులయందు. 73

క. శరధులు యుగాంతవేళా, శరధులునుం బోలె నయ్యె శరశూన్యంబుల్
సురపతిసూతికిఁ బర మే, శ్వరమాయాశక్తి నపుడు సమరాగ్రమునన్ 74

ఉ. తెలివిం బొందక యుండె నెమ్మనమునం దివ్యాస్త్రమంత్రాక్షరం
బులు శారద్వతకుంభసంభవులసంబోధంబు సర్వంబు ని
ష్ఫల మయ్యెన్ వృథ యయ్యె నాంతరకృపాభ్యాసంబు గాండీవికిన్
గలహక్షోణిఁ బినాకపాణికుహనాకౌటిల్యశిల్పంబునన్. 75

క విటలవిలోచనమాయా, ఘటనమునఁ గిరీటి తనప్రగల్భత చెడినన్
గుటిలముగ బొమలు ముడిచెను, గటకటఁ బడఁ దొడఁగె నపుడు కరము సెమర్చెన్.

శా. కాండక్షీణత నాయిషుచ్ఛటలకుం గల్గెంగదే నాధముగ
పాండిత్యం బెటపోయె నొక్కొ యని చెప్పం జిట్టలేఁ గాక యీ
తం డీలాగునఁ బోవునాఁడె మయిమైఁ దా నంచు గర్వోద్ధతిన్
గాండీవంబునఁ బూన్చి వేయఁ దొడఁగెన్ గాండీవి గంగాధరున్. 77

క. మృదు నెన్నఁడు శరములఁ గ, వ్వడి బొదువం దొడఁగె గాండివంబున నవుడే
యుడుగక పొడమెడు భయమున, వడఁకుల గుబ్బలికుమారి వడవడ వడఁకెన్. 78

సీ. కఱకువెండ్రుకలలోఁ బఱచుమందాకిని, సుకుమారదేహంబు సుక్కఁబాఱె
నవతంసకుసుమమాల్యం బైనశశిరేఖ, బ్రహ్మకపాలరంధ్రమునఁ దూఱె
నెట్టియంబుగ బిగ్గఁ జుట్టినపెనుబాము, బిగియూడి నొసలిపై డిగఁగ జాఱె
నలికనేత్రముకిత్తి యారజ్యమానమై, ఱెప్పలసందుల నిప్పు లుమిసె
గీ. నగజ భయ మందెఁ బ్రమథులు బెగడు గుడిచి, రుపనిషత్తులు ఘోషించె నొక్కపెట్టఁ
గాలకంఠునిమౌళిశృంగాటకంబు, గాండినంబునఁ దాడింప పాండవుండు. 79

గీ. పాండునందన ఘనభుజాపండకలిత, చండగాండీవతాడితఖండపరశు
పృథుజటామండలంబునఁ బిండుగట్టి, తాండవం బాడె మున్నేటితరఁగదండు. 80

గీ. వింటఁ గొని వ్రేయ వ్రేయఁగ విసుగు వుట్టె, జెట్టిబిరు దింతె పొమ్మని పట్టి యణఁచె
సురతనూభవునిం బట్టి శూలపాణి, మల్లసంగ్రామకేళి సంభావనముల. 81

క. కపికేతువృషభకేతను, లుపజాతనియుద్ధకౌతుకోత్సాహమునన్
నిపుణతఁ బెనఁగంగఁ దొడఁగి, రుపతాయి న్వ్యపభాష లుపలాస్యముగన్. 82

గీ. తోరహత్తంబునందుఁ బార్థుండు గడిమి, సలిపె నూరులు బీడించె సరభసమున
హరుఁడు సీసాన హత్తించి యర్జునునకు, బరువు గావించె నిశ్వాసపవనమునకు. 83

క. ముక్కంటి కంఠమూలము, డొక్కరమున నిఱికె బార్థుఁడు ప్రబంధుండై
చక్కనిప్రకోష్ఠపీడన, మిక్కిలికను వేఁకి నుఱికె మినుమినుకుమనన్. 84

క. తాఁచుచుఁ బొడుచుచుఁ బడుచును, నేఁచుచు నుడుకుచును బిట్టు నిగయుచుఁ గూలం
ద్రోఁచుచుఁ దూలుచుఁ బెనఁగిరి, ప్రాచీపతిసుతుఁడు హరుఁడు బాహాబాహిన్. 85

శా. నిష్టంకించి శశాంకశేఖరుఁడు గాండీవాయుధుండు న్భుజా
వష్టంభంబులు సిద్ధచారణులు గైవారంబు గావింపఁగా
దిష్టాంతాంతకఘోరమూర్తు లయి సాదృశ్యం బదృశ్యంబుగా
ముష్టీముష్టి రణంబు చేసిరి యసన్నోహప్రకారంబులన్. 86

క. చెమరుచుట యాడుగలచుట, బొమ ముడుచుట నిర్వికారమును మును నవరి
శ్రమమును సరిసరిఁ బెనఁగిరి, సమవిషమనియుద్ధకేలి శంభుఁడు నరుఁడున్. 87

క. తాటించెఁ జేరణము నా, స్ఫోటించెఁ గిరీటివక్షము వృషాంకుఁ డతం
డాటోపమున లకపిడికిటి, పోటివ ధూర్జటియురంబుఁ బొడిచెం గడిమిన్. 88

శా. అంతం జంద్రకళాధరుండు నిజబాహాగాఢపీడాపరి
శ్రాంతుండై యటఁ బాండుసూతిరొదురం బ్రత్యక్ష మయ్యెం గృపా

వంతుండై యహిరాజహారములతో స్వర్వాహినీవేణితో
దంతిత్వక్పరిధానపల్లవముతోఁ దామ్రజ్జటాపంక్తితోన్. 89

ఉ. చెంచెత యయ్యెఁ బార్వతియుఁ జెంచులు భూతములై నిజాకృతి
న్మించిరి వేల్పు లభ్రముమీఁద లలాటమునందు నంజలు
ల్నించి నమస్కరించిరి వినీతియు భక్తియు నుల్లసిల్లఁగా
వించెఁ బ్రణామము ల్గగము విస్మయ మందుచుఁ బార్థుఁ డత్తఱిన్. 90

గీ. వేదము ల్నాల్గు నుపనిషద్విద్యఁ గూడి, ప్రణవమంత్రాక్షరములతోఁ బ్రస్ఫుటముగ
విశ్వకర్తృత్వ మెఱయ్యయ్య వీడుకొనుచు, నభినుతింపంగఁ దొడఁగెఁ జంద్రార్ధమౌళి.

వ. అప్పుడు పార్థుఁడు కృతార్థుఁడై రోమాంచితకంచుకితాఖిలాంగుండై యానందబాష్ప
లోచనుండై కేలుదోయి ఫాలభాగంబునం గీలుకొల్పి యిట్లని స్తుతించె. 92

క. నీవ పరబ్రహ్మంబవు, నీవఖిలాండాండపతివి నీవు ప్రసన్న
శ్రీవిభవారోగ్యాయుగ, ప్రావీణ్యప్రాభవైకఫలదుఁడవు శివా!. 93

క. నిన్నుఁ ద్రిజగన్నివాసుని, బన్నగకంకణుని భక్తపరతంత్రుని న
భ్యున్నతకరుణాగుణసం, పన్నుని గనుఁగొంటి మంటి బాలేందుధరా!. 94

క. నీచేతఁ గృపానిధిచే, వాచాగోచర వివేక వైయాత్యునిచే
నోచంద్రకలాశేఖర!, యాచించి మనోరథార్థ మర్థిం గందున్ 95

శా. నీకై యేను దపంబు చేసితి మహానిష్ఠాగరిష్ఠస్థితి
న్నీకై సంస్తుతి సేయుదుం గడఁగి నానేర్పొప్పఁగా నెంతయు
న్నీకై పూజ యొనర్తుఁ గొంత విరుల న్నిత్యంబు సద్భక్తితో
నీకై సేవ యహర్నిశం బొనరుతు న్వేదండచర్మాంబరా!. 96

గి సాటి యెవ్వరు నీకు నిశాటభూష!, కైటభారాతిహాటకగర్భవంద్య!
ఘనజటాజూటవాటికాఘటితవికట, గగనగంగాప్రవంతిక! కరటివైరి!. 97

క. నీయందు జగము లుండుం, బాయక యాజగములందుఁ బాయక నీవుం
దీయమవు దెలియ నజానకుఁ, దోయజనేత్రునకు నైనఁ దోఁపదు శర్వా!. 98

మ. జయ సర్వేశ్వర! సర్వలోకజనకా! చంద్రార్ధచూడామణీ!
జయ కామాంతక! కామితార్థఫలదా! చక్షుశ్శ్రవగకుండలా
జయ సంపూర్ణకృపాగుణైకవసతీ! శైలేంద్రజావల్లభా!
జయ దక్షాధ్వరమర్దనా! జయ గిరీశా! యీశ! రక్షింపవే. 99

ఉ. కొండకిరాతుఁ డంచుఁ గయికోక యసంగతభాషణంబు లు
ద్దండత నాడితిన్ గర ముదగ్రత నొంచితి ముష్టిఘట్టనం

గాండివచాపదండమునఁ గ్రచ్చఱ మోదితి మౌళి భోగభృ
త్కుండల! పెక్కుచందముల ద్రోహముచేసితి నేమి సేయుదున్. 100

వ. అని మఱియు మఱియు సాష్టాంగప్రణామంబు లాచరించి నిలిచినపాండవమధ్యముం జూచి ఖండపరశుండు నీతపంబునకుఁ బాశుపతవ్రతనిష్ఠాగరిష్ఠతకు భుజాశౌర్యంబునకు సంతసిల్లితి నీవరం బేదియొ వేఁడు మనుటయు. 101

గీ అభవ ! యీ నాకు నీప్సితం బగువరంబు, దయఁ బ్రసాదించి రక్షింపఁ దలఁచితేని
రౌద్ర మై ఘోరమై లోకరక్ష ణైన, పాశుపతసంజ్ఞ మగుదివ్యబాణ మిమ్ము. 102

వ. అనినం బ్రీతచేతస్కుండై శంభుండు శాంభవీహృదయానురాగంబునను బ్రమథపరివారసమక్షంబునను మందస్మితంబు కందళింపఁ గరుణాకటాక్షవీక్షణంబున నప్పాండుకుమారుం జూచి త్రిపురదైతేయసుందరీవదనారవిందవాసరావసానసంధ్యాసమయసమారంభంబును గరటిదనుజకుంభకూటకూటపాకలజ్వరస్తోమంబును జలధరజలధరవ్యూహఝంఝాసమీరంబును నంధకాసురప్రద్యోతనప్రభామండలంబును శార్దూలదానవారణ్యహవ్యవాహంబును నగునమ్మహనీయదివ్యాస్త్రంబు ససంప్రయోగంబు సోపసంహారంబు సకీలకంబు సరహస్యంబు గా నుపదేశించె నపుడు సేవాసమాపన్ను లగుకిన్నరకింపురుషగరుడగంధర్వవిద్యాధరులు తమతమదివ్యాయుధంబు లిచ్చిరి పార్వతీదేవి యక్షయబాణతూణీరంబు లొసఁగె దండధరుండు దండంబును బాశపాణి పాశంబును నింద్రుండు వజ్రంబును సమర్పించి రిట్లు వరప్రదానంబు సేసి యీశానుండు సపరివారుండు సాంబుండు నై యంతర్ధానంబు చేసె ననంతరంబ. 103

గీ. పరమసంతోషమును బొంది బలవిరోధి, పుత్త్రుఁ గౌఁగిటఁ జేర్చి యాపోనికూర్మి
సమ్మదాశ్రుకణంబులు సంప్రఫుల్ల, చక్షురంభోజదళసహస్రమునఁ బొడమ 104

వ. ఇట్లనియె. 105

ఉ భాగ్యము గాదె యశ్రమమ పన్నగకంకణుచేఁ దపఃక్రియా
యోగ్యతఁ జేసి విశ్వభువనోపకృతిప్రతిపాదనైకసౌ
భాగ్యధురంధరం బయినపాశుపతాస్త్రము గాంచి తింక వై
రాగ్యము పుట్టుఁ గాక కురురాజుపయి న్నిజరాజ్యలక్ష్మికిన్ 106

వ. నీవు నారాయణసఖుండ వైనయాదిమునీశ్వరుండవు. నరనారాయణులవలనఁ ద్రివిష్టపంబునకుఁ బెక్కుతోయములు రాక్షసబాధలు శాంతిం బొందె, నిప్పుడు హిరణ్యపురనివాసులు నివాతకవచకాలకేయాదు లగుదైతేయులు రాజ్యలుబ్ధులై నాకంబున కనేకప్రకారంబుల నుపద్రవం బాపాదించుచున్నవారు వారిం బరిమార్ప నమరావతీపురంబునఁ గొన్నిదినంబులు వ్రతోపవాసప్రయాసఖేదం బపనయించి మధ్యమలోకంబునకుం గ్రమ్మఱ నేతెంచునది మాతలిసారథికం బగురథంబు పుత్తెంచెద

నిచ్ఛేతున యుండునది యని తత్కాలసన్నిహితుం డైనరోమహర్షుం డను మునిం
జూచి నీవు ద్వైతవనంబునకుం బోయి పాండవుల కర్జునకుశలవార్తయుఁ బాశు
పతాస్త్రలాభంబును స్వర్గగమనంబుం జెప్పు మని పల్కి యింద్రుండు నిజస్థానంబున
కరిగె. 107

గీ. విశ్రమించె నొక్కవృక్షంబుక్రీనీడ, నర్జునుండు మణిశిలాంతరమున
ఖండపరశుబాహుదండనిష్పీడన, ముష్టిఘాతఖేదమోక్షమునకు 108

శా. మాళిం గోహళిసంఘటించినక్రియ న్మధ్యాహ్నవేళ న్మహా
కాళం బైననభోవిభాగమున వీఁకం గాసె బీరెండయా
ప్రాలేయాహితసంప్రదీప్తకిరణప్రక్రీడదర్కోపల
జ్వాలాజాలజటాలజాంగలతటీవాచాలకోయష్టి యై. 109

వ. అప్పుడు మధ్యాహ్నకాలపూజకు వాయికంబై. 110

సీ. పావననిర్ఝరాంభఃప్రవాహంబున, నఘమర్షణస్నాన మాచరించి
కసటువోఁ దెలినీటఁ గడిగి యాటార్చిన, సలిలకాషాయవల్కలము గట్టి
యాపాదమస్తకం బఖిలాంగకంబులఁ, గమ్మనిభసితంబు గలయ నలఁది
వెడఁదముత్యములతో నెడవెట్టి గ్రుచ్చిన, మంచిరుద్రాక్షదామములు దాల్చి
గీ. పులికళాసంబుగద్దెపైఁ బూని మెఱయఁ, బంచశుద్ధులు గావించి పాండుసుతుఁడు
షోడశోపచారంబులు సారిదిఁ దీర్చె, నీలగళునకు మధ్యాహ్నకాలవేళ. 111

వ. ఇట్లు శివలింగార్చనంబు దీర్చి కందమూలఫలోపహారంబులు సమర్పించి తత్ప్రసాదం
బునఁ దాను దేహయాత్ర నడపి విశ్రాంతుం డై యున్నసమయంబున ధవళహయ
సహస్రంబులఁ బూన్చినరథంబు గొని వచ్చి మాతలి తనకుం బొడసూపిన సబహు
మానంబుగా నాదరించి పురందరాదేశంబున నద్దివ్యస్యందనం బెక్కి యాకాశమార్గం
బునం జనునప్పుడు. 112

సీ. ఇదిమేఘమండలం బివి విమానంబులు, యక్షవిద్యాధరోపాశ్రయంబు
లిదియాహవస్కంధ మదె తారకావీథి, యల్లతెల్లనిరేఖ యభ్రగంగ
యల్లదె శింశుమారాకారహరిమూర్తి, వీఁడె భాస్వంతుఁడు వాఁడె ధ్రువుఁడు
వీర సప్తర్షులు వారె యశ్విన్యాదు, లిరువాడ దేవేరు లిందుభార్య
గీ. లల్లవాఁడె సుధాకరుం డవె గ్రహంబు, లిల్వలాఖ్యంబు లగుచుక్క లివె కెలఁకుల
ననుచు మాతలి చూపంగ నర్జునుండు, కౌతుకం బంది గగనమార్గంబునందు. 113

శా. జంభారాతితనూజుమీఁదఁ బొలిచెన్ సావిత్రివర్త్మంబున
న్సంభిన్నోదరశాతకుంభనలినీవాలీకసంవాసనా

సంభారంబులు సోఁకు మట్ట సవిధస్వర్లోకకల్లోలినీ
గంభీరాంబుతరంగసంభ్రమములం గల్యాణవాతూలముల్. 114

గీ. అర్జునునిమీఁదఁ బొలిచెఁ బథ్యంతరమున, నభ్రగంగానదీతరంగానిలంబు
నందనోద్యానవీథికానవలతాంత, సారభాసురహారినీలహార మగుచు. 115

వ. ఇవ్విధంబున మాతలిసారథికం బైనయారథంబుమీఁద నక్షత్రమండలం బొఱసి
కొనుచుం జని యర్జునుం డమరావతిం బ్రవేశించి దివ్యాంగనాపాంగభంగీసమాలింగిత
సౌభాగ్యుం డై రాజమార్గంబునం జని దివ్యమందిరంబుఁ బ్రవేశించి సుధర్మాభిధానం
బైనయాస్థానమండపంబునఁ గొలువున్నమహేంద్రు నర్ధాసనంబున నుండె. 116

గీ వీడుపట్టుగ మందారవిపినవీథి, దివ్యసౌధంబునందుఁ బ్రతిష్ఠఁ జేసి
గారవించె జయంతకుమారుకంటెఁ, బాండురాజతనూజు నాఖండలుండు. 117

వ. ఆనిశాసమయంబున. 118

సీ. పదువాల్గుజాతుల త్రిదశాంగనలయందుఁ, బేరుఁ బెంపును గలనీరజాక్షి
నీరజనాభునియూరుకాండంబున, నుద్భవం బందినయుజ్జ్వలాంగి
యంభోనిధానంబు నాపోశనము గొన్న, కలశసంభవుఁ గన్నకంబుకంఠి
వసుధయందుఁ బురూరువశ్చక్రవర్తికిఁ, బ్రాణవల్లభ యైనపద్మనయన

గీ. కట్టి తొడి పూసి కైసేసి కౌతుకమునఁ, గొస దిగఁగ నీలిపుట్టంబు ముసుఁగువెట్టి
గాజు లెగఁ ద్రోసి చప్పుడు గాక యుండ, వచ్చె నూర్వశి యర్జునావాసమునకు. 119

చ. విమలసుధాంశుకాంతమణివేదికపై నవహంసతూలత
ల్పమున సుఖప్రసుప్తిపరిపాకము నొంది విశాలనేత్రప
ద్మములు మొగిడ్చి శేషఫణిపైఁ బవళించినయంబుజాక్షు భా
వమునఁ గరంబుఁ బొల్పమరువానిఁ గనుంగొనె నింతి పార్థునిన్. 120

గీ. మేల్కొలిపి యిందుబింబాస్యమెల్లమెల్లఁ, బ్రమదనిద్రాపరాధీను బాండుతనయుఁ
బగడములఁబోలుతనపాణిపల్లవములు, నతనిమృదుపాదపంకేరుహంబు లొత్తె. 121

వ. మేల్కని యర్జునుండు నిర్జరలోకలలామం బైనయమ్మానినీరత్నంబుం గనుంగొని
పాన్పు డిగ్గి యభివాదనంబు సేసి వినయవినమితోత్తమాంగుం డై యి ట్లనియె. 122

గీ. ఈనడికిరేయి నొంటిమై యింతదూర, మేమి కార్యంబు మదిఁ గోరి యేగుదెంచి
నేను రమ్మన్న రానె పూర్ణేందువదన, చెప్పుమీ పాన్పుమీఁద విచ్చేసి యుండు. 123

ఉ. ఆడఁగఁబోవుతీర్థ మెదు రైనవిధంబున నిల్లి రేయి రే
పాడియ చంద్రశేఖరు నుపాస్తి యొనర్చి యుపాయనంబులోఁ
జూడఁగవచ్చువాఁడ నయి చూచుచు నుండఁగ నీవ వచ్చితో
చేడియ యెట్టిపుణ్యములు చేసినవాఁడనొ ప్రాగ్భవంబునన్. 124

శా. మత్తారాతివిదారణుండు జనసన్మాన్యుండు సీతాంశువం
శోత్తంసంబు పురూరవుండు ప్రచలద్యోగుండు మాతాతగా
రత్నోయాకరమేఖలాపతికి నిల్లాలైతిగా కావున
న్మత్తో నీ విది లెస్స మన్ననపయి న్మోహంబు వాటింపఁగన్. 125

గీ. ఆదినారాయణునియూరు వంబుజాక్షి!, భువనవిఖ్యాత మైననీపుట్టినిల్లు
పావనుఁడ నైతి నీపాదపద్మములకు, వందనముఁ జేసి వరభక్తిప్రభవమున. 126

వ. అని పెక్కుప్రకారంబుల నిర్వికారుండై పాండుకుమారుండు ప్రియంబు చెప్పిన
నప్పువ్వుఁబోఁడి కప్పలుకు లొప్పు లయ్యును నీరుడప్పికి నేయునుంబోలి యప్పటి
కప్రియంబు లైయుండె నిచ్ఛావిఘాతంబు నొందియు నమ్మచ్చెకంటి చేతోభవవికా
రంబు హరింపం జాలక ధనంజయున కిట్లనియె. 127

గీ. ఏల యొన్నోతరంబుల నీడఁ బడ్డ, పెద్దవావులు శోధించి గుద్దలింప
వారకాంతాజనములకు వావి గలదె, మాను మర్జున మొగమోట లేనిమాట. 128

ఉ. వాసవునిండుఁగొల్వునకు వచ్చినయప్పుడు తత్సమంచితా
ర్ధాసన మెక్కియున్ననిను నంగజసన్నిభుఁ జూచి పుష్పబా
ణాసనుపుష్పబాణనివహమ్ములకుం గురి యైతి నిట్టినా
యాస నిరాకరింపఁ దగవా మగవాఁడవు కావ యర్జునా! 129

గీ. ప్రమద మెసలారఁ బాంచాలరాజసుతకు, వలచి చేసితివో సత్యవాక్ప్రతిజ్ఞ
యన్యకాంతలదెసఁబోవ ననుచు నీవు, భామలకుఁ జేయుసత్యంబు పాడిగాదు. 130

క నామోహము నావేడుక, నామానము నాప్రియంబు నాతగులము నా
ప్రేమమ్మును నాతెగువయు, క్షామముఁ బొందంగ నూరకయె పోవుదునే. 131

చ. అతులితధైర్యశౌర్యమహిమాద్భుతసాహసు లై మహోగ్రతా
ప్రతతనిశాతనిష్కృపకృపాణవిదారితదేహు లై రణ
క్షితిఁ బడివత్తు రైదుపదిసేయక నాకయి యిట్టివన్నె నీ
వితరులఁ బోలెఁ గైకొనక యేఁచెద వక్కట పాండునందనా!. 132

క. వేసాలఁ బోకు రమ్మా, పూసజ్జకుఁ బ్రొద్దువోయెఁ బులియుట చాలున్
వాసవనందన! కుసుమశ, రాసనకేళీకలావిహారంబులకున్. 133

వ. అని పల్కి యంత నిలువక బ్రహ్మచర్యవ్రతదీక్షాపరాయణుండవై నీ వనుచు నారా
యణోరుస్తంభంబున సంభవించినయయ్యచ్చరలేమ లేమొలకనవ్వు లపాంగంబునం
దొంగలింపఁ గంకణఝుణఝుణత్కారంబు తోరంబుగాఁ గెంగేలికేళీకమలంబునఁ
బరాగరేణుత్రసరేణువిసరంబులతోడం గూడి మకరందబిందుధారాస్యందంబు చిందఁ

పురందరనందనుని ప్రేసె ప్రేసిన నత్యంతధీరోదాత్తుండు గావునఁ జిత్తభవసమ్మోహ
నాస్త్రవిదారణంబునకుం దార యగునవ్వేటున కంతరంబున మిసిమింతుండును గాక
యేపాకంబునకు రాక రాకాచంద్రబింబంబువోని నెమ్మోము వాంచి నిర్వికారుండై
యూరకుండె నివ్విధంబున నయ్యూర్వశియుఁ బసిమాలఁ బెనంగి యక్కిరీటిచిక్కని
మనంబు పక్కు గానక కానక కాసినవెన్నెలయుంబోలెఁ దనకన్నులవలపు మిన్నక
పాలివోయినం జిన్నవోయి నిట్టూర్పులు నిగిడించుచు మనోరథవిఘాతప్రభవం బైన
కోపంబు సైరింపక నరు నుద్దేశించి నపుంసకుండవుఁబోలె నాన గొన్నాఁడ వేఁడు
కాలంబు నపుంసకుండవు గమ్మని శపించి దిగ్గన లేచి మొగంబు గింటువెట్టుకొని యిం
టికిం బోయె. యుధిష్ఠిరానుజుండును వసిష్ఠజననివలన గతికీర్తితాపన్నుండై యయ్యా
రిష్టంబునకు సంతాపంబు నొందక యది విధివశంబుగాఁ దలంచుచుండె నప్పుడు గగ
నంబు క్రేవంబడి యస్తమండలుండై హిమగభస్తి విరహవేదనాఘూయమానమానస
యగుమైత్రావరుణజనయిత్రి ఖిన్నవదనంబునుంబోలె వెలవెలఁ బాఱ విభావరీసమయం
బునం ద్రిభాగావశేషం బగుటయు. 134

సీ. పారిజాతకలతాపల్లవంబులు మేసి, కొసరె నుద్యానపుంస్కోకిలములు
గంధరాగ్రైవేయకనకఘుంటిక మ్రోయ, వేల్పుటేనిక యుపర్విధికి వెడలె
మందాకినీవీచిమారుతం బల్లార్చె, నప్సరస్త్రీలనీలాలకముల
సప్తర్షిపావనాశ్రమవనాంతరమున, నామ్నాయఘోష మభ్యధిక మయ్యెఁ

గీ. బాలవత్సంబుపైఁ గూర్మి బచ్చడిలుచుఁ, గామధుగ్గవివచ్చుహుంకార మెచ్చె
శుక్రుగడియారమున మించె శంఖరవము, విబుధలోకంబునందలి వేగుఁబోక. 135

గీ. మర్త్యలోకంబువారిప్రమాణసంఖ్యఁ, బాండుసూనుండు గడపెను వజ్రియింట
సగము నిద్రయును సగము జాగరమును, నావిభావరి వేగుఁబోకాఱు నెలలు 136

సీ. మాటుగా వైచినమాంజిష్ఠతెర యెత్తి, పంజామంచము డిగ్గె మంజుఘోష
ముకరిముట్టెలమ్రోఁత ముద్దుచూపఁగ రంభ, కనకంపుగోడుగు పాగాలు దొడిగె
నొకటవేనలి ముడ్చె యొక్కకేల ఘృతాచి, గాజుటెక్కులతిల్పు గడియవుచ్చె
వలసభావముతోడ నలవోక ప్రమ్లోచ, నిల్వుటద్దంబులో నీడచూచె

గీ. హారిణి గీలించె నలినపట్టాంశుకంబు, మేనక ధరించెఁ బాలిండ్లమీఁద అవిక
యప్సరస్త్రీనికేతనాభ్యంతరములఁ, గొక్కరోకోయటంచును గోళ్లు గూసె. 137

వ. అమరావత్యమృతాశను ల్ప్రథమసంధ్యావేళవాల్గన్నులం
గమలాప్తుం గని యాచరించిరి నమస్కారంబు క్రిందైనమ
ధ్యములోకంబున దివ్యదంశువుల నీహారప్రతానంబు భం
గమునొందించుచు మిన్నుఁబ్రాఁకె నుదయాగ్రావప్రదేశంబునన్. 138

సీ. పరమర్షి పావనపాణిపల్లవములు, ఫాలభాగములపైఁ బవ్వళింపఁ
బౌలోమి పెంచినబాలాశోకద్వయం, బలఁతియారెండకు నఱ్ఱు సాప
గగనకల్లోలినీకనకపద్మములపైఁ, దుమ్మెద లెగసి ఝుం ఝుమ్మ రనఁగ
నాకవిద్యాధరీనాట్యశాలలయందుఁ, దూర్యత్రయంబులు దురఁగలింపఁ
గీ. ప్రమద దిక్కాంత కెంగేలఁ బట్టియాడు, క్రొత్తగురివెందపూసలగుత్తివోలె
దివసకామిని ముఖలక్ష్మి తెలివి నొందఁ, బూర్వదిశయందుఁ గరకరఁ బ్రొద్దు పొడిచె.
వ. అయ్యవసరంబున. 140

శా. కాల్యాచారము లాచరించి కడఁకం గౌరవ్యశార్దూలుఁడా
జ్జ్వల్యస్ఫూర్జితవస్త్రభూషణవిశేషస్ఫూర్తి యై విస్ఫుర
న్మాల్యాలేపనుఁడై విచిత్రబలశుంభద్భవ్యదివ్యాస్త్రసా
ఫల్యప్రౌఢతపోనిరూఢవిభవభ్రాజిష్ణుఁడై యున్నతిన్. 141

క. బలవదరినికరనిర్భర, బలసాదనబాహుదర్పబంధురలీలా
విలసవతి యొసఁగ వచ్చెను, బలసూదనుసభకు భక్తిభావం బలరన్. 142

వ. వచ్చిన సాష్టాంగం బెరఁగినఫల్గును నఫల్గునవాత్సల్యహేలాసముత్సేకంబున గాఢగా
హనసంభావితుం జేసి జంభభేది యతని నాత్మీయసింహాసనార్ధంబున నుపవిష్టుం గావిం
చి యిట్లనియె. 143

సీ. బాహాబలాటోపపరిపాటి మెప్పించి, పడసితి వీశానుపాశుపతము
సంగ్రహించితివి శస్త్రమ్ము లిమ్మడిగాఁగఁ, బురవైరికరుణ నిర్జరులవలన
నధికరించితి వస్త్రదాచార్యకంబునఁ, జతురంబులగుదివ్యసాధనములు
కొలఁది లేకుండఁ గైకొంటి కుంభజుచేత, నైజంబు గాఁ జాపనైపుణంబు
గీ. పరశుపట్టిసముద్గరప్రాసముసల, ఖడ్గముఖచిత్రచంక్రమక్రమనిరూఢిఁ
గరము మేదిని సాటి నీ కరయఁ గలరె, శౌర్యమున నుగ్రభుజవీచి సవ్యసాచి. 144

శా. ఏరీ నిన్నెదిరింపఁగా జగమున న్వీరు ల్ప్రతాపోద్ధతిం
ధౌరంధర్యమునం బ్రభావమహిమం ధైర్యంబునం జాపలీ
లారంభంబున సాహసిక్యమున బాహాశక్తి దివ్యాయుధో
దార ప్రౌఢిమ దేవదైత్యనరగంధర్వాదిసంఘంబులన్. 145

క. నీ పని సేయ బలాఢ్యుఁడ, వీవిశ్వంబునను నీకు నెదు రెవ్వరు లే
రావంతి యైన పదిలకు, మేవలనను దేవవిప్రహితకార్యంబుల్. 146

క. ఏపున భుజగర్వోన్నతి, ప్రాపున దీపింప నిట సుపర్వహితార్థం
బో పార్థ! చేయవలయును, నాపనిచినపంపుపంపున న్శౌర్యనిధీ. 147

చ. అలఘుబలుల్ నివాతకవచాఖ్యులు వీరులు ఘోరదానవు
ల్బలనిధిఁ గొంది యుండుదు రసాధ్యులు నిర్జరసిద్ధసాధ్యకుం
డలినరకిన్నరద్యుచరనాయకకోటికి మూఁడుకోట్లవా
రలవలనం గలంగెడు నిరంతరబాధల ముజ్జగంబులున్. 148

చ. మఱియును నెందఱేని నసమానబలు లుస్సురలోకకంటకు
ల్దఱచుగ బాధ చేసెదరు దైత్యు లవధ్యులు నిర్జరాళి కే
ర్తెఱ నెఱయంగ వీరభవదీయశరార్చులపాలు సేసి యం
దఱ నుఱుమాడి యెంతయు హితం బొనరింపుము మాకు నర్జునా. 149

వ. అని సువాసీరుండు సమారాధనంబున. 150

క. తనతొడిగినభూషణంబులు, తనదుకిరీటము నభేద్యతరకవచంబుం
దనసుతున కొసఁగ గాండివ, ధనువున నగజయము గుణము దాఁచి కడంకన్. 151

క. హయము లనూరుసవర్ణము, లయుతంబు వహింప సూతుఁడై మాతలియు
న్నియమింపఁ దవరునరదము, నయుదము నెక్కఁగఁ బనిచి వార్షం బెసఁగన్. 152

గీ. అమరలోకంబు నిర్జింప ననుపఁ బొంగి, సంగరోత్సాహ మెదలోన సందడింప
నడరు పెంపున నరుగునయ్యర్జునునకు, నిర్జరులు హర్షమున నిట్లనిరి కడంగి 153

సీ. ఈరథం బెక్కి మున్నింద్రుండు నిర్జించె, శుంభన్మహోదైత్యు జంభదైత్యు
నీశతాంగమున బర్హిర్ముఖేంద్రుఁడుద్రుంచె, నాజిని స్తంద్రు వృత్రాసురేంద్రు
నీయరదంబున నెగిచె గోత్రవిభేది, పరిపంథిఘనమహాబలుని బలుని
నీతేరఁ గాడె మాయించె సుత్రాముండు, పాకదైతేయు నిర్భయసహాయు

గీ నీమహాస్యందనంబున నేపుమాపె, నముచిముఖదానవశ్రేణి నమరవిభుఁడు
నీవు మీతండ్రియట్లన నిఖిలదనుజ, పతుల నోర్వుము దీనిచేఁ బాండవేయ. 154

వ. అని పల్కి దేవసంబంధం బైనదేవదత్తం బను శంఖ బిచ్చినం బుచ్చుకొని యర్జునుండు మాతలియుం దాను దద్రథాధిరోహణంబు చేసి నివాతకవచవధార్థం బతిరభసంబున నరుగువాఁడు ముందటఁ గరిమకరకరకఠోరఫూత్కారవారిధారాలవాపారపూర్యమాణ రోదసీనిరంతరాకాలసంపాదితోదుభ్రమంబును నమలడిండీరపిండఖండమండితాఖండ పాండుర్యధుర్యగోచిరనిశసాంద్రచంద్రికాక్రాంతదేశదిశాభాగంబును వితతవిద్రుమ లతానికుంజపుంజసముభిరంజితప్రదేశనిర్దిష్టసంతతాదిష్టచరమసంధ్యావిశేషరాగంబును గమఠఝషకుళీరతిమితిమింగిలాదిసత్త్వసంపాతసంభృతాచ్ఛోదితధ్వనినిలీనవిఖిలచేతనా రవంబును దళవిధూతపాతవికిరదవిరళపరాగవినిభృతద్విరేఫకుసుమమంజరీవిశాలలవలీ లవంగలుంగలతాలాస్యవిభవంబును బతుభూభృదవిరతప్రచారాభిషవణంబును నమేయ

వాహినీవధూముఖప్రసక్తభూషణంబును నగుమహాసముద్రంబు డగ్గఱి తదీయోద
రంబున. 155

చ. కనియెఁ బురంబు నభ్రమణికాంచనసౌధము నత్యుదగ్రసా
ధనము నసాధ్యశిల్పఘనదారుణసాలము నద్భుతైకస
జ్జనసముదగ్రఘట్టము విశాలతరాట్టము నుద్భటారిత
ర్జనము ననల్పగర్జనసురద్విషదుజ్జ్వలితంబు నిమ్మొగిన్. 156

మ. కని యత్యుద్ధతి శంఖ మొత్తుటయు నాకంపించె ధాత్రీతలం
బనిలస్కంధము లేదు చిక్కువడియె న్యాదోనిధు ల్డిందె ఘూ
ర్ణనముం బొందె సురేంద్రలోకములు విన్నం బోయెఁ బాతాళము
ల్వినియోగంబులు దప్పె భూతచయము ల్వ్రీలె న్దిశాభాగముల్. 157

వ. ఇట్లుయుగవిగమసమయఘనఘనాఘనవకఠోరదీర్ఘతరశతసహస్రభైరవం బగునమ్మహా
రవంబు కర్ణశూలం బై తాఁకినఁ గనలి దానవులు హలముసలపరశుపట్టిసప్రాసపరిఘ
ముద్గరముసుండిదండకోదండకుంతకులిశభల్లభిందివాలశంఖశక్తికర్తరీకరాళక్షురారలవి
త్రతోమరత్రిశూలఖట్వాంగచక్రచంద్రహాసమహాంకుశగదాపాశపాషాణప్రముఖం
బులగు మహాస్త్రశస్త్రంబులు వహించి వికటగర్జారవభరంబున నంబరంబు పిక్కటిల్ల
నొక్కపెట్ట యమ్మహానగరంబు వెడలి తదీయస్యందనంబుఁ జుట్టుముట్టి. 158

మ. ఘనశస్త్రాస్త్రమహాతివర్షము నొగి న్గర్జామహాడంబర
ధ్వనిసంవీతఘనాఘనౌఘనిపతద్ధారాళధారామహా
శనివర్షంబులద్వంద్వ మొందఁ బయిపై సంరంభశుంభదతి
న్వనధుల్ ఘూర్ణిల బిట్టు వాసవిపయి న్వర్షించె నొక్కుమ్మడిన్ 159

క. వాలికమెఱుంగుఁదూపులు, నాళీకోదరునిమఱఁది నలిదైత్యులపైఁ
గీలించెఁ బేరుపేర, న్వ్రాలమునఁ బదేసికంకపత్రములు వడిన్. 160

మ. అలుకం దానవు లొక్కుమ్మడి తదీయస్యందనోరుద్యుతి
స్ఖలనంబు న్సురసిద్ధచారణమహాశ్చర్యంబు గావించుచు
న్గలహక్షోణియు నాకసంబు దిశలుం గాండప్రకాండంబులం
గలయం గప్పి యదల్చి యార్చిరి సమాకంపింప భూతావళుల్. 161

గీ. భయభరంబున వెలవెలఁ బాఱి రపుడు, త్రిదశసారథి ధృతి దప్పె తేరుగడుప
భ్రమసియుండినఁ దాన సారథియు రథియు, నగుచుఁ బరిమార్చె నరికోటి నర్జునుండు.

క. నిర్జరసారథి యర్జును, దుర్జయవిక్రమము సమదోహలతయు దోర్గ
ఖర్జాభరంబు సారథి, యౌర్జిత్యముఁ జూచి మిగుల హర్షముఁ బొందెన్. 163

సీ. అసురు లుద్ధతిశూలహలభిందివాలంబు, లడరించి రడఁగించె నర్జునుండు
దైత్యులు దండించి దండశంకులశక్తు, లిగిడించి రుడిగించె నింద్రసుతుఁడు
దైతేయు లేచి ముద్గరగదాంకుశములు, పఱపించి రదలించె ఫల్గునుండు
సురవైరు లల్కఁ దోమరకుంతగుణములు, సారించి వెడలించె సవ్యసాచి
గీ కణయకంపరఖేటకక్రకచకులిశ, చక్రఖట్వాంగకుద్దాలచంద్రహాస
వివిధశస్త్రాస్త్రములు వైచి రవఘులించె, శుక్రశిష్యుల ద్రోణశిష్యుండు గెలిచె 164

వ. ఆయ్యవసరంబున 165

శా. జంభారిప్రభవప్రయుక్తనిబిడజ్యారావగంభీరసం
రంభభ్రామితగాండివప్రసరదస్త్రవ్రాతదీవ్యత్పరా
సంభిన్నాంగములై సురారితనువు ల్సంగ్రామరంగంబునం
గుంభద్రోణములట్ల బిట్టు గురిసెం ఘోరంబుగా రక్తముల్. 166

క. చేయునది లేక దనుజులు, మాయాయుద్ధంబు సేయ మదిఁ దలఁచి ధృతిం
క బాయక వైచిరి విద్యా, వైయాత్యము మించఁ బరుషవర్షాస్త్రంబుల్. 167
వడిఁబాము ప్రేలఁగట్టిన, పడువున నలుగడల ముసరి వార్వాహంబు
ల్జడివడి కురియం దొడఁగెను, వెడవెలుపును లేక పాండవేయునిమీఁదన్. 168

మ. బలభిద్ధ్వంసివరంబునం గొనినదివ్యస్మాయుతాస్త్రంబుచే
జలవాహంబులు పట్టఁజేసె నరుఁ డత్యుగ్రప్రతాపంబున
న్గలయం గప్పిరి దారుణాశ్మముల నుగ్రస్వాంతులై యేచి దై
త్యులు పార్థుం గులిశాస్త్ర మేసి యవి తోడ్తోఁ ద్రుంచె నాతం డొగిన్. 169

చ. అనలసమీరణాత్మకము లైనమహాస్త్రము లేసి యుద్ధతిం
దనుజులు గాడ్పుతోఁ బెరసి నల్గడ నొక్కట విస్ఫులింగము
ల్గనకనఁ గ్రాలఁ బావకశిఖ ల్వెస ముంచె సురేంద్రనందను
న్ననలి యతం డణంచె నవి గ్రక్కున వారిమహాశుగంబులన్. 170

చ. తిమిరమహాస్త్ర మేసి రణతీవ్రత నూపిరి దైత్యపుంగవుల్
క్రమమునఁ గప్పె నల్గడల గాఢమహోద్ధతిఁ జిమ్మచీఁకటుల్
తెమలె దిశావివేకమును ధీరతయు న్వెస నిల్లవారికిం
భ్రమసి సురేంద్రసారథియుఁ బాఱగ వైచెఁ బ్రతోద మవ్వలన్. 171

క. రథ్యములు పరవసేరక, మిథ్యాభిమతంబు లయ్యె మియి మఱచి సమి
ద్రథ్యా ధనంజయుఁ గానక, తథ్యమునను లేక యుండఁ దత్సారథియున్. 172

వ. భయం బంది యర్జున యెటపోయె దని యెలుంగెత్తి యాహ్వానంబు సేసి తొల్లి దే
వాసురసమరంబు లనేకంబులు చూచితిం గాని యిట్టిభయోద్రేకజన్యంబు లగుజన్యం

బులుం గూడ వీరు వరజనితవీర్యదర్పితులు గావున వీరిసంప్రహారంబు ఘోరంబు అని
పల్కిన మాతలి నూఱడించి యించుకసేపు మద్భుజావిహారంబు చూడు మని ఫల్గునుండు.

శా. జంభధ్వంసివరంబునం గనినయస్త్రంబు న్మహాసారము
శుంభద్విక్రమబాహుదర్పములు సంక్షోభిల్ల చేసెం దమ
స్సంభారం బడఁగన్ దిశ ల్వ్యాపులవై శద్యంబు నొందన్ సుర
ల్సంభావింప భయంపడంగ దివిజు ల్సంగ్రామగంగంబునన్. 174

మ. జవ మేపాఱఁగఁ గూలె దైత్యతనువు ల్సర్వంసహాపీఠిఁ బాం
డవగాండీవధనుఃప్రకాండభవకాండప్రస్ఫుటోచ్చండ తాం
డవషాండిత్యవిశేషవిభ్రమకృతాడంబ ప్రతీకంబులై
యవనీంద్రంబులభంగి నింగి యద్రువన్ హాహానినాదంబులన్. 175

వ. ఇట్టినివాతకవచులు నిరవశేషులై మడసిన సంక్రందననందనుండు తత్పురంబులోనికిం
జని యంతయుం గనుంగొని మాతలి కిట్లనియె. 176

గీ. కనకమయహట్టసట్టికకాంత మగుచు, వివిధమణిసౌధములును వస్తువులు గల్గు
నిష్పురంబునఁ గాఁపుండ కితర మైన, పురమునం దేల నిల్చె నిర్జరవిభుండు 177

ఉ. నాఁవుడు నిట్లనుం ద్రిదశనాయకసారథి నిర్జరేశ్వరుం
డీవరరాశిలోన సృజియించెను దైత్యభయంబుచేత దే
వావలి కుండ నిప్పుర ముదగ్రగతిం దనుసూను లంతరా
జీవభవుం బ్రసన్నునిగఁ జేసి మహాబలవీర్యవంతులై. 178

క. ఇందుండఁగ నింద్రాదిక, బృందారకవరులతోడఁ బెనఁగుచు నెందున్
గ్రిందుపడకుండఁ దపమున, నందిరి వర మఖిలభువనహననోత్సుకతన్. 179

వ. కావునం దద్విజయార్థంబుగా విజయ నిన్ను వాసవుండు పనిచె, నిమ్మహాసురులు మరు
ద్గరుడగంధర్వసిద్ధసాధ్యుల కసాధ్యు లిట్టివారల నక్రమంబునం జంపి పెంపు గాంచితివి
భవదీయసత్త్వసాహసంబులకుం గొలఁది యెక్కడి యది యని యర్జునుం బ్రస్తుతించి
మాతలిరథంబు గ్రమ్మఱించె ఇట్లు నివాతకవచులఁ బరాభవించి భవ్యతేజోదుర్నిరీక్షుం
డై పాండవేయుండు మరలి వచ్చువాఁడు ముందట. 180

గీ. వివిధవృక్షగుల్మవిస్తీర్ణ మై కడుఁ, బొలుపుమిగులునొకతపోవనంబు
నతివిచిత్రశిల్ప మగుపట్టణంబును, నజ్జ్వలంబు లగుచు నున్నఁ గాంచి. 181

క. సురసారథి యిది యెవ్వరి, పుర మిమ్మహనీయఘనతపోవిపినం బె
వ్వరిది యిది న దుదృష్టికి, హరహర యతివిస్మయంబు నాపాదించెన్. 182

వ. అనవుడు నమ్మహాత్మునకు నాతఁ డిట్లనుఁ దొల్లి పులోమియు గోవికయు ననుసుర
కాంత లిత్తపోవనంబున దివ్యసహస్రవర్షంబు లత్యుగ్రనియమంబునఁ బద్మగర్భు

ప్రతి 1-కి	రూ	అ
రసికజనమనోభిరామము, శుద్ధప్రతి	0	8
రుక్మిణీపరిణయము ,,	0	6
రాజశేఖరవిలాసము, కూచిమంచి. తిమ్మకవిది	0	8
సారంగధరోపాఖ్యానము, శంకరకవిప్రణీతము	0	8
అనిరుద్ధచరిత్ర, కనుపర్తి. అబ్బయామాత్యప్రణీతము	0	8
విక్రమార్కచరిత్ర, జక్కనకవిప్రణీతము	1	4
నిరంకుశోపాఖ్యానము	0	6
వేంకటాచలమాహాత్మ్యము, తరిగొండ. వెంకమ్మప్రణీతము, చక్కనికూర్పు	0	11
పంచతంత్రము, నారాయణకవికృతము	0	12
జైమినిభారతము, అశ్వమేధపర్వము, చక్కనికూర్పు	0	12
ఉత్తరహరివంశము. సోమనాథకృతము	1	4
రుక్మాంగదచరిత్ర ఏకాదశీమాహాత్మ్యము	0	8
సులక్షణసారము, సటీక	0	8
ఆంధ్రబ్రహ్మాండపురాణము	4	0
దసరాపద్యములు	0	1
ఆంధ్రనామసంగ్రహము, ఆంధ్రనామశేషము, సాంబనిఘంటువు, టీకానుక్రమణికాసహితము, కాలికోబైండు	0	12
అప్పకవీయము, చక్కనికూర్పు, అట్టబైండు	1	6
డిటో కాలికోబైండు	1	10
వేమనపద్యములు, చక్కనికూర్పు	0	4
డిటో బ్రౌనుదొరగారి ఇంగ్లీషుతో	1	0
సప్తమస్కంధము, సటీక, చిన్నసైజు	1	0
కుచేలోపాఖ్యానము, సటీక, (భాగవతము)	0	4
డిటో ,, గట్టుప్రభుకృతము	0	6
భాగినీదండకము, బమ్మెర పోతరాజప్రణీతము	0	1
గజేంద్రమోక్షము, సటీక, చక్కనికూర్పు	0	6
రుక్మిణీకల్యాణము, సటీక, చక్కనిప్రతి	0	6
నలోపాఖ్యానము, సటీక, చిన్నసైజు	0	6
నలచరిత్ర, ద్విపద	0	11
రూపవతి, రాజపుత్రస్త్రీసాహసపుకథ, శ్రీ ఎమ్. ప్ర నారాయణమూర్తిగారిది	0	8
శ్రీనాథునివిధినాటకము	0	2
రాజయోగసారము, ద్విపద	0	4
కన్యాశుల్కము, శ్రీగురుజాడ అప్పారాయకృతము	0	12
కృష్ణాకుమారినాటకము, శ్రీసీతారామకవిగారిది	0	10
ఆంధ్రవచనభాగవతము, 3 సంపుటములు	7	0
సంగ్రహరామాయణము, సులభశైలి, శ్రీ శేషాద్రిశర్మకృతము	0	8
సంస్కృతనాటకకథలు, శ్రీసీతారామశాస్త్రికృతము, సులభశైలి	0	12

		ప్రతి 1-కి రూ
దశకుమారచరిత్రము, శ్రీ ఎనమచింతల. సంజీవరాయశాస్త్రికృతము	...	1
శివాజీచరిత్ర	...	0
శ్రీరామానుజాచార్యచరిత్ర	...	0
శ్రీశంకరాచార్యచరిత్ర, ప్రతిమతో	...	0
రామకృష్ణపరమహంసచరిత్ర	.	0
బాలగంగాధరతిలకుగారిచరిత్ర, ప్రతిమతో	..	0
దాదాభాయినౌరోజీచరిత్ర ,,	.	0
అనిబిసెంటుచరిత్ర ,,	...	0
వివేకానందస్వామి జీవితము, ప్రతిమతో	...	0
శ్రీకృష్ణదేవరాయచరిత్ర ,,	.	0
స్వామిరామతీర్థజీవితము	.	0
శ్రీగోఖలేగారి ఉపన్యాసములు	.	0
శాలివాహనచరిత్ర		0
శ్రీబుద్ధచరిత్రము	..	0
సోదరినివేదితజీవితము	.	0
రష్యను హాస్యకథలు, శ్రీ సీతారామశాస్త్రులు	..	1
మర్యాదరామన్నకథలు, చక్రపాణి	.	0
పరమానందశిష్యులకథలు	..	0
తెనాలిరామలింగనికథలు, జీవితము	.	0
[illegible]	..	0
[illegible]చరిత్ర	.	0
ఈసబునీతికథలు, క్రొత్తపుస్తకము 1-వ భాగము	..	0
,, ,, 2-వ భాగము	.	0
షేక్స్పియర్ నాటకకథలు, సులభశైలి	..	1
అరేబియన్ నైట్సుకథలు, చక్రపాణి	.	1
లార్డుక్లైవు జీవితము	.	0
శ్రీ గురజాడ శ్రీరామమూర్తిగారి ఆంధ్రకవిజీవితములు	..	2
తారాబాయి, చక్రపాణి	..	0
ఆనందమఠ, నవల, [illegible]	.	0
[illegible], నవల	..	0
మదాలస ,,	..	0
టిప్పుసుల్తాన్, నూతనకవిత్వశైలిని. శ్రీ ఉమాకాంతము గారిచే విరచితము		1
సీతారామము, శ్రీ తల్లాప్రగడ సూర్యనారాయణరావు	.	1
ఉన్మాదిని, నవల	...	0
రాధారాణి ,,	..	0

వావిళ్ల. రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్,
192, ఎస్ప్లనేడ్, చెన్నపురి